
# లోకానికి నేనే వెలుగు



ప్రార్థన శిబిరంలో
పరమాత్మతో జీవాత్మ సంబరం

సంపుటి - 41 ఏప్రిల్ - జూన్ 2018 సంచిక - 2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ
భక్త యోహాను ప్రాంతీయయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

## సంపాదక వర్గం
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ నందిపాము జోజప్ప
ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి
ఫాదర్ పిల్లి అంతోని దాస్

## గురువిద్యార్థుల బృందం
బ్రదర్ నల్ల సుధీర్ కుమార్
బ్రదర్ కుచ్చర్ల మార్టిన్
బ్రదర్ లింగతోటి రత్నకిషోర్
బ్రదర్ కత్తుల సునీల్ బాబు
బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మానూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసుబాబు
బ్రదర్ సిగినం ప్రకాశ్
బ్రదర్ యానాద్రి బాలయేసు
బ్రదర్ సూరిపోగుల వినోద్ కుమార్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com

Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-41 ఏప్రిల్ - జూన్ 2018 సంచిక-2

## ప్రార్థన శిబిరంలో
## పరమాత్మతో జీవాత్మ సంబరం

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
**ప్రధాన సంపాదకులు**
**&**
**సంచిక సంపాదకులు**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


సంపాదకీయం

**1. పరిశుద్ధ గ్రంథమున ప్రార్థనావిష్కరణము .................................... 9**
*– బ్రదర్ పాలిశెట్టి ఆనందరావు*

**2. దేవుని ప్రతిరూపాలు – ప్రార్థన............................................. 19**
*– బ్రదర్ బండి కిరణ్ కుమార్*

**3. క్రైస్తవ ప్రార్థనకు పునాదులు ................................................. 34**
*– బ్రదర్ నల్లా సుధీర్ కుమార్*


**4. ప్రార్థనలో అంతస్థులు ......................................................... 41**
*– బ్రదర్ యందవ మత్తయాస్ కుమార్*
*– బ్రదర్ వడ్లపాటి మరియదాస్*

**5. మార్మికానుభవం ............................................................ 66**
*– ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్*

**6. ప్రార్థనకు షరతులు ........................................................ 75**
*– బ్రదర్ ఏరువ బాల సుధీర్*

**7. ప్రార్థనా చికిత్స............................................................. 79**
*– బ్రదర్ జెరోమ్ ఇమ్మానువేల్ లూయిస్*

# సంపాదకీయం



దీన సేవకులమైన మన ప్రార్థనలను ఆలకింప దయతో వేచియున్న దేవుని మనం ఆరాధించాలి. మెస్సయా రాకకు ఉత్సాహపూరిత ఆశతో ఎదురు చూచిన యిస్రాయేలీయులను ప్రేరేపించారు మన దేవుడు. అలానే దైవానుగ్రహం వలన మన ఆత్మలలో రాజ్యమేలుతున్న క్రీస్తుని దర్శింప ఆశాజ్వాలతో ఎదురుచూడ మనలను ప్రేరేపిస్తున్నారు ప్రభువు. దైవకుమారుని మంచితనం, ఔదార్యాలను మనం అభినందించాలి. ఎందుకంటే, వాటితోనే గతంలో వారి ఆశలకు ప్రోద్బలం ఇచ్చింది. ఇపుడు ప్రార్థన ద్వారా మనం కూడ వాటిని ఉపయోగింప శ్రద్ధ కలిగి ఉండాలి. ఈ విధంగ మనం ఆశ్రితవరంలో నిండుగ జీవించగలుగుతాం.

పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయంలో ఆధ్యాత్మిక దైవశాస్త్రం ఒక శాఖ (ఫ్యాకల్టీ). దైవశాస్త్రాన్ని అధ్యయనం చేసే గురువిద్యార్థులు మూడున్నర సంవత్సరాలుగ "ప్రార్థన - తత్ దైవశాస్త్రం" (థియోలజీ ఆఫ్ ప్రేయర్) అనే అంశాన్ని రెండవ సంవత్సరపు గురువిద్యార్థులకు బోధించాను. ప్రార్థన గురించి ఎంతో లోతుగనున్న విషయాలను తెలుగులో పెడితే బాగుంటుందన్న ఆలోచనే కార్యరూపం దాల్చి, ఈ పుస్తకరూపంలో మీ ముందుకొచ్చింది. ఆలోచన వచ్చినదే తడవుగ గురువిద్యార్థుల సాయంతో ఆంగ్లంలో గల తరగతి ప్రతిని (క్లాస్ నోట్స్) తెలుగులోకి అనువదించాము. కొన్ని యెడల అనువాదం తేలికగా ఉంటుంది, మరికొన్ని సార్లు కష్టతరంగ ఉంటుంది. కష్టతరం ఎందుకంటె, దైవశాస్త్రానికి సంబంధించి మనం ఎప్పుడు విని ఉండని పదజాలం అక్కడక్కడ దొర్లాయి. సాధ్యమైనంత వరకు తేలిక పదాలను వాడాం. కాని, అర్థం మారకూడని చోట తప్పనిసరిగ ఖచ్చితమైన పదాలను వాడవలసి వచ్చింది. వాటిని విపులంగ తెలియజేయడానికే పారిభాషక పదకోశంను చివరిలో ఇచ్చాం. దానిని బట్టి, పాఠకులు ఆయా విషయాలను అవగాహన చేసుకుంటారని భావిస్తున్నాం.

"ప్రార్థన – తత్ దైవశాస్త్రం" ఏడు అధ్యాయాలుగ విభజించారు. మొదటి అధ్యాయం "పరిశుద్ధ గ్రంథమున ప్రార్థనావిష్కరణము"లో పూర్వ నూతన వేదాలలో ఏవిధంగ ప్రార్థన రూపంలో ఆయా ప్రముఖ వ్యక్తులు దేవునితో మాట్లాడారన్న సంఘటనలను చక్కగ విపులీకరించారు. వారు తెలిపిన ఉదాహరణల ద్వారా, మనం కూడ ఆయా పరిస్థితుల్లో భగవంతునితో సంభాషించ వచ్చునని తేటతెల్లమవుతుంది. ఈ అంశాలను తెలుగులో అందించిన బ్రదర్ పాలిశెట్టి ఆనందరావు. అందుకు వారు అభినందనీయులు.

రెండవ అధ్యాయం "దేవుని ప్రతిరూపాలు – ప్రార్థన"లో దేవుని గూర్చి, ఆయన ఒనర్చిన కార్యాలనుబట్టి ఏర్పడిన రకరకాల మనశ్చిత్రాలను పదరూపాలుగ (ఇమేజెస్) మనముందుంచారు. ఇవి బైబిలు గ్రంథంలో ఆయా కాలాలలో ప్రవక్తలను బట్టి దేవుని రూపాలు ఎలా ప్రతిబింబించాయోనని తెలిపారు. ఈ విషయాలను బ్రదర్ బండి కిరణ్ కుమార్ అనువదించి మనకు అందించారు. అందుకు వారెంతో పేర్కొనదగినవారు.

మూడవ అధ్యాయం "క్రైస్తవ ప్రార్థనకు పునాదులు"లో పూర్వనూతన నిబంధనలలోని దేవుడే స్వయంగ ఒడంబడికను ఏర్పరిచారని, ప్రార్థన ఈ బంధాన్ని గుర్తుచేస్తు, క్రీస్తు జీవితం, అతని ప్రేషితకార్యంతో ముడిపడి ఉందని, భగవంతుని ఉనికి ఎక్కడ ఉందని – ఎక్కడ ఉండాలని స్పష్టపరుస్తుంది. ఈ మంచి విశేషాలను మాజీ బ్రదర్ సుధీర్ నల్ల తెనిగించి ఇచ్చారు. అందుకు వారును ప్రస్తుతికి పాత్రులు.

నాల్గవ అధ్యాయం "ప్రార్థనలో అంతస్థులు" చాల సుధీర్ఘమైంది. ఎంత పెద్దదంటే, ఓ మూడు అధ్యాయాలను కలిపితే ఎంత అవుతుందో అంత పెద్దదన్న మాట. అందుకే దీనిని ఇద్దరు శ్రమించి వ్రాసారు. ఇందులో పునీత అవిలాపురి తెరేసా తాను పొందిన వరాల ద్వారా అనుభూతి చెంది, ఎవరూ అంత సంపూర్ణంగ ప్రార్థన గురించి అందించలేనంతగ ఆమె వివరించారు. మౌకిక, ధ్యాన, ప్రభావిత, నిరాడంబర, నిశ్శబ్ద, సాధారణ సమైక్యం, రూపాంతర సమ్మేళన ప్రార్థనలని ఏడు అంతస్థుల గురించి ఆమె మనకు నిధిని చేకూర్చారు. దీనిని బ్రదర్ యందవ మత్తయాస్ కుమార్, బ్రదర్ వడ్లపాటి మరియదాసులు తెలుగు సేతలుగ పని చేసారు. అందుకు వారు ప్రశంసలకు అర్హులు.

ఐదవ అధ్యాయం "మార్మికానుభవం"లో నిజమైన భక్తులు ఏవిధంగ దైవానుభవాన్ని పొందుతారు, అది ఎలా ఉంటుంది, అది పూర్తిగ దేవుని అనుగ్రహమని, దాని వలన సంభవించే ఫలాలు, సూచికలు, పంచగాయాల గుర్తులు, అనేక పునీతులలో మనం గమనించిన ఆ సంభవాల గూర్చి ప్రస్ఫుటంగ తెలియపరచారు. ఈ 19 ఉప ఉత్పత్తులు (అనుభవాలు) అందరికి సాధ్యం కాదు. కొంతమంది మార్మిక పునీతులకు దేవుడు ఉచితంగ ఇచ్చిన బహుమతులు. ఆయన మహిమార్థం అరుదుగ మాత్రమే దక్కిన వరాలు. ఇది కొద్దిగ కఠినమైన అంశమని నేనే తీసికొని తర్జుమా చేసాను.

ఆరవ అధ్యాయం "ప్రార్థనకు షరతులు"లో ప్రార్థన చేసుకోడానికి అవసరమైన విధులు గురించి తెలిపారు. నిజాయితితో కూడిన ఆశ, మన మానవ బలహీనతల ఒప్పుదల, నిజమైన భక్తిలో శోధనలు ప్రార్థనకు ఆటంకపరచవని, ప్రార్థనా విధానం, మున్నగు విషయాలను వివరిస్తుంది. దీనిని బ్రదర్ ఏరువ బాల సుధీర్ భాషాంతరీకరణం చేసారు. వారును అభినుతికి ఔచితులు.

ఏడవ అధ్యాయం "ప్రార్థనా చికిత్స"లో అనారోగ్యాన్ని అంగీకరించుట, స్వస్థత పొందుటకు నిజమైన ఆశ, కోపతాపాలను విడనాడుట, కలతలను విడిచిపెట్టుట, స్వస్థతయందు ప్రగాఢ విశ్వాసం, యేసు స్వస్థతాశక్తిని నమ్ముట వంటి విషయాలను వివరించారు. అలాగే ప్రార్థనా చికిత్సకు అవసరమైన పది అంశాల అభ్యాసం గురించి తెలిపారు. దీనిని బ్రదర్ జెరోమ్ ఇమ్మానుయేల్ లూయిస్ అనుభాష చేసారు. వీరును సంభావనకు యోగ్యులు.

ఈ విధంగ సహకరించిన రచయిత గురువిద్యార్థులకు వందనాలు. సహకరించిన తోటి సంపాదకులకు నమస్సుమాంజలులు. ప్రతులను పంపిణీ చేయుటలో ఉపయుక్తంగ సాయమందించిన విద్యార్థి బృందానికి మా హృదయపూర్వక సన్నుతులు. హోలిక్రాస్ ప్రింటర్స్‌కు, సహకరించిన వారందరకు, ముఖ్యంగ మా ప్రియ పాఠకులకు ప్రశంసలను అందిస్తున్నాం.

ఇట్లు ప్రభు సేవలో...

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**

సంచిక సంపాదకులు

# 1. పరిశుద్ధ గ్రంథమున ప్రార్థనావిష్కరణము

– బ్రదర్ పాలిశెట్టి ఆనందరావు

## A. పూర్వ నిబంధనయందు ప్రార్థనావిష్కరణ



### 1. ప్రార్థన విషయంలో దేవుడే ముందుగ చొరవ (Initiative) తీసుకుంటాడు.

అలా ప్రార్థనయందు ముందుగ చొరవకు కారణం దేవుని ప్రేమ. అది ప్రేమయొక్క ప్రాథమిక చొరవ. మానవున్ని దేవుడు తన రూపంలోను, పోలికలోను సృష్టించాడు. అతను తన నిజ రూపంలో సృష్టించాడు. కనుక, మానవుని రూపం పరిపూర్ణత గలది. కాని, ఆ రూపం పాపం వలన పాడయింది. దేవుని దర్శనం మరుగయింది. ఇపుడిక మానవుడు దేవుని ముఖాన్ని చూడలేని పరిస్థితి. అయిన, దేవుడు అతనిని విడిచిపెట్ట లేదు. దేవుడే ముందుగ చొరవ తీసుకుంటున్నాడు: "ఓయి, నీవు ఎక్కడ నుంటివి?" (ఆది. 3:9). ఆ ప్రశ్నకు మానవుడు ప్రార్థన రూపంలో జవాబు ఇచ్చాడు. దేవుడు మనలను పిలుస్తున్నాడు. అపుడు మనం తప్పక ఇలా చెప్పాలి – "ప్రభూ! నేను ఇక్కడ ఉన్నాను." పతనం తరువాత, దేవుడు ఆదామును పిలుస్తున్నాడు. కనుక, ప్రార్థన అన్నది దేవునినుండి వచ్చిన మొదటి చొరవ వలన ప్రారంభమవుతుంది. దేవుడు మనతో సంధిల్లుటకు (Encounter) మనలను పిలుస్తాడు.

### 2. ప్రథమ సంతానాన్ని లేక తొలి పంటను, ప్రథమ ఫలాలను అర్పించడమూ ప్రార్థనే

అర్పణలు లేక బలుల రూపంలో కూడ ప్రార్థన ఉంటుంది. ఉదాహరణకు, కయీనుని, హేబెలుని అర్పణలు: హేబెలుని తొలిచూలి అర్పణలు, కయీనుని

ప్రథమ ఫలాల అర్పణలు (ఆది.4:3,4), నోవా బలి సమర్పణ (ఆది.8:20), అబ్రహాము ఒడంబడిక సమయంలో బలి సమర్పణ (ఆది. 15:9). ఈసాకుని బలిగ అర్పించుట (ఆది. 22:13) మున్నగు బలియర్పణలు అనేకంగ మనం పూర్వనిబంధనలో చూడగలం.

## 3. గట్టి విశ్వాసం కూడ ప్రార్థనే

ఆదికాండం 12:1 లో అబ్రహాముని పిలుపుతో హీబ్రూజాతి యొక్క ప్రత్యేక ఎన్నిక ప్రారంభమైన వైనం మనకు తెలుసు. ఆతని కుమారుడు ఈసాకు ద్వారా ఆ ఎన్నిక కొనసాగింది. అబ్రహాము ద్వారా భూమి యంతటగల సమస్త కుటుంబాలు ఎవరికివారు దీవించుకుంటారు (ఆది. 12:2-3). అబ్రహాముని దైవపిలుపు ద్వారా ఆతని సంతతికి మాత్రమేగాక, ఇతర కుటుంబాలకు కూడ దీవెనలు లభించాయి. ఆదికాండము 18:16-33 లో సొదొమ గొమొర్రా పట్టణాల నిమిత్తం అబ్రహాముని ప్రార్థన, తాను పొందిన దైవపిలుపుకు తగిన స్పందనని కథనం చెబుతుంది. అబ్రహాము దైవ సన్నిధిని నిలిచి ప్రార్థించుటకుగల కారణం, మొదట దేవుడే పిలుపు-వాగ్దానాల ద్వారా అబ్రహామును కలిసాడు. ఈ సంఘటన ఆధారంగానే అబ్రహాము మానవ పాపము యెడల వ్యవహరించు దైవ న్యాయం, దైవ శక్తి విధానంను గుర్తించి, దైవకృప కోసం బ్రతిమిలాడాడు. అతడు దేవునితో, దేవుడు మరొక మానవ వ్యక్తి అయినట్లు, గీచిగీచి బేరమాడాడు.

## 4. దేవునితో కుస్తీ పట్టడం వంటిది ప్రార్థన

యాకోబు దేవునితో కుస్తీపట్టాడు. అందుమూలంగ అతను దేవునినుండి ఉపకారాలు, దీవెనలు పొందాడు. అతడు పొందిన దీవెనలలో ఘనమైనది "యిస్రాయేలు" అనే పేరును బిరుదుగా పొందుట. యిస్రాయేలు అనగ "దేవునితో పెనుగులాడుట" అని అర్థం (ఆది. 32: 22-29).

## 5. విన్నప ప్రార్థన, మోషే ప్రార్థనలో విశదమవుతుంది

యిస్రాయేలీయులందరు ఏకప్రజగ ఏర్పడడానికి, పాతనిబంధనలో ఎంతో ప్రార్థనాపరుడైన మోషే ప్రభావం కనబడుతుంది. నిర్గమకాండంలో దేవుడు మోషేతో ఒక స్నేహితునిలా, ముఖాముఖిగ సంభాషించడం మనం గమనించవచ్చు. మోషే,

యెహోషువాతో కలిసి, సీనాయి పర్వతం మీదకు వెళ్లడం, ఆతని ప్రార్థనా తత్వానికి ఒక గొప్ప ఉదాహరణ. ఐగుప్తు బానిసత్వం నుండి తీసుకువచ్చిన నా ప్రజలు, ఒక బంగారు దూడను తయారుచేసి, దానిని ఆరాధిస్తున్నారని యావేప్రభువు మోషేతో పలికారు. అందుకుగాను, యావే వారందరిని నాశనం చేయాలనుకుంటారు. కాని, మోషే యావేను ప్రార్థిస్తూ, ప్రభువు అబ్రహాముతో చేసిన ప్రమాణమును గుర్తు చేస్తు, యిస్రాయేలీయుల గురించి అర్థిస్తాడు. ఈ వృత్తాంతం ప్రార్థనకు ఒక గొప్ప ప్రతీకలా కనబడుతుంది (నిర్గమ 32: 11-14).

## 6. దేవునికి మన కృతజ్ఞతానుభవంగ ప్రార్థన

నిర్గమకాండం 15: 20 వ వచనం గమనిస్తే, మిరియము ఒక ప్రవక్త్రినిలా, ఆహరోనుని సోదరిలా పరిచయమవుతుంది. ఎర్రసంద్రం దాటే ముందు, ఈమె కొందరు స్త్రీలతో కలిసి, నృత్యంతో, పాటలతో దేవునికి కృతజ్ఞతలు అర్పించింది. ఈమె ప్రార్థన, దేవుడు యిస్రాయేలీయులను దాస్య విముక్తి గావించిన శక్తిమంతమైన దేవునిగ సూచిస్తుంది.

## 7. ప్రార్థన: స్తుతిస్తోత్ర గీతం

పాతనిబంధనలో హన్నా పాడిన స్తోత్రగీతం చాలా అందమయినది. ఈమె ప్రవక్త సమూవేలు తల్లి. ఈమె షిలో దేవాలయం వద్ద తనకు ఒక కుమారుని దయచేయుమని దేవునికి నిశబ్దంగ ప్రార్థన చేసింది (1సమూ. 1: 11). సమూవేలు జననం తరువాత అతనిని దేవాలయానికి తీసికొచ్చి, అతడు బ్రతికి ఉన్నంతకాలం దేవునికి సేవ చేయాలని అర్పిస్తుంది. ఈ సందర్భాన్నే ఒక స్తుతిస్తోత్ర గీతంగ మలిచింది. స్తోత్రగీతం దేవునికి తన ప్రజలకు మధ్యగల సత్సంబంధం గురించి తెలియజేస్తుంది.

## 8. దేవునికి కృతజ్ఞతగ ప్రార్థన

సౌలు తరువాత, దావీదును దేవుడు యిస్రాయేలీయులకు రెండవ రాజుగ ఎన్నిక చేసారు (1రాజులు 8: 15-53). దావీదు అన్ని తెగలను ఏకము చేసి, జెబుసీయుల నగరమైన యెరూషలేంను రాజధానిగ చేసాడు. దావీదు, దేశప్రజలందరి ప్రతినిధిగ - ప్రజలకోసం, తనకోసం ప్రార్థనలు సలుపుతు

ఉండేవాడు. తన వారసుల గురించి, తన కుటుంబం గురించి నాతాను ప్రవక్త ప్రవచించిన తరువాత, దావీదు దేవునికి కృతజ్ఞత ప్రార్థనను చేసాడు. ఇది దావీదు మహారాజునుండి వెలువడిన ఒక గొప్ప ప్రార్థనగ మనకు పరిశుద్ధ గ్రంథంలో కనబడుతుంది. ఈ ప్రార్థన దేవుడు అబ్రహాముతో చేసిన ఒడంబడికను సూచిస్తుంది. రాబోవు తరాల గురించి కూడ తెలియజేస్తుంది. దావీదు ఐగుప్తు బానిసత్వంనుండి నడిపించినందుకు దేవునికి కృతజ్ఞత తెలుపుతు, అదే విధంగ తనని, తన కుటుంబాన్ని, తన ప్రజలను రాబోవు రోజులలో కూడ ఆశీర్వదించాలని దేవున్ని బ్రతిమిలాడాడు (2 సమూ 7:18-29).

## 9. మానవ అవసరాలకు దేవుని కృపగల జవాబుగ ప్రార్థన

సలోమోను, తాను కట్టించిన దేవాలయంలో యావేపీఠం చెంత నిలబడి, దేవుని ప్రార్థించాడు (1 రాజులు 8:22-53). ఇతను తన తండ్రి దావీదు చేసిన ప్రార్థనలోని విషయాలను జ్ఞప్తికి తెచ్చుకొని, ప్రార్థనయొక్క ప్రాముఖ్యతను ఎలుగెత్తి చాటాడు. తన ప్రజల దేవునికి ఎల్లవేళలా ప్రార్థించడానికి దేవుడు ఎప్పుడు దేవాలయంలో ఉండేవాడని సలోమోను విశ్వసించేవాడు. ఈ సుందరమైన ప్రార్థనలో సలోమోను దేవున్ని ప్రజల అవసరాలలో ఆదుకొనే ఒక కరుణామూర్తిగ అభివర్ణించాడు. యిస్రాయేలీయుల జీవితంలో దేవాలయం ఎంత ముఖ్యమైనదో ఇక్కడ తెలియజేసాడు.

## 10. బాధలలో ప్రార్థన

ప్రవక్తలందరు ప్రార్థనాపరులే. ప్రవక్త పరిచర్యకు పొందిన ప్రేరణలో దేవుని ఉనికి, అతని చర్యలు కనిపిస్తాయి. ఎందుకంటె, ఇది ఒక సహజమైన ప్రతిస్పందన. యిర్మియా ప్రవక్త పరిచర్య జీవితానికి అనేకమార్లు బబిలోనియా రాజైన నెబుకద్నేజరు ద్వారా దాస్యానికి గురియైన యెరూషలేం దేవాలయానికి సారూప్యం కనబడుతుంది. ఈ ప్రతికూల సమయంలో ప్రవచించడం యిర్మియాకి ఒక మనో వేధనలా మారింది. తన ప్రజలను శిక్షించడం ద్వారా శుద్ధిచేయాలనే దేవుని నిర్ణయం ప్రవక్తకు స్పష్టంగ తెలిసివచ్చింది. ఈ ఉదంతం, దేవుడు మోషేతో ఎడారిలో పలికిన మాటలను జ్ఞప్తికి తెస్తాయి. అదే విధంగ దేవుడు, యిర్మియాను

తన ప్రజల గురించి తనకు మొరపెట్టవద్దని చెప్పారు. కాని యిర్మియా యిస్రాయేలీయుల శత్రువుల పతనం గురించి దేవునికి మొరపెట్టుకుంటాడు. ఇది ఒక పశ్చాత్తాప ప్రార్థనగ కనిపిస్తుంది.

## 11. దేవునికి స్తుతిగీతముగ ప్రార్థన

అస్సిరియనుల దండయాత్రల కాలంలో ఒక చిన్న కథయిన యూదితు గ్రంథం పూర్వనిబంధనలో కనిపిస్తుంది. యూదితు ఒక గొప్ప యూదాస్త్రీ. ఈమె అస్సిరియారాజు నెబుకద్నెసరు కుడిభుజమైన హొలోఫెర్నెసును హతమార్చింది. ఈమె యూదా ప్రజలందరికి ఒక ప్రతీకలా కనబడుతుంది. ఇది కల్పితకథ అయినప్పటికి, దేవునికి యిస్రాయేలీయుల మధ్య సంబంధం వాస్తవమని చెబుతుంది. ఇది యిస్రాయేలీయులు తమ శత్రురాజులతో పెట్టుకున్న వైరమని విశదమవుతుంది. అస్సిరియనుల గుడారంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నపుడు యూదితు దేవునికి ప్రార్థన చేస్తుంది. గొప్ప శక్తిని తనకు ప్రసాదించమని దేవునికి మొరపెడుతుంది (యూదితు 9 అ.). ఎప్పుడైతె తాను హొలోఫెర్నెసుని చంపి తలను యిస్రాయేలు గుడారాల దగ్గరకు తీసుకువస్తుందో అపుడు ఈ స్తుతిగీతాన్ని పాడుతుంది (అ.16.).

## 12. కీర్తనలు కూడ ప్రార్థనలే

కీర్తనలు సామూహిక ప్రార్థనలు. అవి గొప్ప కవితా ఖండికలు. అవి ప్రార్థనకు ప్రసన్నమైన రూపాలు. సామూహికమైనను వ్యక్తిగతంగ కూడ ఈ కీర్తనలు ఉపయోగపడతాయి. యిస్రాయేలు చరిత్రను, దేవుని వాగ్దానాలను, యిస్రాయేలీయుల ఎదురుచూపులను, వారు దేవునిపై పెంచుకున్న నమ్మకాలను గుర్తుచేస్తాయి. ఈ కీర్తనలు యేసుప్రభువులో నెరవేరాయి. కీర్తన, ప్రార్థన రూపంలోనున్న దైవవాక్కు అని మనం గ్రహించాలి.

## B. నూతన నిబంధనలో ప్రార్థనావిష్కరణ

నూతన నిబంధనలో ఎంతోమంది పుణ్య పురుషులు, పుణ్యస్త్రీలు ప్రార్థనకు గొప్ప ఔన్నత్యాన్ని చేకూర్చారు. అందులో ఇద్దరు గొప్ప వ్యక్తులను గూర్చి తెలుసుకుందాం. మొట్టమొదటిగ, క్రీస్తుప్రభుని తల్లియైన మరియను గూర్చి చూద్దాం. ఈమె రాబోవు మెస్సియా కోసం ప్రజల సిద్ధపాటులో దేవుడు ఎంచుకున్న మహిళ. రెండవదిగ, క్రీస్తుప్రభువు. ఇతని ఆదర్శ జీవితం క్రైస్తవులందరికి గొప్ప సుమాతృక.

## 1. యేసుని తల్లి, మరియ

గబ్రియేలుదూత చెప్పిన మాట ప్రకారం దేవుని రక్షణ ప్రణాళికను నెరవేర్చుటలో మరియతల్లి పాత్ర మనకు స్పష్టమవుతుంది. దేవదూత ప్రతిపాదనకు ఆమె ప్రతిస్పందన, అంగీకారం అంతా తండ్రి దేవుని చిత్తానికి ఆమె పరిపూర్ణ సమర్పణ అని, దేవదూత సందేశం ద్వారా తెలియజేసారు (లూకా 1:38). ఆమె ఆదర్శ జీవితం ద్వారా దేవుని పరిపాలనను వ్యక్తం చేస్తుంది.

మరియతల్లి పరిపూర్ణ ప్రార్థనను మనం ఆమె స్తోత్రగీతంలో కనుగొనవచ్చు. ఆ స్తోత్రగీతం మూడు భాగాలు కలిగి ఉంది. మొదటి భాగంలో మరియతల్లి, దేవుడు తనకు చేసిన సకల మేలులకు స్తోత్రంగ కృతజ్ఞతలు తెలుపుతుంది (లూకా 1:46-49). రెండవ భాగంలో, దేవుడు తమ పితామహులకు ఏ విధంగ సహకరించాడో తెలుపుతుంది (లూకా 1:50-53). మూడవ భాగంలో, తమ పితామహులగు అబ్రహామునకు, అతని సంతతివారికి తరతరముల వరకు చేసిన వాగ్దానాల గురించి తెలుపుతుంది. లూకా 2:19, 2:5 వచనాలు దేవదూత మరియతల్లికి చెప్పిన శుభవార్తను తన మనస్సున పదిలపరచుకొని, మననం చేయుటను గూర్చి విశదపరుస్తాయి. ఇది ఆధ్యాత్మిక అభివృద్ధికి అవసరమైన ప్రార్థన యొక్క జీవిత పరిమాణం. మరియతల్లి ప్రార్థన మధ్యవర్తిత్వం, ఆమె ప్రార్థనా వేడుదల కానాపల్లె పెండ్లివిందు సన్నివేశంలో బయలుపడింది.

మరియతల్లి విశ్వాసులందరికి తల్లి. క్రీస్తుప్రభువు మరియతల్లిని కానాపల్లె పెళ్లిలోను, సిలువలో వ్రేలాడినపుడును "స్త్రీ" అని సంబోధిస్తాడు (యోహాను 2:4, 19:26). ఇందుకు ఆధారం ఆది. 3:15. అందుకే పౌలు కూడ "స్త్రీ నుండి" అనే పదజాలం వాడాడు (గలతీ. 4:4). మరియతల్లి క్రీస్తుప్రభువుకి మాత్రమే తల్లి కాదు, క్రీస్తునందు విశ్వాసముంచు వారందరికి తల్లి. కానాపల్లెలో సూచించిన మధ్యవర్తిత్వం పెండ్లివారి తరపున నెరపినది. దీనిని పరిశుద్ధ గ్రంథమందు రెండు సన్నివేశాలలో చూడవచ్చు: మొదటిగ, శిష్యులు, మరియతల్లి యెరూషలేంలో నివసించిన మేడగదిలో ఉండి, ప్రార్థించినపుడు (అ.కా. 1:13-14); రెండవదిగ,

దర్శన గ్రంథంలో మరియతల్లిని ఒక మహత్తరమైన స్త్రీగా ఉద్ఘాటించినపుడును (దర్శన 12:1–17), మరియతల్లి మానవరక్షణలో ప్రత్యేకమైన పాత్రను పోషిస్తు, అటు యిస్రాయేలు ప్రజలకు, ఇటు నూతన యిస్రాయేలు ప్రజలైన క్రైస్తవులకు ఒక వారధిలా ఉంది. ఎందుకంటె, మరియతల్లి ప్రార్థనా వేదుదల క్రీస్తుప్రభువులో సత్యసంబంధాన్ని కలిగి ఉంది. క్రీస్తుప్రభువు ఒక్కడే దేవునకు మానవులకు మధ్యవర్తి. ఆయనద్వారా మరియతల్లి వేదుదల తండ్రిదేవుని చేరుతాయి. క్రీస్తుప్రభువు మనకు ఒక మాదిరి, పరిశుద్ధాత్మ వరాలను మనలో నింపి, మనం ప్రార్థన చేసుకోడానికి శక్తిని అనుగ్రహించాడు.

## 2. యేసుప్రభువు – ఆతని ప్రార్థన

యేసుప్రభువును అనుసరించిన పురుషులు, స్త్రీలు అతనిలోగల దేవుని కృపను చవిచూచి, ఆయన శిష్యులుగ మారారు. క్రీస్తుప్రభువు తన మాటలు, కార్యాలు, అద్భుతాలు, స్వస్థతలు, అనుబంధాలతో అనునిత్యం దేవుని మహిమ పరుస్తు, మనలోగల పాపాలను తన సిలువ, మరణ, పునరుత్థానాల ద్వారా తొలగించాడు. అదే విధంగ, మనమందరం క్రైస్తవులుగ పిలువబడుతు, యేసుక్రీస్తులో తండ్రి దేవున్ని చూడగలుగుతున్నాం. యేసుక్రీస్తు బోధనలను అనుసరిస్తున్న మనమందరం ఆయన ఆలోచనలను మనలో నింపుకోడానికి ప్రార్థన గొప్ప సాధనం. ఈ ప్రార్థన గురించి పరిశుద్ధ గ్రంథంలో సువార్తికులు చెప్పినదానితో మన ప్రార్థన అనుభవాన్ని పోల్చడానికి క్రీస్తుప్రభువు దగ్గరకు మనం తిరిగిరావాలి.

### a) యేసు ప్రార్థన

తరచుగ యేసుప్రభువు ప్రార్థన చేసేవారని సువార్తలు తెలియజేస్తాయి. సువార్తికులు ఈ సంఘటనలను గ్రంథస్తం చేయడానికి ప్రత్యేక శ్రద్ధను కనబరచారు. ఈ విషయాలను ఈ క్రింది వచనాలు తెలియజేస్తాయి.

లూకా 3:21; మార్కు 1:1; మత్తయి 3:12; లూకా 6:12; మార్కు 3:13; మత్తయి 10:1; లూకా 11:1; మత్తయి 6:9; లూకా 9:18; మార్కు 9:2; మత్తయి 17:1–2. క్రీస్తుప్రభువు ఒక యూదుడుగ ఉంటు, యూదునివలె ప్రార్థించాడు. అతడు భోజనమునకు ముందు వెనుక ప్రార్థించేవాడు (మత్తయి

4:19; 15:36; 26:26-27). అతడు దైవారాధనలో పాల్గొనేవాడు (మత్తయి 9:35; మార్కు 1:21-31; లూకా 4:16-28). క్రీస్తుప్రభువు దేవాలయంను కాలానుగుణంగ సందర్శించేవాడు (మార్కు 11:17). ఈ విషయాలన్ని క్రీస్తును ఒక గౌరవప్రదమైన యూదునిగ నిలబెడుతున్నాయి.

## b) యేసుని వ్యక్తిగతమైన, యాద ృచ్ఛికమైన ప్రార్థన

యేసుప్రభువుకు ఒక విశేషమైన, ప్రత్యేకమైన విషయం ఉంది. అదే అతని వ్యక్తిగత, యాదృచ్ఛిక ప్రార్థన. క్రీస్తు ప్రార్థన చేసుకోడానికి పర్వతం మీదకో, నిర్జన ప్రదేశానికో, తోటలోనికో వెళ్లేవాడు (మార్కు 1:35; 6:46; 14:32; లూకా 6:12). ఈ విధంగ యేసు ఏకాంతంగ నిర్జన ప్రదేశాలలో గడపడం ద్వారా తండ్రితో మరింత సమయం ప్రార్థనలో లీనమయ్యేవాడు. మరీ ముఖ్యంగ యేసుప్రభువు ఎందుకు ఏకాంతంగ ప్రార్థించేవాడంటె, తండ్రి పరమ రహస్య మార్గాలను గుర్తించడానికి, ఆయన చిత్తాన్ని గ్రహించడానికి, సర్వ మానవాళిని దేవునితో అనుసందానం చేయడానికి. ఇక్కడ మనోహర ప్రతిబింబమైన ప్రత్యక్షతలో దైవీక రహాస్యాలను తెలుసుకొని, అందులో మానవాళిని బలపరుస్తు జీవించడానికే ప్రభువు అంతలా ప్రార్థించేవాడు.

## 3. క్రీస్తు పుత్రయోగ్యమైన సంబంధం

క్రీస్తుప్రభువు తండ్రిని “అబ్బా” అని పిలిచాడు (యోహాను 17:1-2). ఇది దేవుని ప్రార్థించే ప్రేమపూర్వక, గౌరవప్రదమైన విధానం. ఇది యూదులకు ఆశ్చర్యకరమైనది. యేసు, తండ్రితోగల సత్యబంధాన్ని నిరంతరం అన్యోన్య ప్రేమానురాగాలతో జీవిస్తు, నమ్మకం - ప్రేమ - గౌరవం అనే విలువల ద్వారా సుస్పష్టం చేసాడు.

## 4. తన మాతృక ద్వారా మరింత

క్రీస్తుప్రభువు ఉపమానాల ద్వారా, మాటలతో హెచ్చరించారు: పరిసయ్యుడు దేవాలయంలో నిలుచుండి, తనలోతాను,”ఓ దేవా! నేను ఇతరులవలె లోభిని, అన్యాయము చేయువాడను కాను. ఈ సుంకరివంటి వాడనుకాను” అని ప్రార్థించాడు. కాని సుంకరి దూరాన నిల్చొని, “ఓ దేవా! ఈ పాపాత్ముని

కనికరింపుము” అని ప్రార్థించాడు (లూకా 13:10–14). కపట భక్తులవలె మిమ్ములను చూచుటకై ప్రార్థన చేయవలదు (మత్తయి 6: 5). ప్రభూ, అని నన్ను సంబోధించు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు, కాని పరలోకమందలి నీ తండ్రి చిత్తానుసారముగ వర్తించువాడే పరలోకరాజ్యమున ప్రవేశించును (మత్తయి 7:21). నా ఆలయము ప్రార్థనాలయము అనబడును అని వ్రాయబడి ఉన్నది. కాని, మీరు దానిని దొంగల గుహగ చేయుచున్నారు (మార్కు 11:17; మత్తయి 21:13; లూకా 19:4–6). మన అవసరాల గురించి దేవునికి తెలియవలసిన అవసరం లేదు అని యేసు అంగీకరిస్తున్నప్పటికి, ఆ తండ్రికి మన మనవులను ప్రార్థనలో నొక్కివక్కాణించాలని ప్రభువే చెప్పాడు. ఎందుకంటె, మనమందరం అతని అనుగ్రహ శక్తితోనే ఈ లోకంలో ముందుకు సాగుతున్నాం. విన్నప ప్రార్థన దేవుని చిత్తాన్ని మార్చడానికి కాదుగాని, దేవుని సేవాసంకల్పంలోనికి ప్రవేశించడానికి మాత్రమే! మనం దేవునియందు విశ్వాసంలో ఎదుగుతు, మన అవసరాలను ఆయనకు విన్నవించుకోవడం ద్వారా, మనం అనునిత్యం ఆయనపై ఆధారపడి జీవిస్తున్నాం.

## 5. ప్రార్థన విశ్వాసపూరితమై ఉండాలని యేసుని ఉద్ఘాటన

యేసు, విశ్వాసం ప్రార్థనల మధ్య ఒక సన్నిహిత సంబంధాన్ని చూసాడు. అతడు తరచుగ ప్రార్థన గురించి ఉపదేశించినపుడు విశ్వాసంతో ప్రార్థన చేయుమని చెబుతాడు. క్రీస్తుప్రభువుకి విశ్వాసం అంటే, దేవునియొక్క సంపూర్ణ శక్తిలో నమ్మకముంచి, దేవుని దయపై ఆధారపడడం. సువార్తల నుండి మనకు అనేక ఉదాహరణలు ఉన్నాయి (మత్తయి 8:5–13; మార్కు 7:24–30; 9:23; 11:24).

## 6. దైవ చిత్తాన్ని నెరవేర్చుటయే యేసుని ప్రార్థన

ప్రార్థన అనేది మన ఆలోచనలకు తగిన విధంగ ఉంటు, మనయందు దేవుని నిలుపుటకు ఉపయోగపడుతుంది. కాని దేవుడు కోరుకుంటున్న విధానంలో మనలను ఆయనతో కలుపుతుంది. ఇది మన యేసుప్రభువులో స్పష్టంగ చూడవచ్చు (మత్తయి 11:22–26; లూకా 10:21–22). సువార్త పరిచర్యలో క్రీస్తుప్రభువు తండ్రి చిత్తాన్ని నెరవేర్చడానికి తననుతాను సంపూర్తిగ అర్పించుకున్నాడు. దీనికి

చక్కటి ఉదాహరణ గెత్సమని తోటలో క్రీస్తుప్రభుని ప్రార్థన (మార్కు 14:36). యేసుప్రభువు గెత్సమనె తోటలో ప్రార్థించినపుడు మనం రెండు విన్నప ప్రార్థనలను గమనించవచ్చు. మొదటిది, అతని ప్రాణాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని నిర్దేశిస్తుంది. రెండవది, దేవుని చిత్తం నెరవేరాలన్న కోరిక.

## 7. దేవుడు కేంద్రీకృతమైన ప్రార్థన

యేసుప్రభుని ప్రార్థన దేవునిపై కేంద్రీకృతమై ఉంటుంది. క్రీస్తుప్రభువు మనందరికి ఈ విధముగ చెబుతున్నారు: "మొదట ఆయన రాజ్యమును, నీతిని వెదకుడు. అప్పుడవి అన్నియు మీకు సమకూరును" (లూకా 12:31; మత్తయి 6:33). మన ప్రార్థన దేవునితో కేంద్రీకృతమై ఉండాలంటే, యేసు ప్రబోధించిన పరలోక ప్రార్థనను తెలుసుకుందాం. ఈ ప్రార్థననే శ్రీసభ యుగయుగములుగ పునరావృతం చేస్తుంది (మత్తయి 6:9-13; లూకా 11:2-4).

❋ ❋ ❋ ❋

# ౨. దేవుని ప్రతిరూపాలు - ప్రార్థన

- బ్రదర్ బండి కిరణ్ కుమార్

## A. దేవుని ప్రతిరూపాలు



మనలో చాలామంది వారి జీవితార్థాన్ని తెలుసుకోడానికి ఉపయోగపడిన దేవునియొక్క కొన్ని రూపాలవైపు ఆకర్షితులౌతారు. ఉదాహరణకు: దేవుడు ప్రేమకలిగిన సృష్టికర్త – ఒక రూపం. కాని, మనిషి జూదంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని స్వార్థబుద్ధితో కోరుకుంటె నెరవేరేది కాదు. నిజంగ ప్రాణపాయంలోనున్న వ్యక్తుల మొరలను కచ్చితంగ ప్రేమగల దేవుడు ఆలకిస్తాడు. మనం దేవునియొక్క ఒక రూపంను మనస్సులో పెట్టుకొని, అదే కచ్చితమని, దానినే పట్టుకొని వ్రేలాడుతు ఉన్నట్లయితే అకస్మాత్తుగ ఈ రూపానికి విరుద్ధమైన చేదు సంఘటనలు మన జీవితంలో చేటుచేసుకున్నప్పుడు మన మనస్సులో ఉన్న రూపం మారడమో లేదా మనం మన విశ్వాసాన్ని కోల్పోవడమో జరుగుతుంది.

బాల్యదశలో ఉన్నపుడు మనం మన తల్లిదండ్రులను ఒక విధంగ అర్థం చేసుకుంటాం. వయస్సు పెరుగుతున్నకొలది, మన మనోవికాశం అభివృద్ధి చెందుతున్నకొలది, మన తల్లిదండ్రులను లోతైన భావంతో అర్థం చేసుకుంటాం. ఈ విధంగానే, మనం దేవుని విషయంలో కూడ అర్థం చేసుకుంటాం. అనేక సందర్భాలలో మనం దేవున్ని అసంపూర్ణమైన రూపాలకే పరిమితం చేస్తాం. ఉదాహరణకు: యోబు విషయంలో ఒకవైపు స్నేహితులు దేవున్ని శిక్షించే వ్యక్తిగానే చూసారు. మరోవైపు యోబు తన బాధలకు అర్థాన్ని ఒసగే దేవుని కొరకు

అన్వేషిస్తున్నాడు. కావున, యోబు తన బాధలలో దేవునియొక్క ప్రతిరూపాలను అర్థం చేసుకొనే ప్రక్రియలోనే ఎదిగాడు.

దేవుడు తననుతాను వ్యక్తపరచుకోడానికి అనేక విధాలైన వచనాలను, రూపాలను ఎన్నుకున్నాడు. అబ్రహాము దేవుడు, ఈసాకు దేవుడు, యాకోబు దేవుడు, ఐగుప్తు బానిసత్వంనుండి విడిపించిన దేవుడు, బబులోనియా బంధాలనుండి కాపాడిన దేవుడు, ప్రవక్తల, కీర్తానాకారుల దేవుడు, నూతన నిబంధనలో త్రీత్వైక దేవునిగ తననుతాను బయలు పరచుకున్నాడు. ఈ దేవున్ని మనం ఏరకమైన వచనాల, రూపాల ద్వారా పూర్తిగ ఎన్నడు అర్థం చేసుకోలేము. మనకున్న దేవుని ప్రతిరూపాలు కొంతకాలం మాత్రమే సంతృప్తిని ఇవ్వవచ్చు, కాని మన ప్రతిదిన అనుభవాలు మనకున్న దేవుని రూపాలకు సంపూర్ణమైన అర్థం చేకూరునట్లు ప్రోత్సాహిస్తాయి. మన వ్యక్తిగతమైన ప్రతి సమస్య, మనకున్న దేవుని ప్రతిరూపంను ప్రస్తుత సందర్భంలోని ప్రాముఖ్యతలోనికి తీసుకొస్తాయి. ఈ సమస్యల తదుపరి మన జీవితం మారిపోతుంది. మనం బాహాటంగ దేవుని చిత్తాన్ని స్వీకరిస్తు, జరిగిన సంఘటనను మరచిపోడానికి ప్రయత్నించినపుడు కూడ, మనం దేవున్ని, పొరుగువారిని, మనసొంత వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకొనే తీరు పూర్తిగ మారిపోతుంది. కనుక సమస్యలు ఎదురైనపుడు, దేవున్ని ప్రశ్నించడం వలన కొందరు వారి విశ్వాసాన్నే కోల్పోతారు లేదా ఇంకొందరు వారి విశ్వాసాన్ని పతిష్టం చేసుకుంటారు. ఒక వ్యక్తి సమస్యల వలన మతాన్నే విడనాడవచ్చు లేదా యోబు వలె సమస్యలలో జీవిత పరమార్థంను కనుగొనవచ్చు. ఒకవ్యక్తి తనకున్న దేవుని ప్రతిరూపంను పునరణ్వేషన చేయడానికి అంగీకరించడం ద్వారా తనకున్న విశ్వాసంను కోల్పోకుండ దానిని ద ృఢపరచుకుంటాడు. మనకున్న దేవునియొక్క రూపాలు చాలాసార్లు మన బాల్యంలోని అనుభవాల మీద ఆధారపడి ఉంటాయి.

## 1. హెబ్రీయుల గ్రంథంలో దేవునియొక్క ప్రతిరూపాలు

ప్రతి క్రైస్తవునికి, ఉన్న రెండు సృష్టి కథనాలలో ఒకటైనా కచ్చితంగ తెలిసుంటుంది. ఆదాము, అవ్వ, ఏదోను తోటలో వారి జీవనం, అవిధేయత, తోటనుండి బహిష్కరణ, నోవా ఓడ కథనం, అబ్రహాము గురించున్న అనేక కథలు,

ముఖ్యంగ తన సొంత కుమారుని బలిగ ఇవ్వడానికి సిద్ధపడిన సంఘటనలు గుర్తుకొసాయి. ఐగుప్తు బానిసత్వంనుండి విడుదల, వాగ్దత్తభూమివైపు ప్రయాణం, సీనాయి పర్వతంపై ఒప్పందం, ఎరికో గోడలు కూలడం, దావీదురాజు గురించి వివిధ సంఘటనలు గుర్తుకొస్తాయి. క్రైస్తవులు, ఇటువంటి సంఘటనలను మూలంగ తీసికొని, ఉరుములను మెరుపులను నిరంతరం తనచుట్టు ఉంచుకొనే ఒక కోపిష్టి దేవునిలా, అసూయాపరుడైన దేవునిలా, ఎప్పుడు యుద్ధానికి సిద్ధపడే దేవునిలా, ప్రజల క్రియలను భూతద్దంలొ చూస్తు, పాపాత్ములను శిక్షించడానికి అవకాసం కోసం చూచే దేవునిలా గ్రహిస్తాం. ఈ రూపాలన్నీ హీబ్రూ గ్రంథాలలో ఉంటాయి. కాని అవి మనకు అర్థంకాని లోతైన సంఘటనలు. అవి దేవుని స్వభావాలను వ్యక్తం చేయడానికి వాడిన మానవ భాషలు మాత్రమే! వాటిని అర్థం చేసుకోవడం చాలా కష్టతరమని మనం గ్రహించాలి.

## a) ఆది పంచకంలో దేవుని ప్రతిరూపాలు

ఆది పంచకం అంటె, బైబిలులోని మొదటి ఐదు పుస్తకాలు. దీనిలోని మొదటిది ఆదికాండం. ఇది క్రైస్తవులకు ప్రసస్థమైనది. ముఖ్యంగ వాటిలోగల కథనాలు. ఆదాము–అవ్వ, కయీను–హేబెలు, నోవా, బాబెలు గోపురం, అబ్రహాము, ఇసాకు, యాకోబు కథలవలన ప్రసస్థమైంది. ఆదికాండం మూడు వేదసాహిత్య సంప్రదాయాలతో మిళితమై ఉంది. ఈ మూడు సంప్రదాయాలలో ఒకే విధమైన దేవుని రూపం లేదు. ఈ మూడు సంప్రదాయాల పేర్లు: 1. యావే సంప్రదాయం, 2. ఎలోహ సంప్రదాయం, 3. యాజక సంప్రదాయం. సంప్రదాయాలలో ఉపయోగించిన దేవుని పేర్లనుబట్టి ఈ పేర్లు సంప్రదాయాలకు కూడ వచ్చాయి. నాల్గవదైన దైవశాస్త్ర సంప్రదాయం కూడ ఉంది.

**అ) యావే సంప్రదాయం:** ఇది అతి పురాతనమైంది. ఎందుకంటె, యావే అన్నది దేవునకున్న వ్యక్తిగతమైన పేరు. ఇది రెండు సృష్టి కథలలోను కనిపిస్తుంది. క్రీ.పూ. 9,10 శతాబ్దాలలో యావే సంప్రదాయం నుండి వాంగ్మూలం ద్వారా దక్షిణ రాజ్యంలో ప్రజలమధ్య ప్రచారమైన సంప్రదాయంగ గుర్తిస్తారు. ఈ సంప్రదాయంలోగల కథలు క్లుప్తమైనవైనా వివరంగ ఉంటాయి. రచయిత అతి

సులభంగ మానవ గుణాలను దేవునికి ఆపాదించాడు. ఉదాహరణకు, దేవునికి కాళ్లు చేతులు ఉన్నాయి, దేవుడు కోపతాపాలను అనుభవిస్తాడని ప్రస్తావిస్తుంది. ఈ సంప్రదాయం మనకు రెండు సృష్టి ఆరంభ కథనాలను అందిస్తుంది. రెండవ దాని ప్రకారం మట్టిముద్దనుండి మానవుని సృష్టించి, అతనిలోకి తన శ్వాసను ఊది, తరువాత మొక్కలను, జంతువులను చేసి, వాటికి పేర్లు పెట్టే బాధ్యతను మానవునికి దేవుడు అప్పగించారు. ఆదాముకు తోడుగ ఉండడానికి దేవుడు ఆదాము ప్రక్కటెముకను తీసి, అవ్వను సృష్టించినట్లు మనకు తెలుసు. ఆదాము, అవ్వ, నిషేధింపబడిన ఫలం, ఆదిసర్పం, తోటనుండి బహిష్కరణ, కయీను హేబెలుల కథలన్ని స్పష్టంగ యావే సంప్రదాయ దృష్టికోణం నుండె వివరించారు. ప్రజలు పాత నిబంధనలోగల దేవుని గురించి కఠినాత్ముడుగ, సులువుగ నిర్ణయం తీసుకొనేవాడుగ నిరూపించేవారు. అంటె, యావే సంప్రదాయంను ప్రజలు సరిగ పరిశీలించలేదు. ఇక్కడ దేవుడు మానవ స్వేచ్ఛను గౌరవిస్తు, వారిని నిజముగ తీసికొని, తనతో ఏకమవడానికి అవకాసాన్ని సమకూరుస్తున్నాడు.

**ఆ) ఎలోహీ సంప్రదాయం:** దేవుడు కొద్దిగ దూరంలో ఉన్నా, మానవున్ని పూర్తిగ పట్టించుకొనే దేవుని గురించి ఈ సంప్రదాయం మాట్లాడుతుంది. ఆదికాండంలో వాడిన రెండవ పూర్వ సంప్రదాయం. ఎందుకంటె, ఇది దేవునికి సామాన్యంగ ఉపయోగించె పేరుతోనే సంబోధిస్తుంది. ఈ సంప్రదాయం సుమారుగ క్రీ.పూ. 8 వ శతాబ్దంలో ఉత్తర రాజ్యంలో ప్రారంభమై ఉండవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. కథను వివరించే శైలి యావే సంప్రదాయంలో అతి క్లుప్తంపంగ ఉంటుంది. అలాగాక, ఈ సంప్రదాయంలో దేవునికి మానవునికి మధ్య ఉన్న దూరంను చూపుతుంది. సృష్టికర్తయైన దేవుడు సృష్టిలోగల ప్రాణులకంటె అతి భిన్నంగ ఉంటాడు. దానికొరకే అతను మానవులతో సూటిగ, నేరుగ మాట్లాడేకంటె, కలలద్వారా, దేవదూతల దర్శనాల ద్వారా తననుతాను వ్యక్తపరచుకుంటాడు. అబ్రహాము ఈసాకును త్యాగం చేయుటకు సిద్ధంగ ఉండే ఆ సందర్భం ఈ సంప్రదాయం కోణం నుండే తయారయింది. దేవుని విధేయించుటలో అబ్రహాము చూపిన సిద్ధతను, అతనికున్న దైవభక్తిని ఈ సంప్రదాయం మెచ్చుకుంటుంది.

**ఇ) యాజక సంప్రదాయం:** ఈ సంప్రదాయం ఆచారాలను, క్రమాన్ని ప్రీతిగ చూస్తు, దేవునిగూర్చి వివరిస్తుంది. యాజక సంప్రదాయం అన్న పేరు రాడానికి కారణం: దీని రచయిత అర్పించె బలులు, చేసే దైవార్చనా కార్యక్రమాలు, క్లుప్తంగ తెలిపే చారిత్రాత్మక సంఘటనలు, వంశావళులపై చూపించే శ్రద్ధ వలన. ఒకవైపు, మొదటి రెండు సంప్రదాయాలు బలులను ఎక్కడైన అర్పించవచ్చని చెబుతాయి. మరోవైపు, యాజక సంప్రదాయం మాత్రం బలియర్పణకు యెరూషలేం దేవాలయమే న్యాయపూరితమైన స్థలమని నిర్ధారిస్తుంది. ఈ సంప్రదాయం దేవుని మానవులతో పోల్చడం లేదు. సుమారుగ బబులోనియా దాడి జరిగిన సమయం వరకు ఈ సంప్రదాయం ప్రస్తుత స్థితికి చేరుకుంది. ప్రసస్థమైన మొదటి సృష్టి కథనం ఈ సంప్రదాయం నుండే వచ్చింది. ఈ కథద్వారా రచయితకున్న ఉద్ధేశం ఏమిటంటె, సాబత్తు దినం విశ్రాంతి దినమని, దేవుని ప్రణాళిక ఆరంభం నుండి ఉందని చెబుతుంది. సృష్టి అంతటికి మూలకారణం దేవుడేనని, సృష్టింపబడినది అంతా మంచిదేనని ఈ సంప్రదాయం నిర్ధారిస్తుంది. ఆదాము నుండి నోవా వరకు వంశావళి, నోవాతో దేవుని నిబంధనం, వరదగూడు (Rainbow) చిహ్నంతో రూఢి పరచడం అన్నవి ఈ సంప్రదాయంలో ముఖ్యమైనవి.

**ఈ) దైవశాస్త్ర సంప్రదాయం:** ఈ సంప్రదాయం నిబంధన చేసిన దేవునిగూర్చి వివరిస్తుంది. ఆది పంచకంలోగల నాల్గొవ సాహిత్య దైవశాస్త్ర సంప్రదాయం. ఇది ఉత్తర రాజ్యంలో ప్రారంభమైనను క్రీ.పూ. 7వ శతాబ్దంలో దక్షిణ రాజ్యంలో ప్రసిద్ధి చెందింది. ఈ సంప్రదాయంలో దేవుడు తన పవిత్ర ప్రేమతో యిస్రాయేలీయులను తన ప్రియ ప్రజలుగ ఎన్నుకున్నాడని బోధిస్తుంది. మోషే ద్వారా సీనాయి పర్వతం మీద దేవుడు తన ప్రజలకు పది ఆజ్ఞలను ఇవ్వడం ఈ సంప్రదాయంలో మొదటి ఘట్టం. "మీరు నామాట విని నా నిబంధనను శ్రద్ధగ పాటించినచో, సకల జాతుల వారిలో మీరే నావారు, నా సొంత ప్రజలు అగుదురు. ఈ భూమండలమెల్ల నాదేకదా?" (నిర్గమ 19:5). ఈ వచనం దైవశాస్త్ర సంప్రదాయాన్ని పూర్తిగ వివరిస్తుంది. పితృల కాలంలో బలులు అనేక ప్రదేశాలలో అనేక వ్యక్తులు అర్పించేవారు. కాని, ఈ సంప్రదాయం ప్రకారం బలులు అనేవి యెరూషలేంలో యాజక వర్గం మాత్రమే అర్పించాలి. ఈ సంప్రదాయం ఒక

తక్షణమైన కార్యంవైపు ప్రజలను మల్లిస్తుంది. బబులోనియా ప్రవాసం నుండి విడుదల పొందిన అనంతరం ఈ సంప్రదాయం చివరి దశకు చేరుకుంది. చట్టాన్ని కేంద్రంగ చేసి, ప్రవాసం అనంతర కాలంలో యూదా ప్రజలను సక్రమ మార్గంలో నడిపించింది ఈ సంప్రదాయం. యూదా ప్రజలయొక్క గుర్తింపుకు చట్టం అనేది ఒక కేంద్రంగ మారింది. ఎందుకంటె, యెరూషలేం నుండి దూరంగ నివసిస్తున్న యూదులు కూడ చట్టంను నెరవేరుస్తు, సంవత్సరానికి ఒకసారి లేదా కొన్ని సంవత్సరాలకు ఒకపరి వచ్చి, వారి మత నియమాలను పాటించవచ్చు. ఈ సంప్రదాయాన్ని మనం నిశితంగ పరిశీలిస్తె, మనం విశ్వాసనీయమైన దేవుని దిక్కరించే ప్రజల గురించి ప్రేమించే దేవున్ని విడిచి దబ్బర దేవుళ్ళ వెనుక, వాటి ఆచారాల వెనుక పరుగెత్తే ప్రజల గురించి, నిర్గమ, సీనాయి నిబంధనకు సాక్షులుగ లేక చట్టమే వారికి దేవునికి మధ్య వారధిగనున్న ప్రజల గురించి మాట్లాడుతుంది. ఈ సమయంలో ప్రార్థనామందిరాలు యూదా ప్రజల గుర్తింపుకు మూలంగ నిలిచాయి. ప్రజలు వారి కార్యాల వలన దేవుని ప్రేమను సంపాదించుకోలేదు. దేవుడే తన ప్రేమతో అనర్హులైన ప్రజలకు తన చట్టాన్ని ఇస్తున్నాడు. దేవుని నిర్ణయాలు తన సంపూర్ణ ప్రేమను చూపుతాయి. ప్రజలు చట్టంనకు విధేయులై ఉండి, విశ్వాసనీయమైన జీవితం జీవించి దేవునకు బదులు ఇవ్వవచ్చు. కనుకనే, మనం చూచినట్లు మన సాహిత్యం, దైవశాస్త్ర సంప్రదాయం వాటికున్న అవసరాల ప్రకారం వివిధమైన దేవుని ప్రతిరూపాలను అనుసరిస్తుంది.

యావే సంప్రదాయంలో దేవుడు ఒక మానవ మిత్రునిలా, సౌలభ్యంగ ఉంటు, తన బలము, బలహీనతతో పాటు మనతో నివసిస్తాడు. దైవశాస్త్ర సంప్రదాయంలోని దేవుడు అధిక కఠినాత్మునిగను, దర్శనాల ద్వారా మాట్లాడే దేవునిగ కనిపిస్తాడు. యాజక సంప్రదాయంలోని దేవుని ప్రతిరూపం తీసుకుంటె, క్రమం, ఆచారం ముఖ్యమైనవి. కొన్ని సందర్భాలలో ఈ క్రమం, ఆచారం దేవునికంటె ముఖ్యంగ మారే ప్రమాదముంది. దైవర్చన కార్యం దేవుని కీర్తించే సాధనం. కొన్నియెడల ఆ కార్యమే దేవునిగ మారవచ్చు. ఆ పరిస్థితుల్లో మనం కొన్ని సాంగ్యాలను పాటిస్తే మనల్నిమనం నీతిమంతులుగ పరిగణించుకోనే ప్రమాదం ఉంది.

దైవశాస్త్ర సంప్రదాయం తీసుకుంటె, మన భుజాలపై చట్టభారంను మోపి మనకు సాయం చేయుటకు చిటికిన వ్రేలైనను కదపని దేవుని చూస్తున్నాం. మనం ఒక సంప్రదాయం చూపించె దేవుని పట్టుకొని వ్రేలాడితే సరియైన, నిజమైన దేవుని ప్రతిరూపం వైపు చూడలేము. నిజానికి, నాలుగు సంప్రదాయాలను కలిపి ఒక నిర్ణయానికి వస్తేనే మనం నిజమైన, సంపూర్ణమైన దేవుని రూపం చూడగలం.

## B) చారిత్రక గ్రంథాలలో దేవుని ప్రతిరూపం

యెహోషువ, న్యాయాధిపతులు, రూతు, సమూవేలు, రాజులు, రాజుల దినచర్యలు, ఎజ్రా, నెహెమియా, తోబీతు, యూదితు, ఎస్తేరు, మక్కబీయుల గ్రంథాలు – వీటిని చారిత్రక గ్రంథాలుగ పరిగణిస్తారు. వీటిలో చాలా పుస్తకాలు సీనాయి నిబంధనం (క్రీ.పూ. 1250) మొదలు బబిలోనియా ప్రవాసంనుండి తిరిగి రావడం (క్రీ.పూ.153) వరకుగల మధ్యకాలంలో జరిగిన సంఘటనలు గురించి తెలియపరుస్తాయి.

### యెహోషువ: దేవుడు ఒక యోధుడు

యెహోషువ గ్రంథంలో అన్యజాతులను ఓడించి, బంధించి, యిస్రాయేలు ప్రజలను వాగ్దానభూమికి చేర్చే దేవున్ని చూస్తాం. ఐగుప్తునుండి విడుదల పొందిన సమయంలో ప్రారంభమైన పవిత్ర యుద్ధం, ఆ ప్రజలు తమ సొంత దేశంలో స్థిరపడే వరకు కొనసాగుతూనే ఉంది (6:15–21). ఈ యెహోషువ గ్రంథంలో ప్రస్తావించిన దేవుడు ఒక యోధుడు.

### ఎజ్రా, నెహెమియా: సంతోషం, చట్టం యొక్క దేవుడు

క్రీ.పూ. 5వ శతాబ్దంలో యూదా ప్రజలకు గుర్తింపునిచ్చె మూడు గుణాలున్నాయి. 1. వారిది, దేవుడు ఎన్నికచేసిన జాతి అనే భావం. 2.యెరూషలేం దేవాలయం. 3.చట్టం. వారికి పునఃప్రసాదించిన ఎజ్రాను, నిస్సందేహంగ యూదామత పుత్రుడని పిలువవచ్చు. ఎజ్రా తాను పునర్నిర్మాణ ప్రయత్నంలో ప్రజల మనస్సుల్లో ఉన్న దేవుని ప్రతిరూపాలను కూడ మలిచాడు. ఒకసారి నెహెమ్యా యెరూషలేం గోడలను కట్టిన తరువాత, ప్రజలు ఆ పట్టణంలో పునఃస్థాపనను గావించిన తరువాత, ఎజ్రా ప్రజలందరిని కూడజేర్చి, వారిమధ్య

మోషే ధర్మ చట్టాన్ని పఠిస్తాడు. అటుతరువాత లేవీయులు వారికి వచన భావాలను స్పష్టంగ వివరించారు. చట్టంలో ఉన్న వాక్యాలను ఆలకించగనే, ప్రజలు వారి అవిశ్వాసతను తెలిసికొని, బిగ్గరగ ఏడుపు మొదలుపెట్టారు. ఆ సమయంలో ఎజ్రా ప్రజలతో ఇలా అన్నాడు: "ఇది ప్రభువునకు పవిత్ర దినము. కనుక, మీరు దుఃఖింప వలదు. ఇక ఇంటికి వెళ్లి, క్రొవ్విన మాంసమును మధుర పానీయములను సేవించి ఆనందింపుడు. మీ అన్నపానీయములను పేదలకు కూడ పంచియిండు. నేడు ప్రభువునకు పవిత్ర దినము కనుక, మీరు దుఃఖింపవలదు. ప్రభువు మీకు ప్రసాదించిన ఆనందమే మీకు శక్తి" అని ఓదార్చాడు (నెహెమ్యా 8:7-11). ఒక వారం మొత్తం ఎజ్రా వారికి చట్టాన్ని బోధించాడు. తదుపరి వారు పండుగ జరుపుకున్నారు. అపుడు పాపపరిహారం కోసం సమయం వచ్చింది. ప్రజలు ఉపవాసం ఆచరిస్తు, గోనెపట్టలు ధరించి, బూడిద చల్లుకొని, పాపాలను ఒప్పుకున్నారు. ఆ సమయంలోనే లేవీయులు సృష్టి ఆరంభంనుండి ఆనాటివరకు దేవుడు చేసిన మహత్కార్యాలను జ్ఞాపకపరచుకొని, పాటలు పాడారు. అప్పుడు వారు మోషే ధర్మశాస్త్రాన్ని పాటిస్తామని, అన్యజాతి వారితో పెళ్లి సంబంధాలు పెట్టుకోమని, ఆలయపన్ను చెల్లిస్తామని, వారి పంటలో తొలి ఫలాలను, వారి సంతానంలో తొలిచూలు బిడ్డలను, వారి పశువుల మందలోని శ్రేష్ఠమైన వాటిని దేవునికి అర్పిస్తామని దేవునికి వాగ్దానం చేసారు.

## C) ప్రవక్తల గ్రంథాలలో దేవుని ప్రతిరూపాలు

యిస్రాయేలీయుల చరిత్రలో 600 సంవత్సరాల కాలంలో ప్రవక్తలు, పదిహేడు ప్రేరేపిత పుస్తకాలను హీబ్రూలో వ్రాసారు. సమాజంలోని అన్ని స్థాయిలనుండి ఈ ప్రవక్తలు వచ్చారు. దేవునివాక్కు ఆ సమయంలోనున్న ప్రజలకోసం, భవిష్యత్తరాల కోసం ఒక అమూల్యమైన సందేశం ఇచ్చింది. వారు దేవునికి వివిధ ప్రతిరూపాలను ఉపయోగించారు. హీబ్రూ ప్రవక్తలు ఎప్పుడు విగ్రహారాధనను నిషేధించారు. వారి జాతిని యావేప్రభువు యొక్క నిజమైన మతానికి విశ్వాసపాత్రంగ ఉండాలని బోధించారు. దైవదర్శనంను ప్రజలకు బయలు పరచడానికి ముఖ్యమైన వారధులుగ నిలిచారు.

## ఆమోసు: నిజాయితీగల బలులను ప్రేమించే దేవుడు

ఆమోసు యూదాజాతికి చెందిన ఒక గొర్రెలకాపరిగ, అత్తిచెట్ల సంరక్షకుడుగ జీవనోపాధిని సాగించాడని తెలుస్తుంది. అతని సమయంలో దేవుడు ఆమోసును ఉత్తర రాజ్యంను పాలిస్తున్న యెరోబాము రాజు (క్రీ.పూ. 783-743) వద్దకు ప్రవచించుటకు పంపాడు. ఆ సమయంలో రాజ్యం ఒకవైపు గమనింపదగ్గ ధనంతో, సుధీర్ఘ దైవార్చన వేడుకలతో, మరోవైపు సాంఘిక నీతి గురించి పట్టించుకోని విధానంతో (8:4-6) ఉంది. ప్రజలు రాజ్యయుక్తమైన దివ్య మందసం వద్ద లేక జాతీయ దేవాలయంలో దేవున్ని ఆరాధించడం గర్వకారణంగ చూసేవాళ్లు (5:21-24). వారికున్న అతి సుఖమైన దేవుని రూపాలకు వ్యతిరేఖంగ ఆమోసు ప్రవచించి, వారి అన్యాయాలను శిక్షించే దేవుని రూపాన్ని వివరించాడు. ఆ విధంగ వారిని స్వచ్ఛమైన స్వేచ్ఛవైపు నడిపించాడు.

## హోషేయ: విశ్వాసనీయతగల దేవుడు

ఆమోసు సమకాలీనుడు హోషేయ, కూడ ఉత్తర రాజ్యంలో ప్రవచించాడు. ఆ సమయంలో అనగ, క్రీ.శ. 721లో, యిస్రాయేలీయులు అస్సిరియా చేతిలో వినాశనం పొందే పరిస్థితి. గోమెరును వివాహమాడి, ఆమె బిడ్డలకు పేర్లు పెట్టమని దేవుడు హోషేయను ఆజ్ఞాపించాడు (1:2-6). దేవుడు యిస్రాయేలు ప్రజలను అవిశ్వాస భార్యగ గుర్తించి, తాను ఆమెకు భర్తను కానని నిరాకరిస్తాడు. అపుడీ ప్రవక్త తన ఫిర్యాదును దాకలుచేస్తాడు. హోషేయ మనఃచిత్రం గతంలోగల అడ్డంకులను తొలగించి, యిస్రాయేలు పాపాల చిట్టాను, ఆమె భర్తయైన దేవుని విశ్వాసనీయతను చూపించగలిగింది. ప్రవక్త యిస్రాయేలు మీద దేవునికిగల లోతైన ప్రేమను, దానిమూలంగ వారు పశ్చాత్తాపపడే మనసు ఏర్పడుటకు తాను ఏమైన చేయుటకు సిద్ధంగ ఉన్నాడన్న దేవుని రూపాన్ని ప్రదర్శించాడు. దేవుడు యిస్రాయేలుకు విశ్వాసనీయతగల, మన్నించే తత్వంగల భర్త (14:4-7).

## యెషయా: పవిత్రమైన, శక్తిగల దేవుడు

సుమారు క్రీ.పూ. 740లో యెషయా ప్రవక్త దక్షిణ రాజ్యంలో తన కర్తవ్యాన్ని ప్రారంభించి, రమారమి నలుబది సంవత్సరాలు ప్రవచించాడు. ప్రత్యక్షంగగాని

లేక పరోక్షంగ తన శిష్యుల ద్వారాగాని యెషయా 1-39 అధ్యాయాలకు ముఖ్య రచయిత. 40-55 అధ్యాయాలు ఒక ఖండంగ "ఓదార్పు పుస్తకం" అని అంటారు. దీనిని బబులోనియా ప్రవాస సమయంలో వ్రాసి ఉంటారు. దీని అజ్ఞాత రచయితను రెండవ యెషయాగ గుర్తిస్తారు. 56-66 అధ్యాయాలు దేవాలయ పునర్నిర్మాణ సమయంలో బహుశ వ్రాసి ఉంటారు. దీని మరో అజ్ఞాత రచయితను మూడవ యెషయాగ గుర్తిస్తారు. ఈ మూడింటిలో ప్రతి భాగం విలువైన దేవుని ప్రతిరూపాలను అందించింది.

'ప్రజలు యిస్రాయేలు పవిత్రదేవుడ్ని విడిచిపెట్టారని' దేవుని విలాపంతో యెషయా గ్రంథాన్ని ప్రారంభిస్తాడు (1:4). ఈ పుస్తకంలో "పవిత్రుడు" అన్నది అభిమాన శీర్షిక. ప్రజలు క్షమాపణ కోరుకుంటె, దేవుడు తప్పక క్షమిస్తాడు. అలా కాకుంటె, ఖడ్గం వారిమీదకు వచ్చిపడుతుంది. బహుశ హీబ్రూ గ్రంథాల రచయితలందరి కంటె, దేవుడు శక్తిమంతుడు అన్న భావాన్ని చాలా ద ృఢంగ తెలియపరుస్తాడు (1:24). దేవుడు ద్రాక్షతోటయొక్క యజమానియని యెషయా ఉపమానం చెబుతాడు. దేవుడు దాని తీగలను జాగ్రత్తగ సవరించి, నాణ్యమైన పండ్లను ఇచ్చునట్లు చూస్తాడు, కాని విచ్చలవిడిగ పెరిగిన ద్రాక్షనే చూడగలుగుతున్నాడు. యెషయా ప్రారంభ దర్శనం వర్ణించినట్లు, శక్తివంతుడైన దేవుడు మహోన్నతమైన సింహాసనం మీద కూర్చుంటాడు. సేరఫిమ్ అనే దూతలు పరిశుద్ధులు, యావేదేవుడు పరిశుద్ధులు, పరిశుద్ధులు, పరిశుద్ధులు ఆతని మహిమ భూమి యంతటిని నింపివేయును అని ప్రకటిస్తారు (6:1-3).

రెండవ యెషయాగ తెలుపబడిన ప్రవక్త తన ప్రబోధకార్యాన్ని దేవుని మాటలను ఉటంకిస్తు, దేవుడు యెరూషలేంను ఓదార్చుతు, దాని నేరం పరిహరింపబడే స్థితిలో ఉందని తెలియపరచాడు. ప్రజలు, మన్నించుటలో గొప్పవాడైన యావేదేవుని తట్టు వెనుదిరగాలి. మూడవ యెషయాగ గుర్తింపబడిన రచయిత దేవుని నామమును ప్రేమించి, ఆయన సేవకులగు ప్రజలనందరిని రక్షించుట దేవుని చిత్తమై ఉందని, పునరుద్ఘాటిస్తున్నాడు.

### యెహెస్కేలు: రాజఠీవిగల, కారుణ్యంగల కాపరియైన దేవుడు

యెహెస్కేలు ప్రవక్త బహుశ మతగురువు అయిఉండాలి. క్రీ.పూ. 597 లో బబులోనియాకు మొదటి విడతలోనే కొనిపోబడిన వారిలో ఇతడు ఉండి ఉండవచ్చు. ఇతను చట్టంయొక్క ప్రాముఖ్యతను, దేవాలయ ఆరాధనను, చట్టపరమైన పవిత్రతకు కావలసిన వాటి గురించి నొక్కి వక్కానించాడు. కాని, ఆరాధించుటకు వచ్చునపుడు ప్రజలు ఆంతరంగికంగ సంసిద్ధులై ఉండాలని రూఢిగ తెలియపరచాడు.

యెహెస్కేలు, దేవునియొక్క రాజఠీవిని (1:26–28; 43:1–5), కారుణ్యాన్ని (36:26) బహిర్గతం చేసాడు. దేవుడు తన ప్రజలమీద దయను చూపి, పశ్చాత్తాప పడువారికి సాయమందింప సిద్ధంగ ఉండి, నూతన జీవితాన్ని నిర్మిస్తాడు. దేవుడు యిస్రాయేలును ప్రేమించాడు, కనుక పూర్ణ నిస్వార్థంతో జాతికి కాపరిగ ఉంటాడు (34:1–10). యిస్రాయేలీయుల ఎండిన ఎముకలపై శ్వాసను ఊది, వారిని జీవంతులను చేస్తాడు.

### యోనా: అందరి ప్రజల దేవుడు

మనోహరమైన వ్యంగ్యంతో రచయిత దేవుని విశ్వమానమైన ప్రేమను, పశ్చాత్తాప అవసరతను గురించి ప్రేరేపితమైన సందేశాన్ని అందించాడు. యోనా, పనికిరాని కర్తవ్యంగ భావించినా, దేవుడిచ్చిన పనిని చేసాడు. అన్యులైన బబులోనియా వాసులు అతనిని ఆశ్చర్యపరుస్తు, ఇచ్చిన సందేశాన్ని అంగీకరించి పశ్చాత్తాప పడతారు. “నీవు దయ, నెనరుగల దేవుడవు. సులభముగ కోపించువాడవు కావు. మిక్కిలి కరుణ కలవాడవు. నీ మనసు మార్చుకొని జనులను శిక్షింపక వదలి వేయుదువు” (4:2). సకల ప్రజల రక్షణ గురించి పట్టించుకొనే దేవునిగూర్చి యోనా పుస్తకం ప్రకటిస్తుంది.

## D) జ్ఞాన రచనలలో దేవుని ప్రతిరూపాలు

### సీరా జ్ఞాన గ్రంథం: చరిత్రకు, జ్ఞానానికి ప్రభువైన దేవుడు

గ్రీకుల ప్రపంచమైన జ్ఞానం మీద గుత్తాధిపత్యం కలవారని ప్రకటించట వలన కాటువేయబడిన సీరా నిజమైన జ్ఞానం యూదుల తత్త్వంలోనే ఉందని,

ముఖ్యంగ మోషే చట్టం ఆచరణలోను, దేవాలయ ఆరాధనను కొనసాగించుటలోను ఉందని తెలియజేస్తాడు. సీరా ప్రకారం సమస్త జ్ఞానం నిజమైన జ్ఞానియైన దేవునినుండె వస్తుంది. దానిని ప్రేమించె వారిపై జ్ఞానాన్ని కుమ్మరిస్తాడు. జ్ఞానానికి పునాది దైవభయం. ప్రభుని ఆజ్ఞలను పాటించువారు ఈ అమూల్య బహుమతిని పొందుతారు. సీరా, గ్రీకు జ్ఞానాన్ని అధిగమించె దేవున్ని ప్రదర్శిస్తాడు. మానవ చరిత్రకు ప్రభువైన దేవున్ని ప్రదర్శిస్తాడు. ఏదియేమైన, దేవుని జ్ఞానం ప్రతిదిన అక్కరలను తాకుతుంది, ఉదాహరణకు: బిడ్డల పెంపకం, నాలుకను అదుపులో ఉంచడం, ఆకలిగొన్నవారికి ఆహారం ఇవ్వడం, ద్రాక్షాసారాయికి బానిస కాకుండుట వంటివి (5:10-11; 24:21-22).

## జ్ఞానగ్రంథం: జ్ఞానంను ప్రేమించువారిని దేవుడు కాపాడును

ఈ జ్ఞానగ్రంథ రచయిత సంప్రదాయబద్ధుడును, కొత్త పుంతలను త్రొక్కేవాడును. యూదా చరిత్రలో, ముఖ్యంగ నిర్గమ సమయంలో, దేవుని ఉదారమైన చెయిదంలను వర్ణిస్తాడు గనుక, అతను సంప్రదాయబద్ధుడు. జ్ఞానాన్ని దేవుని ఆత్మతో ముడిపెట్టి, గ్రీకులు గౌరవించు ప్రథమ పుణ్యక్రియలైన ఇంగిత జ్ఞానం, దృఢత్వం, నీతిన్యాయాలు, వివేకంను ఈ గ్రంథ ఉపదేశంలో ప్రదర్శిస్తాడు. సంప్రదాయంనుండి విడివడి, రచయిత శ్రమలకు స్పష్టమైన జవాబునిస్తు, అనంతర జీవితం ఉందని, దేవుని జ్ఞానాన్ని ప్రేమించిన వారును, దానివలన ఇబ్బందులకు గురియైనవారును దేవునితో సంతోషంగ జీవిస్తారని చెబుతాడు. దేవుని జ్ఞానాన్ని తృణీకరించిన వారు దేవునినుండి విడిపోతారు. జ్ఞానగ్రంథం, ఈ జీవితమనంతరం వరకు విస్తరించి ఉన్న న్యాయంగల దేవుని కలుస్తామని చెబుతుంది. అచ్చోట దైవం లేనివారు శిక్షయును, జ్ఞానంగలవారు బహుమానంను పొందుదురు. ఇదంత, దేవుని జ్ఞానం వలనను, సృష్టియావత్తు మీద సర్వభౌమాధికారం గలవాని వలనను జరుగుతుంది.

## 2. నూతన నిబంధనలో దేవుని ప్రతిరూపాలు

హీబ్రూ గ్రంథాలు పూర్తిచేయడానికి ఒక వెయ్యి సంవత్సరాలు పట్టగ, నూతన నిబంధన గ్రంథాలు వ్రాయడానికి సుమారు డెబ్బది సంవత్సరాలు (క్రీ.శ. 50-

120) పట్టాయి. నూతన నిబంధనలోని దేవుని ప్రతిరూపాలు అధికమధికంగ ఏక స్వారూప్యం కలిగి ఉంటుందని మనం నమ్మవచ్చు. నూతనవేద రచయితలు భిన్న ప్రాంతీయ అలవాట్లనుండి వచ్చారు. వీరు భౌగోళికంగ భిన్న సంఘాలకు వ్రాసారు. కొన్నియెడల, సంస్కృతి పరంగ ఒకరినుండి ఒకరు వేరుగ కనిపిస్తారు. విశ్వాస పరంగ, సంఘాలు ప్రత్యేక విధమైన సవాళ్లను ఎదుర్కొనేవి. కొరింతీయులకు వ్రాసిన మొదటి లేఖలో దివ్యసత్ప్రసాదం వలన దేవుని స్తుతించుటకు బదులు, అక్కడి సంఘంలో విభజనను ప్రోత్సహిస్తున్నారు. సువార్తలు కూడ దేవుని ప్రతిరూపాలను అందిస్తు, సమాజ విలువలను చేపట్టి, క్రీస్తును అనుకరించమని ప్రబోధిస్తాయి.

## a) మొదటి కొరింతీయులకు వ్రాసిన లేఖ: ఒకే దేవుడు, ఒకే ప్రభువు

క్రీ. శ. 50–52 లో కొరింతులో పౌలు పదునెనిమిది మాసాలు సువార్తను బోధించాడు. మొదట సినగోగులో యూదులకు, తదుపరి అతనిని సినగోగునుండి వెడలిగొట్టిన అనంతరం అన్యులకు బోధించాడు. మొదటి లేఖ క్రీ.శ. 57 నుండని అంచన. ఈ మొదటి లేఖలో పౌలు దైవ సిద్ధాంతాలను, నైతిక విషయాలను గురించి వ్రాస్తు, ఇవి వారిలో విభజనకు కారణమని వ్రాసాడు. పౌలు ప్రకారం, కొరింతులోగల క్రైస్తవుల్లో క్రీస్తుద్వారా వెలువడిన దైవవరం ఇంకను వారు పొందలేదు, కాని వారిలో విభజనలు మాత్రం చోటుచేసుకున్నాయి.

మొదటి కొరింతి దేవుడు ఒక్కడేనన్న ప్రతిరూపాన్ని అందిస్తుంది. తాను నాటిన మొక్కను దేవుడే దాని ఎదుగుదలను చూస్తాడు, ఆయనే నాశనమగు శరీరాలను నాశనంకాని శరీరాలుగ లేవనెత్తుతాడు. కొరింతీ క్రైస్తవులు పరిపక్వ విశ్వాసంలోకి ఎదగడానికి, ఒకరికొకరు నిస్వార్థ సేవలు అందించుకొనుటకుగాను ఒకే దేవుని ప్రతిరూపాన్ని చూపిస్తున్నాడు.

## b) యాకోబు: నీతిపరుడైన న్యాయాధిపతిగ దేవుడు

ఈ లేఖను అందుకున్నవారు యెరూషలేం నాశనం కాకముందు, అనగా క్రీ.శ. 70 కి ముందే పాలస్తీన వెలుపల జీవిస్తున్న యూదా క్రైస్తవులు. ఈ రచయిత యాకోబు ప్రభుకు సోదరుడు (మత్తయి 13:55). తాను క్రీ.శ. 62 లో వేదశాక్షిగ

మరణం పొందేవరకు, యెరూషలేం సంఘానికి అధిపతిగ ఉండినాడు. యాకోబు లేఖ దేవుని, అణగారిన ప్రజల గోడును వినేటటువంటి నీతిపరుడైన న్యాయాధిపతిగ ప్రకటిస్తుంది. పూర్తి లేఖ నైతిక విషయాలను, ముఖ్యంగ పేదవారిని గమనించదగ్గ విధానాల గురించి ఒక ప్రసంగంగ వ్రాసాడు. ఈ లేఖలో భాగ్యాలయొక్క దేవున్ని కలుస్తాం. ఈ లేఖ, విశ్వాసం మంచి పనుల మధ్యగల సంబంధాన్ని నొక్కిచెబుతుంది.

## c) లూకా: మన్నించే దేవుడు, పేదల పాలిట దేవుడు

లూకా సువార్తను అన్యులకు వ్రాసాడు. అయితే, ఈ సువార్త తమకు, యూదులకు కూడ అని వారు గ్రహించాలి. లూకా సువార్త, అపోస్తులుల కార్యాలు పునీత లూకా వ్రాసాడు. శ్రీసభ క్రీస్తు పనిని కొనసాగిస్తుందని, సువార్త ప్రపంచ నలుమూలల అందరికి అందుతుందని తెలియపరుస్తున్నాడు. యేసుని శిష్యులగుటకు సిద్ధంగ ఉన్నవారికి క్రైస్తవం సిద్ధంగ ఉందని చెబుతున్నాడు. మన్నించె దేవుని రూపాన్ని లూకా ప్రదర్శిస్తున్నాడు. తప్పిపోయిన వారిని, త్రోసివేయబడిన వారిని వెదికే దేవుడని వక్కాణిస్తున్నాడు (తప్పిపోయిన గొర్రె, పోయిన కాసు, పన్ను వసూలు చేసే లేవీయులు) వీరందరిని దేవుని బిడ్డలుకమ్మని క్రీస్తుయేసు ఆహ్వానిస్తున్నాడు.

## d) మత్తయి: దేవుని రాజ్యం తప్పనిసరి అది విశ్వమానమైనది

యూదా మతంతో సన్నిహితమైన బంధంగల క్రైస్తవులకు ఈ మత్తయి సువార్త వ్రాయడమైనది. యేసుక్రీస్తు మోషే చట్టాన్ని దాటి వెల్లిన వైనాన్ని గమనించాలని ఈ సువార్త చెబుతుంది. యిస్రాయేలు యొక్క విశ్వాసపు కొనసాగింపు క్రైస్తవంలో ఉందని అర్థం చేసుకోవాలి. గత తరాలకు తెలియని మోక్షరాజ్యం గురించి తెలపడమే మత్తయి యొక్క ఉద్దేశం. మత్తయి శుభవార్త ద్వారా ఆకలిగొన్న వారిలోను, వస్త్రహీనులలోను, నీడలేని వారిలోను, దప్పికగొన్న వారిలోను దేవున్ని గుర్తించగలిగితే దైవరాజ్యాన్ని పొందుతామని తెలుస్తుంది.

ఊరకనే సువార్తలను చదివితే చాలదు. మరియతల్లి వలె మనసులో వచనాలను ధ్యానిస్తు, విశ్వాసపు సంఘ సహాయాన్ని వెదకాలి. మరియతల్లి వలె యేసు పుట్టక మునుపు, తరువాత కూడ వాక్కును, సంఘటనలను లోతుగ మననం చేసుకుంటు, దేవుని గురించి, తనగురించి, ఇతరుల గురించి నూతన అవగాహనకు రావాలి.

## ప్రార్థన: మనకున్న దేవుని ప్రతిరూపాలు

మన దేవుని ప్రతిరూపాలు గాలిలో ఉండవు. దేవున్ని ఇతరులను మనం చూసే విధానంబట్టి అవి మన సొంత మనసుకు కలిపి ఉంటాయి. మన దేవుని ప్రతిరూపాలు, మన మనసు, ఇతరులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. మనిషి, దేవుడ్ని చూడడానికి ఏ రకమైన కటకాన్ని ఉపయోగిస్తాడో, దానిద్వారానే తననుతాను, ఇతరులను చూస్తాడు. దేవుని ప్రతిరూపాలు, మనలను, ఇతరులను మార్పిడి చేయడం సులభతరం కాదు. అది బాధను కలిగించేది, కష్టతరమైనది. ఏ ప్రతిరూపాన్నైన కచ్ఛితమైన పునఃపరిశీన చేసినట్లయితే, అది మిగిలిన రెండింటిని పరిశీలించ వలసి ఉంటుంది. మార్పిడి అన్నది సదా కొనసాగే ప్రక్రియ. ఈ మార్పిడి మనం దేవుని ముఖాముఖిగ దర్శించేంత వరకు నడిపించాలి. నిజాయితీ, ప్రార్థనయందు నిరంతర పట్టుదల వలన, ఈ మార్పిడి బాగా వేళ్లూనుకుంటుంది. మార్పిడి యొక్క ఫలమే దేవుని, నన్నునేను, ఇతరులను చాలా స్పష్టంగ చూడగలుగుతు, దానికి అనుబంధంగ నన్నునేను మార్పుకు గురిచేసుకోడానికి సిద్ధపడతాను.

పునీత అస్సిసిపురి ఫ్రాన్సిసు, అవిలాపురి తెరేసా వంటి అనేకమంది, ప్రార్థన ద్వారానే తమ దేవుని ప్రతిరూపాలు అభివృద్ధి చెందాయి. మనకు ఇష్టమున్న లేకున్న సుఖప్రదమైన దేవుని, మన, ఇతరుల రూపాలనుండి, మనలను దూరం చేయగలిగేది సహజసిద్ధమైన ప్రార్థన ఒక్కటే. అది విశాలమైన దేవుని రూపాలతట్టు తోడ్కొనివెళ్తుంది. కాబట్టి, దేవుని ప్రతిరూపాలలో ఎదగడానికి, మనం ప్రార్థన చేస్తూనే ఉండాలి. దేవుని ప్రతిరూపాలలో ఎదగడానికి కావలసినది నిరంతర పట్టుదల.

❋ ❋ ❋ ❋

# 3. క్రైస్తవ ప్రార్థనకు పునాదులు

**- బ్రదర్ నల్లా సుధీర్ కుమార్**

## A) పూర్వనిబంధన నుండి వచ్చిన సూత్రాలు



పునాదులుగల చాలా సూత్రాలు, పూర్వనిబంధన పరిశీలనలు బట్టి అందాయి. దేవుడు, తన వాగ్దానంద్వారా, ఒడంబడిక అనే బహుమానం ద్వారా వ్యక్తితోను, సంఘంతోను సంబంధం ఏర్పరచుకొనుట మొదటి సూత్రం. దేవుడు, తననుతాను ఆవిష్కరించుకోడానికి వ్యక్తిగతంగ తాను ముందడుగు వేసాడు. వాగ్దానం ద్వారా తననుతాను ప్రజలతో బంధంను, ఒడంబడిక ద్వారా ప్రజలను తనతో బంధంను ఏర్పరిచాడు. దేవుడు మానవున్ని వెదకుతు వచ్చాడు, తనను తెలియపరచుకొని, తన ఉద్దేశాలను కూడ తెలియజేసాడు. విశ్వంను సృష్టించిన సృష్టికర్తగ అతనిని ఏదోవిధంగ ప్రజలు వెదకలేదు. ఆలోచన వలనగాని, ధ్యానం వలనగాని, మానవ ప్రయత్నాల వలనగాని ఆయనను కనుగొనలేదు. దేవునితో వారికున్న సంబంధం విశ్వమాన పరిమాణం కలది. దేవుడు భూమ్యాకాశాలను తయారుచేసిన సృష్టికర్తగ వారు గుర్తించారు. అటువంటప్పుడు, ప్రార్థన అన్నది, తన ప్రేమపూరిత దయవలనను, తన విశ్వసనీయత వలనను ప్రారంభించిన సంబంధమని గుర్తించుకొని, చేసేటివంటిది.

**రెండవది,** మానవ లక్షణాలతో కూడ దేవున్ని వ్యక్తిగతంగ సంభోదించడం ఉంది. వారి చరిత్రలో దేవుని గురించిగల వారి అనుభవాలు, యిస్రాయేలీయులను గమనించే దేవునిగ చూసారు, వారు మొరపెట్టుకున్నపుడు వారిని ఆలకించి

తగువిధంగ స్పందిచే వ్యక్తిగ, తమ అవసరాలను, వారి ప్రవర్తలను గమనించే వానిగ చూసారు. కొన్నియెడల దేవునితో బేరసారాలు కూడ చేసారు: ఉదాహరణకు, అబ్రహాము సొదొమ, గొమొర్రా విషయంలో. కొన్నిసార్లు, దేవుడు పనిచేసే తీరును అలక్ష్యంగ భావించి, ఫిర్యాదు కూడ చేసారు. ఊదాహరణకు: సీనాయి పర్వతం మీద మోషే. అయినా వారు, ఏనాడు దేవున్ని సామాన్య మానవునిగ దిగజార్చలేదు. ఆయన మానవ అవగాహనకు ఎల్లప్పుడు ఆశ్చర్యకరుడుగానే ఉంటాడు. మనలానే ఆయన ఎంత ఉన్నా, మనకు కనిపించే రూపంలో దర్శనం ఇవ్వలేదు.

**మూడవది,** అన్ని మంచి విషయాలకు: ప్రకృతి, కుటుంబం, శాంతి, సంపద, మన్నింపు, చివరకు తమ జీవితం యిస్రాయేలీయులు ప్రార్థనలో దేవునిమీద వారు ఆధారపడియున్న సంగతిని తెలియజేసే వారు. అవన్ని వారికి దేవుని నుండి రావలసినవే! ఈ రకమైన ద ృష్టి మొదటి భాగమైన ఒడంబడిక సూత్రానికి ముడిపడి ఉంది: “నేను మీ దేవుడను” (నిర్గమ 6:7; లేవీ 26:12; యిర్మీయా 7:23; యెహెజ్కేలు 36:28). వారిని ఐగుప్తు బానిసత్వం నుండి విడుదల చేసి, ఒడంబడిక ద్వారా తన ప్రజలుగ చేసుకున్న దేవుడు, అన్ని ఉపకారాలకు మూలం, తల దాచుకొనే శైలం, భవిష్యత్తుకు కచ్ఛితమైన నమ్మకం.

**నాల్గవది,** రెండవ భాగమైన ఒడంబడిక సూత్రం. “మీరు నా ప్రజలై ఉందురు” అన్న వచనం దేవుని ప్రజలుగ ఉండే ఒప్పందాన్ని తెలియ జేస్తుంది. అనగ, యాగాది ప్రార్థనలు, స్తుతిప్రార్థనలు, ఆరాధనలు, హాజరైన బహిరంగ సంఘం యొక్క ఆమోదం వంటివి చాలా ముఖ్యం. ఇటువంటి ప్రార్థనమీదనే ఆధారపడి, వారు ఒక జాతిగ గుర్తింపు పొందారని, దేవుని ప్రజలుగ మారారని తెలుసుకున్నారు. ఆయన వారిని తనవారిగ చేసికొని, వారికి ప్రత్యేక కడగతిని ఇచ్చి, ప్రపంచంలో జాతులమధ్య ప్రత్యేక స్థానమిచ్చాడు. ఈ రకమైన జీవపు ప్రార్థన, బహిరంగ ఆరాధన స్థలమైన పరిశుద్ధ స్థలం, అనగ, వారు అక్కడకు చేరలేనపుడు దాని అభిముఖంగ తిరిగి ప్రార్థించుకొనే, దేవాలయంనకు కల్పించిన అధిక ప్రాముఖ్యత కనిపిస్తుంది. వాస్తవానికి, దేవుడే స్వయంగ ఆ పరిశుద్ధ స్థాలాన్ని

తన ప్రజలకు ఇచ్చాడు గనుక, యిస్రాయేలీయులు పరిశుద్ధులు అవుతారు. కుష్టురోగియైన నామాను పరిశుద్ధమని గ్రహించి, అక్కడనుండి రెండు మూటల మట్టిని తీసుకెళ్తాడు (2 రాజులు 5:17).

ఐదవది, తమ ప్రార్థనలను దేవుడు ఆలకిస్తున్నాడని అసాధారణమైన నమ్మకం వారికి ఉండేది. అర్థింపు ప్రార్థన సాధారణంగ దేవుడు తమ మనవులను ఆలకించి, వాటిని దయచేస్తాడన్న నమ్మకంతో ముందుగానే క ృతజ్ఞతలతో ముగించేవారు. దావీదు ప్రార్థనలు (2 సమూ. 7:18), సొలొమోను ప్రార్థనలు ఇందుకు చక్కటి ఉదాహరణలు. ఒడంబడిక సంబంధంలోగల చనువు తండ్రీపుత్రుల మధ్యగల అనుబంధం లాంటిది (నిర్గమ 4: 22), లేక తల్లి చంటిబిడ్డల మధ్యగల అనుబంధం లాంటిది (యెషయా 49:15), లేక భార్యభర్తల మధ్యగల అనురాగం లాంటిది (హొషెయ 2:14-16), కనుక ఈ రకమైన ప్రార్థన ప్రజలలో కదిలింపలేని నమ్మకం, ఆధారపరమైన విశ్వాసం ఏర్పడ్డాయి.

## B) నూతన నిబంధన నుండి వచ్చిన సూత్రాలు

క్రైస్తవ ప్రార్థన విషయమై మరియతల్లి, యేసుప్రభువు నుండి కూడ పునాదులుగల కొన్ని సూత్రాలను మనం తీయవచ్చు.

యేసు గురించిన నూతన నిబంధన యొక్క ప్రార్థనా వివరణ బట్టి, దేవునితో ఐక్యమొందు ఈ రకమైనది చాలా తరచుగ, అలవాటుగ, బోధనలతో స్వస్థత కార్యాలతో నిండి ఉన్నప్పటికి, ఆతని జీవిత పర్యంతం ప్రార్థన ఉండినది. ఏదో ప్రార్థన కోసం కొంత సమయాన్ని కేటాయించినట్లుగ కాకుండ, ప్రార్థన ఆతని జీవిత ముఖ్య సారంగాను, జీవిత లక్ష్యంగాను ఉండింది. ప్రార్థన అనేది ఆయనకు జీవిత యానంలో అంతర్భాగంగ ఉండేది. ఈ ప్రార్థన ఆయన జీవితంలో ఆయా సందర్భాలనుబట్టి, చాలా రూపాలను పొందింది: స్తుతుల ప్రార్థన, కృతజ్ఞత భావం, అంకిత భావంతో తనను తాను సమర్పించుకోవడం, తండ్రి దేవునియందు పరిపూర్ణ నమ్మకం. ఆయన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనేటపుడు, ఎంచుకొనిన విధానంలో ప్రార్థనను చేసేవాడు. దేవున్ని "అబ్బా" అని సంబోధించాడు. యేసుకు, నిజం చెప్పాలంటె, ఆయన వ్యక్తిత్వం తండ్రి దేవునితో ఆతనికిగల సంబంధం

వలననే ఏర్పడింది. అందువలననే, ఆయన ప్రార్థనలలో తరచు అటువంటి భావప్రకటనలు కనిపించేవి. ఈ సంబంధం వలననే ఆయన అందరికంటెను దైవ కుమారుడు అయినాడు. ఈ సంబంధం ప్రతియొక్కరిని రూపులోకి తెస్తుంది. ఆయనకున్న వ్యక్తిత్వపు ఆకర్షణలో ముఖ్యమైన భాగం ఏమన అది ఆయన ప్రార్థన తత్త్వం.

1. దేవుడు తీసుకున్న మొదటి చొరవ యొక్క ఫలంగ ప్రార్థన కొనసాగుతుంది. మనలను తొలుత ప్రేమించిన దేవునికి స్పందించుటయే ప్రార్థన. అలా ప్రేమించిన దేవుడు తన కుమారుని ఈ లోకానికి పంపి, అతని ద్వారా మనం జీవించాలని ఉద్దేశపడ్డాడు. తన ఆత్మను మన రక్షణ ప్రతిజ్ఞగ మనకోసం పంపాడు.

2. పూర్వనిబంధనలో ఆవిష్కృతమైన అదే వ్యక్తిగతమైన దేవున్నిఈనాడు మనం ప్రార్థిస్తున్నాం. కాని, ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు యొక్క తండ్రిగ మనం గుర్తిస్తున్నాం. పవిత్రాత్మ యొక్క వరంద్వారా మనంకూడ “అబ్బా! తండ్రి” అని పిలువగలుగుతాం. దేవునితో మనకు ఒకొక్కరికున్న సంబంధం బట్టి వ్యక్తిగతంగ మనం ఆయన బిడ్డలం, ప్రతి ఒక్కరం ఆయన కుమారుడు లేక కుమార్తె.

3. పూర్వనిబంధనలోగల మన తండ్రి, నూతన నిబంధనలో కూడ మనకు తండ్రి. ఆయన మంచికి మూలం. ఒడంబడిక సూత్రం, “నేను వారికి దేవునిగ ఉందును, వారు నాకు ప్రజలై ఉందురు” అని మాత్రమేగాక, “నేను మీకు తండ్రిగ ఉందును, మీరు నాకు కుమారులుగ, కుమార్తెలుగ ఉందురు” అని ఏర్పడింది (2 కొరింతీ 6:18). ప్రభువు మనకు నేర్పిన ప్రార్థనలో మన తండ్రి దేవుడు మన అనుదిన ఆహారానికి మూలమని, మన పాపాలను మన్నిస్తాడని, మనలను చివరకు పడద్రోసే శోధనలు కీడులనుండి రక్షిస్తాడని మనకు తెలియవస్తుంది.

4. నూతనవేదంలోని ప్రార్థనలో సాంఘిక కోణంకూడ ఉంది. అది మనలను దేవుని కుటుంబంగా, అతని కుమారులు, కొమార్తెలుగ ఏర్పరచి, ఆవిష్కరిస్తుంది. యేసుని మాతృక ఉదాహరణల వెంబడి, ఆయన బోధనల వెంట, మనం ఒకరికొకరి కోసం, శత్రువుల గురించి కూడ, ప్రార్థించాలి. మరియతల్లి ప్రార్థన మనకు

పునీతులతోగల సంబంధం గురించి చెబుతుంది. వారందరు మరణించి, ఇప్పుడు క్రీస్తుతో ఉన్నారు. మన తరపున వారి ప్రార్థనలు ఆత్మలోగల ఐక్యతయందు వేళ్లూనుకుంది. ఈ ఆత్మ అందరిని క్రీస్తు శరీరమందు నెలకొనునట్లు చేస్తుంది. మరణించిన, జీవిస్తున్న, విశ్వాసులయొక్క ప్రార్థనలు, యేసుతో తయారైనవి. ఈ యేసు, ఆయన పేరిట, ఆయన నామమున, ఆయన ద్వారా, ఆయన యందు ఎక్కడకూడి, ప్రార్థించిన, ఆయన మన కొరకు విన్నపప్రార్థనలు చేస్తుంటాడు. ఆతని జీవం నిచ్చే ఆత్మ వరం ద్వారా మనం ఆయన శరీర భాగాలమై ఉన్నాం.

5. చివరిగ, నూతన నిబంధన యొక్క ప్రార్థన, యేసుని ప్రార్థనల మీదను, వాగ్దానాల మీదను ఆధారపడి, ఎంతో నమ్మకంతో చేసేటటువంటిది. ఈ ప్రార్థన క్రైస్తవ జీవితమెల్ల చొచ్చుకుపోయే ఒక విషయం. ఇది గతంలోకి కృతజ్ఞతతోను, స్తుతులతోను చూస్తు శాంతి సంతోషాలతో వాస్తవాన్ని వీక్షిస్తు నమ్మకంతోను, మాట యిచ్చిన తదుపరి జీవితం గురించి భవిష్యత్తుకు ఎదురుచూస్తు చేసేదే మన ప్రార్థన. క్రైస్తవ ప్రార్థన తండ్రి దేవునియొక్క ముందు చనువువలన అనంత ప్రేమకు స్పందించడమే. ఈ ప్రేమ ఆయన కుమారుడగు క్రీస్తుయేసు జీవితం, మరణం, పునరుత్థానాల ద్వారా ప్రత్యక్ష పరచడం జరిగింది, పరిశుద్ధాత్మ ద్వారా తెలియజేయబడింది.

## మీ దేవుడు ఎక్కడ?

ప్రార్థన దేవునితో ఏదో ఒక రకమైన సంబంధం కలిగుంటుంది. కాబట్టి, ఉనికికి సంబంధించిన ప్రశ్న ఉదయిస్తుంది, "దేవుడు ఎక్కడ చురుకుగ ఆ సంబంధంలో ఉంటాడు?" ఈ ప్రశ్నకు జవాబు చెప్పే ప్రయత్నంలో మనం మొదటగ పరిశుద్ధ గ్రంథం మీద ఆధారపడి, మిడిమిడి జ్ఞానంతో ఇదివరకు తరచు ఇచ్చిన రెండు అసంతృప్తికరమైన జవాబులను గమనిస్తాం.

దేవుడు పరిశుద్ధ స్థలంలో ఉంటాడు: రెండింటిలో మొదటి అసంతృప్తికరమైన జవాబు ఒట్టినే దేవున్ని పరిశుద్ధ స్థలాల్లో ఉంచుతుంది, ఉదాహరణకు యెరూషలేం దేవాలయం (కీర్తనలు 42:4; 43:3; 46:4). ఈ వచనాలలోని భావార్థాలను తప్పుగ గ్రహించే అవకాశం ఉంది. అవి ఒట్టినే దేవున్ని గౌరవించే స్థలాన్ని,

ప్రజలమధ్య దేవుని ఉనికిని ప్రతీకగ తెలియపరచే స్థలాన్ని సూచిస్తున్నాయి. అంతేగాని, దేవునియొక్క ఉనికిని, క్రియాశీలతను ఓ స్థలానికి కుదించ లేదు. దేవుడు నివసించగల దేవాలయం ఎక్కడ లేదు. యావత్తు విశ్వం ఆయన నివాసంగ అవుతుంది. స్పష్టంగ, “మీ దేవుడు ఎక్కడ?” అన్న ప్రశ్నకు సమాధానం పలాన స్థలంలో ఉంటాడని చెప్పలేం.

దేవుడు మోక్షంలో ఉంటాడు: ఇది రెండవ అసంతృప్తి కరమైన జవాబు. ఎందుకంటే, ఇదికూడ సరియన అవగాహనలేని పరిశుద్ధ గ్రంథ పఠనం మీద ఆధారపడి ఉంది. దేవుడు ఎత్తైన స్థలంలో స్వర్గంన ఉన్నాడు అని అంటాయి (కీర్తనలు 115:3; 123:1). మరొకమారు, హీబ్రూ ప్రయోగం వాస్తవం కాదని, అవిజ్ఞానశాస్త్రమైన ప్రతీక అని చెబుతుంది. ఈ అందని తీరాలు కేవలం దేవునికి మనకు మధ్యగల దూరాన్ని, దగ్గర కాదని తెలుపుతాయి. దేవుడు ఏదో ఒక దైవీక ప్రాంతంలో ఈ లోకానికి అతీతంగ ఉంటాడని, ప్రార్థనలకు జవాబుగ ఆయా సమయాలలో వచ్చి తన పనులను, అద్భుతాలను, ఆవిష్కరణలు కావిస్తాదని తలంచారు.

సూచించిన పరిశుద్ధ స్థలాలకన్న, అతీతమైన నివాసాలకన్న బైబిలు పరమైన మన స్పందనతో దేవుని ఉనికిని, పనులను వెదకినట్లయిన అదే గొప్పది. వేదాల భాషను యథాతథంగ తీసుకుంటే, మనకు సరియైన జవాబు లభించదు. ఎందుకంటే, వాటి భావాలు పైపైన అసంతృప్తిగ ఉంటాయి. లోతుల్లోకి వెళ్తేనే మనకు అసలు విషయం తెలిసేది (1రాజులు 8:27; యిర్మియా 23:23-24; కీర్తన 139:7-10).

నూతనవేదంలో పలుచోట్ల విభక్తులను ఉపయోగించుట ద్వారా దేవునితో మన సంబంధాన్ని సూచిస్తారు. ఇది మనం దేవుని ఎక్కడ ఎలా కనుగొనాలో తెలుపుతుంది. ఎందుకంటే, “ఆయన యందే మనము జీవించుచు, సంచరించు చున్నాము, ఉనికిని కలిగియున్నాము” (అ.కా. 17:27-28). ఇక్కడ వాక్యం, దేవుని యందు మనము ఉన్నామని చెబుతుంది, కనుక ఆయన మనకొక్కరికి దగ్గరగ ఉన్నాడు. దేవుడు మనచుట్టు ఉండి, మనకు అండగాను, పోషించే నిధిగ ఉంటాడు. అన్నింటికన్న అతను మనకు అన్ని విధాలుగ ఉన్నాడు.

దేవునితో ఈ ప్రపంచానికిగల అవగాహన అతివర్ణనగల సంబంధం గురించి పౌలు ఇలా వ్రాస్తాడు: "ఆయన నుండియే, ఆయన మూలముననే, ఆయన కొరకే సమస్తము ఉన్నవి. ఆయనకే సదా స్తుతి వైభవములు. ఆమెన్" (రోమీ 11:36). ఇది దేవునిమీద ఆధారపడి ఉండే విశ్వమానవ సందర్భంలో పౌలు రక్షణ చరిత్రను గుర్తుకు తెస్తున్నాడు."ఆయన నుండియే" అని చెప్పడం ద్వారా దేవుడు సృష్టికర్తని, వాస్తవానికి ఆధారమని చూపుతున్నాడు. "ఆయన మూలముననే" అని అన్నపుడు, ఆయన నుండియే అన్నట్లు, ఈ విశ్వానికి ఆధారం, మనుగడ దేవుడేనని తెలియపరుస్తున్నాడు. "ఆయన కొరకే" అన్నది ఈ సృష్టికి ముగింపు ధ్యేయం దేవుడేనని చెబుతున్నాడు.

ఈ ప్రపంచంలో దేవుని ఉనికి, ఆయన పనుల గురించి ఉన్న ప్రశ్నకు జవాబుగ – వేదం నుండి ఈ వాక్కులు ఏ ఒక్క ప్రత్యేక స్థలానికి దేవున్ని కుదించవు. అవి ఆయనను ఒక చోటుకు అదిమి పెట్టనివ్వవు. అయిన, అవి మన మనసును పవిత్ర స్థలాలను దాటించి తీసుకుపోతాయి.

❀ ❀ ❀ ❀

# 4. ప్రార్థనలో అంతస్థులు

- బ్రదర్ యందవ మత్తయాస్ కుమార్
- బ్రదర్ వడ్లపాటి మరియదాస్




మన ప్రార్థన అభివృద్ధి చెందుతున్న కొలది, ఆధ్యాత్మిక జీవితం కూడ ఒక్కొక్క అడుగు పురోభివృద్ధి చెందుతుంది. మొదటి కారణం, జీవితంలో మన సొంత స్థితికి చెందిన పుణ్యక్రియలను ఆచరించుటకు కావలసిన దేవుని బలం, సహాయం ప్రార్థన నుండి పొందుతాం. రెండవది, ప్రార్థన ద్వార ఏర్పడె ఉత్సాహం మన తలంపులను ఉన్నతంగ లేవనెత్తి, ఉత్సాహాన్ని బలపరచి, మన హృదయానికి మార్గదర్శకంగ ఉంటుంది. ప్రార్థన మనలను దేవునితో ఐక్యపరచి, మోక్షంలోకి సంతోషంగ ప్రవేశించుటకు మనలను తయారుచేస్తుంది.

దైవ దర్శనానికి సిద్ధపడేటపుడు శుద్ధీకరణ అవసరం. పునీత తోమస్ అక్వినాస్, పునీత సిలువ యోహానుల ఆలోచన ప్రకారం, ఈ శుద్ధీకరణ ఈ లోకంలోగాని లేక ఉత్తరించు స్థలంలోగాని జరుగుతుంది. చాలా మంది విశ్వసించేది ఏమిటంటె, పాపాలను ఒప్పుకుంటె సరిపోతుందని, కాని ఒకప్రక్క తపస్సును కోరుతుంది, మరోప్రక్క శాశ్వత కాంతిని ఎవరు వెంటనే కన్నులతో చూడలేరు, ముఖ్యంగ ఇతర వస్తువులను చూచిన అలవాటు వలన మన కళ్లు శాశ్వత వెలుగును చూడ తయారుకాలేదు.

"మన పవిత్రతతంతా కూడ ప్రేమ గురించె, ఎందుకంటె, చట్టాలన్ని ప్రేమలోనే ఇమిడున్నాయి" అని పునీత ఫ్రాన్సిస్ డి సేల్స్ అంటారు (చూడుము మత్తయి

22:10). ప్రేమలో గల అంతస్థులు దైవానుగ్రహంలో అంతస్థులకు ఊపును ఇస్తాయి, దైవానుగ్రహంలో గల అంతస్థులు మనకు మోక్షమహిమ అంతస్థులను ఇస్తాయి. మన ప్రేమ పిసనారిది కావడానికి కారణం, మనం పవిత్రాత్మ ప్రేరణలకు చెవియొగ్గక పోవడం. ఆత్మే దైవానుగ్రహానికి మూలం. ఆత్మే ప్రేమ. దైవప్రేమ నిచ్చెన లాంటిది. అది అనంతంలోకి మాయమయింది, కాని క్రీస్తు దానిని మనకోసం నిలబెట్ట గలడు. ఏదియేమైన, బద్దకస్థులైన ఆత్మలకు (క్రైస్తవులకు) మాత్రం అది దక్కదు.

స్పెయిన్ దేశస్థురాలు, పునీత అవిలాపురి తెరేసా (1515-1582) ప్రార్థనాధిపతురాలు.  ఇందుకు కారణం - ఆమె ప్రార్థన గురించి విస్తృతంగ మాట్లాడింది. స్పెయిన్లో దుర్గాలు, కోటలు ఉండేవి. ఇవి ఆమె ప్రార్థనా అంతస్థులకు తావిచ్చాయి. ఆమె దృష్టిలో ఆత్మ అన్నది ఎన్నో అంతస్తులుగల ఒక కోట లాంటిది. ఆమె వాటిని భవంతులని కూడ తలచేది. ఆమె ప్రకారం, ప్రార్థన ఏడు భవంతులుగగాని, లేక ఏడు అంతస్తులుగగాని ఉంటుంది.

అవి: **1. మౌఖిక ప్రార్థన**

**2. ధ్యానం లేక మానస ప్రార్థన**

**3. ప్రభావిత ప్రార్థన లేక ఉద్వేగపూరిత ప్రార్థన**

**4. నిరాడంబర ప్రార్థన: A. సాధన చేసిన ధ్యానం,**

**B. ప్రవేశపెట్టిన ధ్యానం.**

**5. నిశబ్ద ప్రార్థన**

**6. సాధారణ సమైక్య ప్రార్థన: A. నిగూఢ తన్మయత్వంలో సమైక్యమైన ప్రార్థన**

**7. రూపాంతర సమ్మేళన ప్రార్థన**

ఈ ఏడు అంతస్తుల ప్రార్థన రెండు భాగాలుగ విడదీసారు.

**a. నిష్టలతో కూడిన ప్రార్థన:** ఈ ప్రార్థనలో మానవ ప్రయత్నం అధికం, దేవుని పని తక్కువ.

**1. మౌఖిక ప్రార్థన**

**2. ధ్యానం లేక మానస ప్రార్థన**

**3. ప్రభావిత ప్రార్థన లేక ఉద్వేగపూరిత ప్రార్థన**

**b) అతీంద్రియ ప్రార్థన: ఈ ప్రార్థనలో మానవ ప్రయత్నం తక్కువ, దేవుని పని అధికం.**

**4. నిరాడంబర ప్రార్థన: A. సాధన చేసిన ధ్యానం, B. ప్రవేశపెట్టిన ధ్యానం.**

**5. నిశబ్ద ప్రార్థన**

**6. సాధారణ సమైక్య ప్రార్థన: A. నిగూఢ తన్మయత్వంలో సమైక్యమైన ప్రార్థన**

**7. రూపాంతర సమ్మేళన ప్రార్థన**

ఈ తన్మయత్వపు నిచ్చెనను చివరివరకు ఎక్కుటకు మన జీవితం చాలా చిన్నదని అనిపిస్తుంది. కాని ప్రతి ఒక్కరం దేవుని అనుగ్రహం వలన దానిని చేరుకోగలం. ప్రతి ఒక్క క్రైస్తవబిడ్డ మౌకిక, ధ్యానం, ప్రభావిత ప్రార్థనల నిష్టాగరిష్ట ప్రార్థన మాత్రమేగాక, నిరాండంబర, నిశబ్ద, సాధారణ సమైక్య, మారురూపు నిచ్చే సమైక్యతా ప్రార్థనల అతీంద్రియ ప్రార్థనను కూడ సాధన చేయాలి. ఏడవ అంతస్తులోనే మోక్షరాజు నివసించేది. ఇవన్నీకూడ క్రైస్తవ నిగూఢ తన్మయత్వపు వివిధ స్థాయిలకు చెందినవే. కాని, అదే సమయంలో, అవి సాధారణమైన ప్రార్థనలే! ఇపుడు ఈ ఏడు స్థాయిల ప్రార్థనలను చూద్దాం.

## 1. మౌఖిక ప్రార్థన

మౌఖిక ప్రార్థన మొదటి ప్రార్థనా అంతస్తుకు చెందినది. మౌఖిక అన్న పదం ముఖం అనే పదం నుండి వచ్చినది. ఇక్కడ దాని అర్థం నోటి మాటలతో చెప్పే ప్రార్థన అని. కనుక, మౌఖిక ప్రార్థన అనగా, స్వరప్రార్థన లేక పదాలతో చెప్పే ప్రార్థన అని అర్థం. అది ఒక జపం కావచ్చు, ఒక పాట కావచ్చు, నోటితో ఉచ్చరించే ఏ రకమైన ప్రార్థనైన కావచ్చు. అది మనసులోనుంచి వచ్చి, పెదవుల ద్వారా మాట్లాడడం జరుగుతుంది. అది దైవార్చన క్రమానికి చెందిన ప్రార్థన అవుతుంది.

దైవార్చన ప్రార్థన కొన్ని చిన్న విషయాలలో తప్ప, అంతాకూడ మౌఖికమైనదే. దివ్యవిందు వేడుక, సంస్కారాల కార్యక్రమం, పరిశుద్ధ సంకీర్తనం, ఆడంబరమైన అర్చన కాండలు, ఆశీర్వాదాలు మున్నగునవి మౌఖిక ప్రార్థన క్రిందకే వస్తాయి. జపమాల, మంగళవార్త జపం, త్రికాల జపం, విశ్వాస సంగ్రహం,

ఉదయ సాయంకాల ప్రార్థనలు అన్నీ మౌఖిక ప్రార్థనలే. బాగా తెలిసిన ప్రార్థన, అందరికి బాగా పరిచయమున్నది, పరిపూర్ణ ప్రార్థన క్రీస్తు యేసు నేర్పించిన పరలోక ప్రార్థన. దీనిని మనం వ్యక్తిగతంగగాని, సంఘ ప్రార్థనలలోగాని అధికంగ ఉపయోగిస్తాం. మౌఖిక ప్రార్థన ఒకే వ్యక్తిగాని, సంఘంలోగాని చెబుతుంటాము. ఉదాహరణకు జపమాల. "ఎక్కడ ఇద్దరు లేక ముగ్గురు నా పేరట కూడుదురో అక్కడ నేను వారి మధ్య ఉంటాను" అని ప్రభువు సెలవిచ్చారు (మత్తయి 18:20). మౌఖిక ప్రార్థన దేవునికి ఆత్మాంజలేగాక, శరీరాంజలినికూడ ఘటిస్తుంది. ఇది అంతర్భక్తిని ఉత్తేజ పరచడమేగాక, ధ్యానాన్ని సులువుగ చేస్తుంది.

మౌఖిక ప్రార్థన దేవున్ని మెప్పించడానికైతే, దానిని సావధానంతోను, నిండైన భక్తితోను చేయాలి. ఈ భక్తిభావం కొన్ని విషయాల వలన ఉద్భవిస్తుంది: ప్రగాఢమైన విశ్వాసం, గట్టియైన నమ్మిక, దైవప్రేమ, అణకువ, నిలకడైన ప్రయాస. ఈ విషయాలు నిజమైన భక్తిని కలిగుంటాయి. దురదృష్టవశాత్తు, కొందరు కేవలం పెదాలతోనే ప్రార్థిస్తారు. ముఖ్యమైన పైవిషయాలు ఉండవు. మన దైవబోధకుని మాటలను గుర్తుకు తెచ్చుకుందాం: "అన్యులవలె అనేక వ్యర్థ పదములతో మీరు ప్రార్థింప వలదు. అట్లు చేసినగాని, దేవుడు తమ మొర నాలకింపడని వారు భావింతురు. కాబట్టి వారివలె మీరు మెలగరాదు. మీకేమి కావలయునొ మీరు అడగక మునుపే మీ తండ్రి యెరిగియున్నాడు" (మత్తయి 6:7-8).

చాలా మంది తమ మౌఖిక ప్రార్థనలో పలికే పలుకుల్లో మనసును భక్తిగ నిలుపలేక పోతున్నామని వాపోతుంటారు. ఇందుకు కారణంగ చాలా విషయాలున్నాయి. శారీరకంగ అనిశ్చలత, ప్రతిష్టా లోపం, మానసిక ఆందోళనలు, దెబ్బతిన్న భావాలు, సొంత పనులమీద ద్యాస, అభద్రతా భావం, కావలసిన వారికి జరిగిన దురదృష్టాలు – ఇవన్నీ మౌఖిక ప్రార్థనలు చేసేటపుడు మనసును కలవర పరుస్తుంటాయి. మానసికంగ మన్సును నిలకడగ నిలుపలేని వారికి పునీత అవిల్లా తెరేసా భక్తిగ మౌఖిక ప్రార్థనలను చేయడంలో చక్కని పద్ధతిని అందిస్తున్నారు. చేస్తున్న ప్రార్థన మీద మీరు దృష్టిని నిలుపలేకుంటె, మౌఖిక ప్రార్థనను భక్తితో సాధన చేయండి. ప్రార్థన చేసేటప్పుడు, మీ దృష్టిని మీరు చెప్పే పదాలమీదగాక,

మీ హృదయ అంతరాళంలో నివసించే దేవుని యందు నిలపండి, లేకుంటె యేసు నివసించే దివ్యమందసం మీద మనసుపెట్టండి, లేదా మీ పుస్తకంలోనో బల్లమీదో పెట్టిన యేసు పటాన్ని లేక స్లీవస్వరూపం మీద ఉంచండి. మీ ప్రమేయం లేని శోధనలుగాక, మీ ప్రమేయంగల కలకలం మాత్రం పోతాయి. అయినా మీ ప్రార్థన యొక్క సువాసన తగ్గిపోదు. ఇంతమాత్రమె మీరు చేయగలరు."

## 2. ధ్యానము

మన మనసు తన ఇష్టానుసారంగ ఆలోచిస్తుంటుంది. కాని దానిని అదుపులో పెట్టి, మనం ఎన్నుకున్న ఇతివృత్తంను మాత్రమే ఆలోచించడాన్ని ధ్యానం అంటాం. ముఖ్యంగ ఆధ్యాత్మిక విషయాలు తీసుకొని వాటిగురించి యోచించడం ధ్యానమని అంటారు. మనసును కేంద్రీకృతం చేసి, మనిషి గురించి, లేదా ఈ ప్రపంచంలో ఏ వస్తువు గురించైనా సరే ఆలోచించడమే ధ్యానం.

రెండవ అంతస్తయిన ఈ ధ్యానాన్నే మనో ప్రార్థన అని అంటారు. ఎందుకంటె, ముఖ్యమైన పనిని మెదడు, అంతఃకరణం లేక భావాలు చేస్తుంటాయి. పరమార్థాన్ని గ్రహించడానికి, దానిని ప్రేమించడానికి, దైవానుగ్రహంతో దానిని మన జీవితంలోకి చొప్పించడానికి, అతీతమైన సత్యంతో మన మనసును ముడివేయ ఈ ధ్యానాన్ని చేస్తుంటాం.

ఒకరి ఆధ్యాత్మిక అవసరాలనుబట్టి ప్రకృతిసిద్ధమైన, అతీతమైన సత్యాల మీద ప్రతిబింబిస్తు, వాటిపై కారణాత్మకంగ ఆలోచించడమె ధ్యానం. సాధారణంగ, ధ్యానం వరాలను తెచ్చిపెట్టే ప్రార్థనతో ముగుస్తుంది. అనేక పుణ్యమార్గాలలో ఆధ్యాత్మిక అభివృద్ధి చెందడానికి ధ్యానం తప్పక తోడ్పడుతుంది.

యేసుని పునీత తెరేసా ఇలా అంటారు: "చాలా ఆత్మలు పక్షవాత రోగులు లాంటివి. ప్రభువు పక్షవాత రోగిని లేవనెత్తినట్లు, వీటిని లేవనెత్తకుంటె, ఆ పక్షవాతరోగిలా 38 సంవత్సరాల పాటు కోనేరువద్దనే ఉండిపోవలసి ఉంటుంది. అటువంటప్పుడు, భీకర ప్రమాదాలు, ప్రమాదపు దురదృష్టాలు వచ్చి మీదపడతాయి."

పరిశుద్ధతను ఆశించువారికి కచ్చితంగ ధ్యానం అవసరం. సాధారణ మౌఖిక ప్రార్థన, ప్రతిదిన దివ్యసత్ప్రసాద స్వీకరణ, తదితర ఆచరణలు అవసరం. వీటిని ఆచరించు వారందరు ఆధ్యాత్మిక జీవితం జీవిస్తున్నట్లేగాని అది కేవలం మధ్యస్థం మాత్రమే! మనలను మనం అపూర్వమైన అణకువతోను అవలోకనంతోను తెలుసుకోడానికి ధ్యానం తప్పనిసరి. ఇంకను, దేవున్ని, ఆతని కారుణ్యంను తెలుపుతుంది. పవిత్రాత్మ పనుల యందు లోతైన విశ్వాసంను కలుగజేస్తుంది. స్థిరమైన నమ్మకంను, దైవ ప్రేమను అనుభవంలోకి తెస్తుంది.

**ధ్యానం యొక్క ప్రభావాలు:**

– ధ్యానం వస్తువును (ధ్యానించె విషయం) మెదడు యొక్క వెలుగులోకి తెచ్చి, వస్తువు యొక్క స్వభావాన్ని స్పష్టంగ మెదడుకు కాన్పింప జేస్తుంది.

– ధ్యానం మనలో నివసించు దేవుని యొక్క ఉనికిని కనుగొనునట్లు చేసి, ఆయనతో వ్యక్తిగత అనుభవంను కలుగజేస్తుంది.

– ధ్యానం మన ధోరణిలో మార్పును తీసుకొచ్చి, పర్యవసానంగ మన నైతిక ప్రవర్తనలో కూడ మార్పును తీసుకొస్తుంది.

– ధ్యానం మనలోగల లోతైన భావాలకు జవాబులు లభించేల సాయం చేస్తుంది. ధ్యానంలో మన లోతుల్లోగల మనసును దర్శించినపుడు సరియైన జవాబులు లభిస్తాయి.

– ఒకసారి మన నిజ మనసు ధ్యానం ద్వారా మనం ఎందుకు ఈ లోకంలో ఉన్నామో, మన జీవిత పరమార్థం ఏమిటో తెలిసాక, ఇక మన జీవితం ధన్యమైనట్లే. అపుడు జీవితం అర్థరహితం అనిపించదు. దేవుడు ఈ లోకంను ప్రేమించినట్లు మనమును ఈ లోకాన్ని ప్రేమించగలుగుతాం.

– ధ్యానం మనలను స్వేచ్ఛవైపు నడిపిస్తుంది. అనగా, పాప బంధాలనుండి విముక్తిని కలిగించి, మంచిని ఎంచుకొనునట్లు చేసి, పరిపూర్ణతవైపు నడిపిస్తుంది.

– ప్రతి ధ్యానం జీవితంలోగల క్రొత్తదనాన్ని అనుభవించేలా చేసి, క్రీస్తునందు జీవించేలా చేస్తుంది. అదెలా ఉంటుందంటె, నీటిలో పూర్తిగ మునిగిన కుండ నీటితోనే నిండి ఉన్నట్లు.

– మనిషి లోపల మార్పును తీసుకొస్తుంది ధ్యానం. మనలో పాతుకుపోయిన గుణాలను, అలవాట్లను మార్చి మంచివైపు మల్లిస్తుంది ధ్యానం.

– ధ్యానం యొక్క అంశం: పునీత తెరేసా ప్రకారం ఫలవంతమైన ధ్యానం క్రీస్తుయేసు యొక్క జీవితం, ఆతని పరమ రహస్యాలు, ముఖ్యంగ ఆతని పరమ రహస్యాలైన శ్రమలు. ధ్యానానికి బైబిలు గ్రంథం అత్యంత సారమైన పుస్తకంగ ఆమె పరిగణిస్తుంది.

## 3. ప్రభావిత ప్రార్థన లేక ఉద్వేగపూరిత ప్రార్థన

ప్రభావిత ప్రార్థనలో మనోభావాలకు అత్యధిక ప్రాధాణ్యత ఉంది. ఆత్మ చాలా నిర్ణయాలను తీసుకుంటుంది, మనస్తాప పడడం, ప్రభువుకు విన్నపాలు చేయడం, దేవుని అపారమైన మంచితనం గూర్చి స్తుతించడం లేక ఇతర మనోభావాలను వ్యక్తపరచడం ఉంటుంది.

ఈ మూడవ అంతస్తు నిజానికి సాధాచేయబడి, హ ృదయానికి సంబంధించిన ధ్యానంగ తీసుకోవచ్చు. ఇది ఇంకను ధ్యానమే, ఇంకను మానస ప్రార్థనే. కాని ఇందులో మనోభావాలు ప్రబలంగ ఉంటాయి. కొందరికి కొద్దిగ చదివిన చాలు ధ్యానం వారికి చక్కగ కుదురుతుంది. అటువంటి వారికి ప్రభుని జన్మం, లేక ఆయన శ్రమలను ఇట్టే ధ్యానిస్తే చాలు అలా వారు మనోభావాలకు లోనవుతారు. తదుపరి పశ్చాత్తాపం, నిర్ణయాలు కొన సాగుతాయి. ఇటువంటిది సులువైన ధ్యానం అవుతుంది, ఎంతో సంతృప్తిని కలిగిస్తుంది.

ప్రార్థనలో మూడవ అంతస్తు ప్రభావిత ప్రార్థన. ఈ ప్రార్థనలో బుద్ధి చేసే ఆలోచనలను మనసు అధిగమించి, తన ఆధీనంలో ఉంచుతుంది. ఇక్కడ ప్రేమ అధిగమిస్తుంది. ప్రభావిత ప్రార్థన మానస ప్రార్థన మీద ఆధారపడి ఉంది. ధ్యానం నుండి ప్రభావిత ప్రార్థనకు మారడం కాస్తంత సులువుగనే జరుగుతుంది, కాని సాధారణంగ నెమ్మదిగ జరుగుతుంది.

వస్తుతః కొందరు ఆప్యాయతను, స్పందనను కలిగుంటారు. వారు సులువుగ ఈ ప్రతి ఆలోచనల నుండి ఆప్యాతలోకి అడుగుపెడతారు. ఇతరులు, వ్యతిరేఖంగ, ప్రకృతిసిద్ధంగ కుంచితభావంతో ఉంటారు. అటువంటి వారి ప్రార్థనలు పూర్తిగ

బుద్ధిమీద ఆధారపడి ఉండి, ఆప్యాతకు చాలా తక్కువ అవకాసం ఇస్తారు. ఇటువంటి వారు ప్రభావిత ప్రార్ధనలోకి ప్రవేశించడానికి చాలా సమయం పడుతుంది.

**ప్రభావాలు:**

– కొన్ని ఆత్మలు దేవునితో ఆత్మీయత, అపూర్వంగల సంబంధంలోకి అడుగుపెట్టి, ప్రేమపూరిత క్రియలద్వారా, పవిత్ర కోరికలద్వారా, పుణ్యక్రియలను చేయుటలో నూతన శక్తిని పుంజుకుంటారు.

– క్రైస్తవ పుణ్యక్రియలు, ఆలోచనలందు పవిత్రత, త్యాగక్రియలు, తననుతాను త్యజించుట, సేవయందు ఉత్సాహం, తమ బాధ్యతలందు విశ్వాస పూర్వక పరిపూర్ణత యందు పటిష్టమైన ప్రయాసపడడం నిజాయితీగల ప్రభావిత ప్రార్ధనకు నిదర్శనాలు.

– మనం ఎదిగేకొలది, మనకు ప్రతి ఆలోచన అవసరం ఉండదుగాని, కాని మన హృదయాలు ఆత్మీయతతో నిండి ఉంటుంది. ఆత్మీయత ముఖ్య పాత్ర వహిస్తుంది. ప్రతి ఆలోచన తగ్గుతుంది, ఆత్మీయత పెరుగుతుంది.

## 4. నిరాడంబర ప్రార్ధన

నాల్గవ అంతస్తు ప్రార్ధనే నిరాడంబర ప్రార్ధన. ఇది దేవునిమీద ప్రేమతో కూడిన సావధానంతో నిరాడంబరంగ, ప్రేమతో చూడడం. క్రీస్తునందు లేక ఆయన పరమ రహస్యాలందు ప్రేమతో ద ృష్టిని నిలపడం నిరాడంబర ప్రార్ధన అవుతుంది.

ఈ రకమైన ప్రార్ధనలో ఆత్మ తన్మయత్వంలో మునుగుతుంది, తదుపరి ప్రార్ధన ముగియగానే తాను దేవునితో ఏమి మాట్లాడారో తెలియదు, కాని దేవునియందు పూర్తిగ లీనమైన అనుభవం, దేవుని ఉనికిలోగల అనుభూతి ఉంటుంది. దీనిమూలంగ, మంచి చేయాలన్న కోరిక, దేవున్ని సంతృప్తి పరచాలన్న ఆశ ఉంటుంది.

నిరాడంబర ప్రార్ధన లేక దీర్ఘధ్యానమే నిశబ్ద ప్రార్ధన. ఈ ప్రార్ధనలో మనిషి పూర్తి నిశబ్దంలో దేవుని ఉనికిని మాత్రమే కోరుకుంటాడు. దేవుని ప్రేమ,

ఆతని స్పర్శ, ఆతని పనులు, ఆతని కౌగిలి, అన్నిటికి మిన్న ఆతనిలో లీనమవుటను కోరుకుంటారు. ఆత్మ తక్కువగ పని చేస్తుంది, కాని అధికంగ లాభిస్తుంది. ఈ ప్రక్రియ సంతృప్తిగ ఉంటుంది.

ఆత్మ సాధువుగ, నెమ్మదినెమ్మదిగ పై ప్రార్థన అంతస్తులను దాటింది: నిరాడంబర ప్రార్థనలోకి స్వచ్ఛంగ అలా మార్పు చెందడం పవిత్రాత్మ ప్రభావం వలన జరుగుతుంది. నిజంగ ధ్యానం చేసే ఆత్మలు సులువుగ ఈ నిరాడంబర ప్రార్థనలోకి అడుగుపెట్టి, పవిత్రాత్మ ప్రభావానికి తమనుతాము వశపరచుకుంటారు. పర్యవసానంగ, ఆత్మ అద్భుతమైన ఫలితాలను సులువుగ పొందుతుంది. నిరాడంబర ప్రార్థన దివ్యమందసంను వీక్షించినపుడే గాక, శ్రమలను ధ్యానించినపుడు కూడ కలుగుతుంది.

**నిరాడంబర ప్రార్థన లేక పరధ్యానం అని రెండు రకాలున్నాయి:**

**A) సాధన చేసిన ధ్యానం లేక చైతన్య సమాలోచన**

**B) ప్రవేశపెట్టిన చైతన్య ధ్యానం లేక అచేతన ధ్యానం**

## A) సాధన చేసిన ధ్యానం లేక చైతన్య సమాలోచన

ఈ ప్రార్థనలో వ్యక్తి దేవున్ని చూస్తాడు లేద దైవ దర్శనం కలుగుతుంది. ఇది మన ప్రయత్నాల వలన పొందవచ్చు. చైతన్య సమాలోచన అంటె దేవుని ఉనికిని గ్రహించుట. చైతన్య సమాలోచన సమయంలో ఆత్మ తన శక్తుల నన్నింటిని కూడదీసుకొని, తనలోకి తాను దేవునితో ఉండడానికి ప్రవేశిస్తుంది.

**సాధన చేసిన ధ్యానమందు ముఖ్య స్వభావ రూపులు:**

**i) దేవుని ఉనికిని తెలుసుకొనే స్థితిలోకి వెళ్లడం:**

పునీత అవిలాపురి తెరేసా అంటారు: " . . . ప్రభువు మనలో ఉన్నారు. మనం కూడ అక్కడనే ఉండాలి." ఆయన మనకు అతి సమీపంలోనే ఉన్నాడన్న సంగతి మనకు తెలిసి రాకపోవడమే మన సమస్య. మనకు దూరంగ ఉన్నాడనే ఎప్పుడు మన ఆలోచన.

### ii) అల్పాకర్షణల నుండి స్వాతంత్ర్యం:

మన హృదయ సింహాసనం మీదనే దేవుడు కూర్చున్నాడు. “మనలో ఎటువంటి అతిథి ఉన్నాడోనని ఎల్లప్పుడు జ్ఞాపకం ఉంచుకోడానికి మనం జాగ్రత్త పడితే, నేను అనుకుంటాను, ఈ ప్రాపంచిక విషయాలందు, అల్పాకర్షణల యందు మనం మునిగి ఉండడం కష్టతరం అవుతుంది. ఎందుకంటె, మనలోగల వాటితో పోల్చుకుంటె, అవి ఎంత విలువలేనివోనని మనమే తెలుసుకుంటాం” అని అవిలాపురి తెరేసా అంటారు. సాధన చేసిన ధ్యానం ద్వారా మనం ఈ అన్ని బంధాలనుండి విముక్తి పొందవచ్చును.

### iii) దేవునితో మాట్లాడే వాతావరనాన్ని ఏర్పరచుకొనుట:

చైతన్య సమాలోచనలో దేవునితో మనం ముఖాముఖిగ కలిసినపుడు, ఆయనతో సంభాషించుటకు అవకాసం లభిస్తుంది. పునీత అవిలాపురి తెరేసా ఇలా వ్రాసారు: “మనం ఆయనతో తండ్రితో మాట్లాడినట్లు చాలా అణకువతో మాట్లాడాలి. మన సమస్యల గురించి చెప్పవచ్చు, వాటిని సరిచేయ బ్రతిమిలాడవచ్చు, మనం ఆయన బిడ్డలుగ ఉండ తగమని జ్ఞాపకముంచుకోవాలి. . . . తండ్రితో, సోదరునితో, ప్రభువుతో, భాగస్వామితో అన్నట్లు మాట్లాడాలి. దేవునితో సంభాషణ నిశబ్ద క్షణాలను కూడ కలిగుంటుంది. స్నేహితులు కూడ ఒకరి చెంత నొకరు ఒట్టినే నిశబ్దంగ చాలా సేపు ఉండడం కద్దు. అలా ఉండడంలో వారు ఆనందాన్ని పొందుతుంటారు. తరచు, నిజమైన ప్రేమ నిశబ్దాన్నే కోరుకుంటుంది.

### iv) తనలోకి తాను తొంగిచూడడం:

సాధన చేసిన ధ్యానం మనలోకి మనం చూడగల సాదా చూపు ద్వారా లభిస్తుంది. పునీత అవిలాపురి తెరేసా అంటారు: “నీ దృష్టిని నీమీదకు త్రిప్పుకొని, నిన్ను నీవు చూచుకొనుము. నేను చెప్పినట్లు, నీవు నీ బోధకుని కనుగొంటావు. అతడు నిన్ను అపజయానికి గురిచేయడు.”

### సాధన చేసిన ధ్యానంతో కలుగు అవకాసాలు:

i) బహిర్గత ఇంద్రియాలమీద అజమాయిషీ పట్టును ఆత్మ సాధిస్తుంది.

ii) అంతర్గత ఇంద్రియాల మీద దేవుని ప్రేమ మరింత ప్రజ్వలన ఏర్పడుతుంది.

iii) సాధన చేసిన ధ్యానం ప్రవేశపెట్టిన సమాలోచనను జోరుగ పొందడానికి మనలను సిద్ధం చేస్తుంది.

## A) ప్రవేశ పెట్టిన ధ్యానం లేక సమాలోచన:

ప్రవేశపెట్టిన ధ్యానం ప్రకాశవంతమైన మనసు అవుతుంది. అది మన ప్రయత్నం, మన గొప్పతనం లేకుండగనే, దేవుడు ప్రవేశపెట్టిన ప్రార్థన. అది కేవలం దేవుని యొక్క వరం. "అది పూర్తిగ అతీతమైనది. మనం దానిని సాధించ లేము" అని అంటారు పునీత అవిలాపురి తెరేసా. ఆమె ఇంకను అంటారు: "నీ సొంత ప్రయత్నంతోగాని నీ క ృషి వలనగాని ఈ స్థితికి చేరుకోగలవని అనుకోవద్దు. అలాంటి దానిని ఆశించడం ఎక్కువే!

ప్రవేశ పెట్టిన ధ్యానం, ప్రధానంగ, బుద్ధిని మందగింప జేస్తుంది. ఎందుకంటె, అది తన శక్తులనుండి దూరమయింది. దేవుని కలవడానికి లోతుల్లోకి వెళ్లగల చనువు దన్ను లభించింది. దానిని పునీత అవిలపురి తెరేసా, చెదరిపోయిన గొర్రెలను త్వరగా పిలిచే కాపరి యొక్క స్వరమని అంటారు. ఈ ప్రార్థనలో మన కళ్లు వాటంతటవె మూసుకుంటాయి, బయటి శబ్దాలకు, మానవ మాటలకు, మన చెవులు మూసుకుపోతాయి, కాళ్లుచేతులు ఆడవు, మొత్తం శరీరం పొందుతున్న అనుభూతిని వ్యక్తం చేస్తుంది. ఆ విధంగ ఆధ్యాత్మిక నిశబ్దం శక్తులలో ప్రబలి ఉంటాయి.

### ప్రవేశ పెట్టిన ధ్యానపు ముఖ్య స్వభావ రూపుల్లో నాలుగు తత్వాలు:

### i) నేరుగ దేవుని గూర్చిన జ్ఞానం:

ప్రవేశ పెట్టిన ధ్యానంలో దేవుడు మాధ్యం లేకుండ మోషేతో మాట్లాడినట్లు మనతో మాట్లాడుతాడు.

### ii) ప్రస్తుతించుట:

ప్రవేశ పెట్టిన ధ్యానంలో మన ఆత్మ పూర్తిగ అతేతర వెలుగులో దేవున్ని ప్రస్తుతిస్తుంది.

### iii) ఆప్యాయత:

ప్రవేశ పెట్టిన ధ్యానంలో ప్రేమ యొక్క కదలిక వస్తువును ఆశ్రయించి పొందాలన్న విధానంకాక, ప్రేమించిన వస్తువుకు (దేవునకు) అంకితమవడం జరుగుతుంది.

ఈ ప్రార్థన స్థితిలోగల ఆత్మకు పునీత అవిలపురి తెరేసా కొన్ని సలహాలను ఇస్తున్నారు.

**a)** ఈ రకమైన ప్రార్థన స్థితిని సొంతంగ పొందడానికి ప్రయత్నించడం తెలివితక్కువ అవుతుంది. అప్పుడే గుడ్డు నుండి వచ్చిన కోడిపిల్ల రెక్కలు రాకుండ ఎగరడానికి ప్రయత్నించినట్లు ఉంటుందని ఆమె చెబుతున్నారు.

**b)** సంతోషం తియ్యదనం యొక్క రుచి సంయమనం సమన్వయంగ ఉంటుంది.

**c)** దేవుని చేతులలో చిన్న బిడ్డలా ఒదిగిపోయే స్థితి. మనసులోగల మిగిలిన విషయాలన్ని విడిపోతాయి. మరల దైవానుగ్రహం కోసం మనసు తహతహ లాడుతుంది. మరల దేవుడు తన సమయం బట్టి తానే వస్తాడు. ఆయన మంచి అనుభవం కోసం మనలను మనం అర్పించుకుంటె చాలు.

**d)** అంతః జీవితానికి పూర్తిగ మిమ్ములను మీరు ఇచ్చుకొండి. తనలోకి అవలోకనం గురించి నొక్కి చెప్పడం ఆధ్యాత్మిక గురువు చేయాలి. పొరుగు వారిని ప్రేమించడం, పరిత్యాగం, అణకువ అవసరమని బోధించడం.

## 5. స్థిమితమైన ప్రార్థన

దేవునితో మన చిత్తం (will) కలవటమే స్థిమితమైన ప్రార్థన. ఈ స్థిమితమైన ప్రార్థనలో మన చిత్తం అవిచ్ఛిన్నంగ ఎవరైతే ఆనందాన్ని ఇవ్వ గలుగుతారో ఆయనతో కలుస్తుంది. అది చాలా సన్నిహితమైన దేవుని ఉనికి గురించిన అవగాహన. అది చిత్తాన్ని సమ్మోహితం చేసి, శరీరాన్ని ఆత్మను వర్ణింప శక్యంకాని మధురంతో వినోదంతో నింపుతుంది. అది ఆత్మకు శాంతిని విశ్రాంతిని ఇస్తుంది, అంతిమ స్థితిని పొందిన గ్రహింపు ఆత్మను గాఢమైన శాంతితో ముంచెత్తుతుంది. ఈ ప్రార్థనలో ఆత్మ చిన్న పిల్లాడిలా తల్లి పాలు తాగుతున్న ఆనందం పొందుతుంది.

పునీత తెరేసా ఇలా అంటారు: "ఆత్మ చంటివానిలా ఇంకను తల్లి పాలను త్రాగుతుంటుంది. మరి తల్లి యొక్క ఆదరణ అటువంటిది. అడగకుండానే బిడ్డకు పాలను ఇస్తుంది తల్లి. బిడ్డ పెదవులు కదిపితే చాలు పాలను ఇస్తుంది. ఈ ప్రార్ధనలో కూడ అదే జరుగుతుంది. ఇచ్ఛ నిరాడంబరంగ ప్రేమిస్తుంది, అర్థం చేసుకోవలసిన అవసరంగాని, ప్రయత్నంగాని ఉండదు. అది ప్రభువు యొక్క ఆహ్లాదం – ఆలోచనకు పనిలేకుండ, ఆత్మ ఆయన సహచరంలో ఉందని గ్రహించాలి. తన హుందాయైన ప్రభువు నోటికి అందించు పాలను త్రాగుతు, దాని మాధుర్యాన్ని ఆనందించాలి. దానిని ప్రభువే ఇస్తున్నారని మనం తెలిసికొనడమే ప్రభువుయొక్క కోరిక. ఆయనే ఆ ఆశ్రిత వరాన్ని ఇస్తున్నాడు. ఆ విషయాన్ని గ్రహించి ఆనందించడమే. కాని ఆత్మ ఏవిధంగ ఆనందిస్తుందన్న విషయాన్ని గ్రహించడం కాదు, అది దేవునియొక్క చిత్తం కాదు. ఆత్మ దానిగురించి తాను మరచిపోవాలి, ఎందుకంటె, ఆయనకు తెలుసు ఆత్మకు ఏది అత్యంత అవసరమోనని.

పునీత తెరేసా స్థిమితమైన ప్రార్ధన గురించి ఈ క్రింది విధంగ తెలియపరుస్తారు: "ఈ ఆలోకనం నుండి కొన్నియెడల మనసులో శాంతిని, నెమ్మదిని ఉబికిస్తుంది. అదే పరిపూర్ణ ఆనందం. ఆ స్థితిలో ఆత్మ ఇక నాకు ఏ కొరతయు లేదని అనుకుంటుంది." ఇది పరలోక స్థితి. ఈ స్థితికి మనం ఎంత ప్రయత్నించిన చేరుకోలేము. ఈ స్థితిలో ఆత్మ శాంతిలోకి ప్రవేశిస్తుంది, అంటె, దేవుడే స్వయంగ ఆ శాంతిని తన ఉనికి ద్వారా ప్రసాదిస్తాడు. బాహ్య ఇంద్రియాలతో ఎటువంటి పనిలేనటువంటి ఆత్మ దేవునికి అతి సమీపంలో ఉన్నానని గ్రహిస్తుంది.

పునీతురాలు ఇంకను అంటారు: "శరీరం అత్యున్నత ఆహ్లాదాన్ని అనుభవిస్తుంది. ఆత్మ లోతైన సంతృప్తిని మెలుకువగానే పొందుతుంది. ఎంత సంతోషమంటె, త్రాగకముందె జలయూట ముందు ఉండి త్రాగినంత సంతృప్తిని పొందుతుంది. కోరుకొనేందుకు ఇక ఏమి మిగిలి ఉండదు. సామర్థ్యాలు స్తభించి, కదులుటకు కూడ ఇష్టపడనిస్థితి, ఎందుకంటె, కదిలితే దేవుని ప్రేమ నుండి ఆటంకం కలగవచ్చు. అలాని, పూర్తిగ వశం తప్పడం ఉండదు. ఎవరి సముఖంలో ఉన్నారో వారికి గ్రహింపు ఉంటుంది. ఈ స్థితిన దైవాదీనంలో ఉండేది మన చిత్తం. మనసు ఒకే

ఒక విషయం మీద నిలిచి ఉండడానికి ప్రయత్నిస్తుంది. జ్ఞాపకశక్తి పనిచేయడానికి కోరుకోదు. వారిరువురు ఈ ఒక్క విషయమే కావాలని చూస్తారు, మరేదైనా వారిని స్థిమితం లేకుండ చేస్తుంది. ఈ స్థితిలో మనిషి తన శరీరం కదలనిదిగ ఉండాలని భావిస్తారు. కదిలితే తమ శాంతి పాడవుతుంది. మాట్లాడడం కూడ చిరాకుగ ఉంటుంది. ఓ గంట వరకైన పరలోక ప్రార్థనను మరల మరలా చెబుతుంటారు. ఈ ప్రపంచంలోనే వారు లేనట్లుగ భావిస్తారు. దేవున్ని తప్ప ఏదీ చూడాలని, వినాలని కోరిక ఉండదు. మరేది వారికి బాధను కలిగించదు. అలా ఏదైన చేయగలదని కూడ అనిపించదు. ఈ స్థితిలో ఉన్నంత కాలం వారు ఉక్కిరిబిక్కిరి అయి, సంతోషం ఆహ్లాదంలోనికి ఐక్యమవుతారు. ఈ స్థితిలో వారు మరేది ఆలోచించరు, కోరుకోరు, కాని పునీత పేతురు పోలి అంటారు: "ప్రభువా! ఇక్కడ మూడు పర్ణశాలలను నిర్మించుదము."

ఈ ప్రార్థనా స్థితికి చేరిన వారు జాగ్రత్తగ, తప్పనిసరిగ ఈ దిగువ నియమాలను అనుసరించాలి.

a) ఈ ప్రార్థనా స్థితిలోకి ఎవరును తమంతట తాము బలవంతాన ప్రవేశించడానికి ప్రయత్నించకూడదు. ఎందుకంటె, ఇది ఉదాసీనమైన (Passive) ప్రార్థన కనుక, ఒకరి సొంత ప్రయత్నాలతో పొందేది కాదిది.

b) దేవుని మనసును కష్టపెట్టే ఏ రకమైన సందర్భానికైనా సరే మనం దూరంగ ఉండాలి.

c) కష్టమైనా, ఆటంకాలు ఉన్నా ప్రార్థన చేయడం మాత్రం వదలకూడదు.

d) తీవ్రమైన సహనాన్ని పాటించాలి. ఈ ప్రార్థనలో చిత్తం మాత్రమె దేవునితో ఐక్యమై ఉంటుంది. బుద్ధి, సృజనాత్మకత, ఇతర సామర్థ్యాలను నిగూఢ దైవవరం తాకదు.

e) బుద్ధి, సృజనాత్మకత, సామర్థ్యాలు ఈ స్థిమితమైన ప్రార్థనలో సులువుగ శోధనకు గురిచేస్తాయి. దేవునియందు ఐక్యమై ఉన్నపుడు శోధనలు సామరస్యం పడవచ్చు.

ఓ గంట కాలం మనం ఒక ఉపన్యాసం ఆలకించేటపుడు, మనం ఆ ఉపన్యాసకుని ఉనికిలో ఉంటాం, ఆతని ఆలోచనలకు, అతడు వ్యక్తపరచు సత్యాలకు ఆనందిస్తాం. ఆ గంటలో చాలా సార్లు మనం చాలా విషయాలనుబట్టి శోధనలకు గురవుతాం, అయినా మనం ఆయన సన్నిధిలో ఉంటాం, ఆయన ఆ సమయమంత మనకు తెలియపరుస్తునే ఉంటాడు. పునీత తెరేసా సలహా ఏమన: ఆత్మ ఈ శోధనలకు సావధానం చూపకూడదు, కాని దేవుడు ఆ సామర్థ్యాలన్నిటిని కట్టగట్టి, తన ఆధీనంలోకి తీసుకొనేంత వరకు మనం వాటిని విస్మరించాలి.

f) క్రైస్తవ పుణ్య క్రియలను తీవ్రంగ అమలుచేయుము. ప్రార్థనలో ఎదుగుదల, పునీత తెరేసా ప్రకారం, పుణ్యక్రియలను అలవరచుకొనుట రెండును విడదీయలేనట్లు కలిసుంటాయి. ఆమె పుణ్యక్రియలను పుష్పాలతో పోల్చుతారు. స్థిమితమైన ప్రార్థనలో ఆత్మయొక్క పుణ్యక్రియలు "పూలుగ విడిపోయే మొగ్గలుగ సిద్ధమై ఉన్నాయి" అని ఆమె అంటారు.

**స్థిమితమైన ప్రార్థన వలన కలుగు పునీతం చేయు ఫలాలు:**

- ఆత్మకు మహా స్వాతంత్ర్యం ఉంటుంది.
- బిడ్డకుండే దైవభయం ఉంటుంది, ఆయన మనసును కష్టపెట్టకుండ ఉండడానికి చాలా జాగ్రత్త పడుతుంది.
- మనిషికి దేవుని మీద గాఢమైన నమ్మకం కుదురుతుంది.
- మనిషి త్యాగక్రియలను, శ్రమలను ప్రేమిస్తాడు.
- మనిషిలో లోతైన అణకువ కనిపిస్తుంది.
- మనిషి ప్రాపంచిక సుఖాలయెడ అయిష్టతను కనబరచి, పుణ్యక్రియల యందు ఎదుగుతాడు.
- ఏకాగ్రతతో ఆలోకించుట క్రియారూపం దాల్చుతుంది.

ముగింపుగ, స్థిమితమైన ప్రార్థన బుద్ధినిగాక, చిత్తాన్ని మార్పుకు గురిచేస్తుంది. ఈ ప్రార్థనలో, కారణాల వాదింపు అసలే ఉండదు, ఒక విషయం నుండి మరో విషయానికి మారడం ఉండదు. విశేషంగ, ఇది నిగూఢమైన ఏకాగ్రతగల ఆలోకనం. దీనిలో ఆత్మ కేవలం ప్రేమించడమే తప్ప మరేమి

చేయాలని కోరదు. శ్రమలు పడాలన్న కోరికను అనుభవిస్తుంది, గొప్ప సంతోషాన్ని అనుభవించాలని కోరుకుంటుంది. స్థిమితమైన ప్రార్థన ఏకాగ్రతతో ఆలోకనా నిశబ్దంవైపు మొగ్గి ఉంటుంది, ప్రశాంతతను పొందుతుంది.

## 6. సామాన్య సమైక్యతా ప్రార్థన

సామాన్య సమైక్యతా ప్రార్థనలో బుద్ధి, చిత్తం, అంతరేంద్రియాలు దేవునితో ఐక్యమౌతాయి. ఇది దేవునితో ఆత్మ యొక్క అత్యంత సన్నిహితమైన ఐక్యత అని చెప్పవచ్చు. అంతరంలో నివసించే దైవసత్యం ద్వారా ఏ అనుమానం లేని, నిజమైన సంబంధం ఉత్పన్నమౌతుంది. లోని శక్తులు పూర్తిగ నిలిచిపోతాయి. ఇది వర్ణింప శక్యంకాని నిశ్చలమైన సత్య సంపూర్ణ కలయిక.

సామాన్య సమైక్యతా ప్రార్థనను గుర్తించుటకును, ఇతర ప్రార్థనా అంతస్తులనుండి దీనిని వేరుగ గుర్తించుటకును ఈ దుగువ చిహ్నాలు ఉన్నవి:

**i) ప్రార్థనలో శోధనలు లేకుండుట:** శోధనలకు జ్ఞాపకాలు, సృజనాత్మకత కారణాలు. ఇవి దేవునియందు లగ్నమై బంధీగ ఉండడం వలన మనస్శాస్త్రం ప్రకారం శోధనలు అసాధ్యం.

**ii)ఆ దేవునియందు ఐక్యతా సాన్నిధ్యంలో ఉండే నిశ్చలత:** ఈ సామాన్య సమైక్యతా ప్రార్థనలో దేవుని అనుభూతిని ఏమాత్రం ఆత్మ అనుమానం పొందదు. దిగువ అంతస్తులకు చెందిన ప్రార్థనలను విడిచిపెట్టినపుడు ఆత్మ కొన్ని అనుమానాలకు గురికావచ్చు లేక దేవునితో నిజంగ ఐక్యత చెందలేదని వినవచ్చు, కాని సామాన్య సమైక్యతా ప్రార్థనలో దేవునియందు ఐక్యతా నిశ్చలత చాలా కచ్చితమైనది. ఎందుకంటె, ఆత్మ ఈ నిశ్చలతను అనుభవించకుంటె, ఈ నిజమైన సమైక్యతా ప్రార్థన ఉండదని పునీత తెరేసా చెబుతున్నారు.

**iii )అలసట, విసుగులు లేని స్థితి:** దేవునియందు నిమగ్నమైన ఆత్మ దేవునితో ఐక్యత చెంది ఉండడంలో ఎప్పుడు విసుగెత్తి పోదు. ఆత్మ వర్ణింప శక్యంగాని ఆహ్లాదంలో ఉంటుంది. ఏదియేమైన, ఈ సామాన్య సమైక్యతా ప్రార్థన ఎంత కాలం ఉండిన, ఆత్మ తీవ్రమైన అలసటను ఏమాత్రం అనుభవించదు. ఈ కారణం

చేతనే, పునీత తెరేసా అంటారు: ఎంత సేపైనా సరే, ఈ ప్రార్థన అంతస్తు ఆత్మకు ఏ హాని చేయలేదు. పునీతురాలు వ్రాస్తారు: "ఈ ప్రార్థన స్థితిలో ...మనోభావం ఉండదు, కాని సంతోషం మాత్రం ఉంటుంది, ఆ సంతోషంలో ఉన్నట్లు ఆత్మకి ఏమాత్రం అర్థం కాదు. ఆత్మ దేవునికి దగ్గరగనున్న ఆస్వాదన, దానిలో కట్టుబడియున్న నిస్సందేహంగ విశ్వసించుట తప్ప వేరే ఏమీ ఉండదు."

మొదట్లో సామర్థ్యాలు ఆదీనంలో ఉన్నపుడు, దేవునితో అత్యున్నతమైన ఐక్యత తక్కువ కాలమే ఉంటుంది, అది అర్ధగంటే కావచ్చు, తీవ్రత అధికమైనపుడు, అనేక గంటలు కొనసాగవచ్చు. పునీతురాలు నొక్కివక్కాణించే దేమంటె: ఈ ప్రార్థనలో ఆత్మ తన దైవానుభూతిని నమ్మదగినదిగ రుజువు పరచుకోవాలి. ఎలా? పుణ్యక్రియల అభ్యాసం ద్వారా, ముఖ్యంగ సహోదర ప్రేమద్వారా నిరూపించుకోవాలి. ఆమె చెబుతారు – స్వప్రేమ, సార్థపరత్వం, ఇరుగుపొరుగు వారిపై ఘాటైన విమర్శలు, వారిపై అసహనంగ ఉండుట, తనను ప్రేమించుకొనునట్లు వారిని ప్రేమించ లేకపోవుట వంటి వాటిని ధ్వంశం చేయ ఆత్మ గట్టి ప్రయత్నం చేయాలి. ఆమె వ్రాస్తున్నారు: "ప్రభువు మనలను రెండు విషయాలను మాత్రమే అడుగుతున్నారు: వైభవోపేతుడైన ఆయనను ప్రేమించుట, మన పొరుగువారిని ప్రేమించుట... ఈ రెండు ఆజ్ఞలను పాటించుట ద్వారా మనం నిస్సంశయమైన గుర్తులను చూపగలం. మనం మన పొరుగువారిని నిజంగ ప్రేమిస్తుండాలి ...దేవుని ప్రేమయందు మనకు వేళ్ళూనకపోతే, మనం పొరుగువారిని ప్రేమించగలమన్న నమ్మకం నాకు కుదరదు."

**సంభవాలు (Effects):**

పునీత తెరేసాగారు ఈ ప్రార్థనయొక్క ముఖ్య సంభవాల జాబితాను ఇస్తున్నారు: ఆత్మలో దైవ నివాసం యొక్క అవగాహన, ఆత్మలో మహా మృదుత్వం, నాయక చర్యలను చేపట్టుట, లోతైన అణకువ, పొరుగువారి యెడల సహాయక చర్యలు, మహా త్యజింపు, ఒక్క మాటలో అవిశ్వాసం చూపినట్లయితే వెంటనే దానినుండి విముక్తి, ఆధ్యాత్మిక పరిపక్వత, సృష్టింపబడిన ఏ వస్తువునందు కూడ నిజమైన విశ్రాంతి లేకుండుట. ఇది సకల ఆత్మలు దేవున్ని తెలిసి ఉండాలని ఆశిస్తుంది, దేవుని మనసును బాధపెట్టు దానిని చూచునపుడు మిగుల దుఃఖపడుట వంటివి సంభవిస్తాయి.

**రూపకాలంకార సంబంధ ప్రక్రియ:**

సామాన్య సమైక్యతా ప్రార్థన యొక్క స్వభావాన్ని విశదపరచడానికి పునీత తెరేసాగారు వాడిన రెండు రూపకాలంకార ప్రక్రియలు ఆమెను అమరురాలుగ చేసాయి. ఆ రూపకాలేవన – ఒకటి, వివాహ ప్రతిపాదన రెండు, పట్టుపురుగు.

**a) వివాహ ప్రతిపాదన (Proposal of a Marriage):** పునీతురాలు వ్రాస్తు, "నాకు అనిపిస్తున్నది ఏమిటంటె, ఈ కలయిక (సమైక్యత) ఇహలోక జీవితంలో ఇద్దరు వ్యక్తులు (స్త్రీపురుషులు) తమ నిశ్చితార్థానికి ముందు సంభవించేది. అవునా కాదా అనే చర్చ ఉంటుంది. ఒకరికొకరు కుదిరిన వారు, ఇద్దరు ప్రేమలో పడిన వారు వారు కలుసుకొను నపుడు ఒకరిని ఒకరు మరింత పొగడుకొనుటను నేర్చుకుంటారు. అలానే ఈ ప్రార్థనలో కూడ. ఈ రకమైన కలయికను కొద్ది సమయపు కలయికగ మనం పోల్చవచ్చు. ఎందుకంటె, అది చాలా తక్కువ సమయంలో ముగుస్తుంది."

**b) పట్టుపురుగు యొక్క తులనాత్మకత (Similitude of the Silkworm):** సామాన్య సమైక్యతా ప్రార్థన గురించి ఇచ్చిన పునీత తెరేసాగారి వర్ణన ఈ పట్టుపురుగు యొక్క చిత్రం ద్వారా ప్రసిద్ధి చెందింది. "వేడి వాతావరణం వచ్చినపుడు మల్బరీ చెట్లు చిగురిస్తాయి, దాంతో ఈ బీజం జీవాన్ని పుంజుకుంటుంది. దాని జీవనాధారం దొరకగానే దానిపై ఆధారపడుతుంది, లేకుంటె అది చచ్చిన దానితో సమానం. పట్టుపురుగులు పూర్తిగ పెరిగేవరకు ఈ మల్బరీ ఆకులను తింటాయి. చిన్న రెమ్మలను తీసివేసినపుడు, పురుగులు తమ చిన్న మూతులతో పట్టును అల్లడం మొదలు పెడతాయి. తమ చుట్టు బిగువైన పట్టు కవచం (cocoon) ను అల్లుకొని, దానిలో తమనుతాము పూడ్చుకుంటాయి. అపుడు, చివరిగ, అంతకు ముందు పెద్దగ, అసహ్యంగ ఉన్న పురుగు పట్టు కవచం నుండి అందమైన తెల్లని వర్ణంగల పులుగు బైటకు వస్తుంది."

అవును, పట్టుపురుగు ఏకాగ్రతతో ఆలోకించు ఆత్మ, మల్బరీ ఆకులను తింటు (తన చర్చిలో . . . దేవుడు మనందరకు ఇచ్చే సామాన్య సహాయం), పూర్తిగ ఎదిగే వరకు ఇచ్చి, అపుడు ఇల్లును కడుతుంది – అందులో చనిపోడానికి,

దాని రహస్య జీవితం క్రీస్తుతో దేవునియందు ఉంటుంది. ఆ పట్టుకవచమే క్రీస్తు. ఆమె అంటారు: “ఇకనుండి, నా కుమార్తెలారా!, ఈ పరిశ్రమను మొదలిడి, ఈ పట్టుకవచంను వదుకుదాం. స్వప్రేమను, స్వబుద్ధిని, ఈలోక వస్తువుల మీద మోజును విడనాడుదాం. ప్రాయశ్చిత్తం, ప్రార్థన, త్యాగక్రియలు, విధేయత, మనకు తెలిసిన మంచి పనులన్నింటిని చేయ ప్రయాసపడదాం. పట్టుపురుగు చావని ... చనిపోనిద్దాం, ఏ పనికోసం సృష్టింపబడిందో ఆ పని పూర్తికాగానే నిజానికి అది చనిపోతుంది. అపుడు మనం దేవున్ని దర్శిస్తాం. ఆయన మహోత్మ్యంలో పూర్తిగ రహస్యంలో పట్టుపురుగు ఉన్నట్లే ఉంటాం.”

## అవ్యక్తానంద సమైక్యతా ప్రార్థన లేక ఆధ్యాత్మిక నిశ్చితార్థం

ఆధ్యాత్మిక నిశ్చితార్థం అన్నది బుద్ధి, చిత్తం, అంతర్గత ఇంద్రియాలు, బహిర్గత ఇంద్రియాలు క్షణికమైన విధానంలో దేవునితో ఐక్యం పొందుతాయి. ఇది నిగూఢమైన ఏకాగ్రతతో ఆలోకించు స్థితి. ఇందులో శ్రమల వలన శుద్ధీకరణను సున్నితమైన నిగూఢ గోచరంగ ఉంటుంది. ఇది ఆధ్యాత్మిక వివాహానికి వెంటనే తయారుకాడానికున్న ప్రయాసలకు వ్యక్తీకరణం. అత్యున్నతమైన నిగూఢ ఏకాగ్రత ఆలోకన కాగల స్థితి, నిగూఢ గోచరం, దర్శనాలు, మాట్లాడు శైలిలు, అవ్యక్తానందం, లేవనెత్తబడుట, పంచ గాయాల గుర్తులు మున్నగునవి . . . చోటు చేసుకుంటాయి.

**i) పరీక్షించు విధానాలు (Trails):** ఆత్మ దేవుని స్వకానుకను ఇంకను తగినంత విధంగ ఆశించలేదు. దానికి అనవసరమైన అధిక ఆత్మవిశ్వాసం, స్వశక్తి మీద ఎక్కువగ ఆధారపడుతుంది. ఆత్మ తన జీవితంలో మంచి ప్రభావం చూపలేని సృష్టింపబడిన వస్తువుల యొక్క వ్యర్థతను, అప్రయోజనం, లేమితనం, అల్పత్వంను తప్పనిసరిగ గుర్తించాలి. అది ఇంకను మానవ పరిగణత గురించి ఆలోచిస్తుంది, విమర్శలకు సునుగుడులకు భయపడుతుంది. పర్యవసానంగ, తన శ్రద్ధలన్ని దేవునికి పనికిరాని విధంగ తయారవుతున్నాయి, ఆతనిని తగిన విధంగ అభినందించ లేకున్నవి. కనుక, దైవ భాగస్వామి ఆత్మయొక్క శుద్ధీకరణను హక్కుగ అడుగుతున్నాడు.

మరోప్రక్క శుద్ధీకరణలు పుణ్యక్రియలు చేయ ప్రోద్భలం నిచ్చేవి. ఈ ఆత్మ యొక్క చీకటి రాత్రి, అణకువ, సహనం వ్యక్తపరచుట, ఓర్పు, ధైర్యం,

స్థిరంగ ఉండుట, నమ్మకం వంటి పుణ్యక్రియలను, దైవీక పుణ్యక్రియలను అమలుచేయాలని హక్కుగ అడుగుతుంది. ఇవి అధికమవుతాయి. దీనికి తగిన రుజువు ఆత్మలో ఉంటుంది.

**ii) నిగూఢమైన గోచరము (Mystical Phenomena):** ఈ పుణ్యక్రియలను ఆచరించుటలోగల శ్రమను తగ్గించుటకు, ఉదాసీనమైన శుద్ధీకరణ విషయంలో, ఆత్మకు సాయం అందిచుట కొరకు దేవుడు ఈ నిగూఢమైన గోచరమును పంపుతాడు. పాపప్రక్షాళనలో కలుగు నొప్పులను దైవ సహాయం వెంబడిస్తుంది, చీకటి వెంబడి వెలుగు అనుసరిస్తుంది, తీవ్రమైన దుఃఖం వెనుక అవ్యక్తానందం వస్తుంది, పోట్లాటను విశ్రాంతమైన శాంతి వెన్నంటి ఉంటుంది. ప్రియుడైన ప్రభువు నిగూఢ వరాలను అనురాగ చిహ్నాలుగ ఆత్మకు దయచేస్తాడు. ఈ వరాలు కడన ఆధ్యాత్మిక వివాహానికి చాలా తగినట్లుగ స్థానంలో ఉంచుతుంది.

దేవునితో ఈ కలయిక రెండు అంశాలను వ్యవస్థీకరిస్తుంది (constitute): ఆత్మ దేవునితో ఐక్యమైపోవుట, జ్ఞానేంద్రియాల యొక్క పనులు స్తంభించిపోవుట. నిగూఢ సమైక్యత యొక్క తీవ్రత ఎంత ఉంటుందంటె, శరీరం దానిని తట్టుకోలేదు, పైగ అవ్యక్తానందం కలుగుతుంది. ఈ అవ్యక్తానందం అన్న పదం కేవలం బాహ్య ఇంద్రియాల యొక్క కలాపాలను స్తంభింపజేయుటను సూచిస్తుంది. ఈ అవ్యక్తానందం యొక్క ముఖ్య ప్రభావం ఏమంటె, పరిశుద్ధ జీవితం, నాయికా లక్షణంతో ప్రకాశిస్తుంది.

## 7. రూపాంతర సమ్మేళన ప్రార్థన లేక ఆధ్యాత్మిక వివాహం:

చివరి స్థాయి ప్రార్థన రూపాంతర సమ్మేళన ప్రార్థన. ఇది ఆధ్యాత్మిక వివాహంలో రెండు వ్యక్తిత్వాలు ఒకటిగ కరిగిపోతాయి, వాడుకైన అవగాహన ఉంటుంది లేద వ్యక్తిగత పనుల్లో నిమగ్నమై ఉన్నా సరే దైవ ఉనికి గూర్చి మతి ఉంటుంది. మన బీద మానవ వ్యక్తిత్వంను యేసు అధిగమిస్తాడు. అందుకే దీనికి, ఆధ్యాత్మిక వివాహమని పేరు, లేక రూపాంతర సమ్మేళనం, ఎందుకంటె, అది చిత్తం కలియక మీద ఆధారపడి ఉంది.

ఆత్మ “అవును” అని పలికి, క్రీస్తు బుద్ధిని తన సొంతం చేసుకుంటుంది. తననుతాను దేవునికి అప్పగించుకుంటుంది, ఇంకను పని కొనసాగుతున్నా పూర్తి వ్యవహారం రూపాంతరం చెందుతుంది. కాబట్టి, క్రీస్తు ఆత్మలో నివసిస్తాడు. మన బుద్ధికి ఆయన ఆలోచనలను ఇస్తాడు, హృదయానికి మానసిక భావన, చిత్తానికి కోరికలను ఇస్తాడు. ఆయన మన శరీరాన్ని పవిత్రపరచి, శ్రమలకు ఆత్మ దాహమగునట్లు చేస్తాడు, కల్వరిని అధిరోహించ ఆశను కలిగిస్తాడు, శ్రీసభ గురించి పాపాత్ముల గూర్చి ఇతరమైన వాటి గురించి ప్రార్థన చేయడం ఆత్మకు సహజంగ ఉంటుంది. ఈ రూపాంతర సమ్మేళనంలో ఒకే ఒక వ్యక్తి మాట్లాడుటకు మిగులుతాడు, అది ఆ జీవించు యేసు. ఈ విధంగ పౌలుని మాటలు గ్రహించడమైంది: “ఇక జీవించునది నేను కాదు. క్రీస్తే నాయందు జీవించుచున్నాడు.” (గలతీ. 2: 20)

పునీత సిలువ యోహాను ఈ రూపాంతర సమ్మేళన ప్రార్థనను లేక నిగూఢ వివాహాన్ని “ప్రియునిలో ఆత్మ పూర్తిగ రూపాంతరం చెందుతుంది, ఇందులో దేవుడు జీవాత్మ కూడ ఒకరికొకరు సంపూర్ణంగ ఇచ్చుకుంటారు, కొంతవరకు దైవప్రేమ యొక్క పునస్సంధానంతో – ఒక రకంగ చెప్పాలంటె –ఆత్మ దైవత్వంగ తయారవుతుంది, ఈ జీవిత కాలంలోనే వీలు అయినంత మేరకు దేవునితో పాలుపంచుకొంటుంది.”

ఆత్మ అలవాటుగను, ఎడతెగని మెలుకువగ దేవుని ఉనికిలో, ఆయన స్వభావంలో, త్రీత్త్వపు వ్యక్తులలో నెలకొని ఉంటుంది. పునీత తెరేసా వ్రాస్తారు: “మన మంచి దేవుడు ఇపుడు ఆత్మ యొక్క కండ్లనుండి పొరలను తీసివేయ కోరుకుంటాడు, ఎందుకంటె, అపుడు ఆత్మ ఆయన దానికి అనుగ్రహిస్తున్న ఆశ్రితవరంను చూచి అర్థం చేసుకొంటుంది. ఆత్మ నిజముగ ఈ ముగ్గురు వ్యక్తులు ఒకే యథార్థమని, ఒకే శక్తియని, ఒకే జ్ఞానమని, ఒకే ఒక దేవుడని తప్పనిసరిగ ఎంతో గ్రహిస్తుంది. మనం విశ్వాసం ద్వారా నిలబెట్టుకున్న దానిని ఆత్మ చూపుద్వారా గ్రహించవచ్చు, సాధరణ కళ్ళతో చూడనప్పటికి, ఆత్మ వలనగాని, శరీరం వలనగాని అనుకున్నది కాదు, ఎందుకంటె, ఆ దర్శనం ఊహించినది కాదు. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు కూడ ఆత్మకు తమంతట తాము వ్యక్తపరచుకొని,

ఆత్మతో మాట్లాడుతారు, ప్రభువుకు ఆపాదించు సుభవార్త మాటల ద్వారా వివరిస్తారు. వివరంగనయితే, ఆయనను ప్రేమించి, ఆయన ఆజ్ఞలను పాటించే ఆత్మలో క్రీస్తు, ఆతని తండ్రి, పవిత్రాత్మ వచ్చి వాసం చేస్తారు.”

**నిగూఢ వివాహంలో ఈ దిగువ అంశాలు కనిపిస్తాయి:**

i) ఇది ప్రియునిలో ఆత్మ పూర్వ స్థాయి ప్రార్థనలో కోరుకున్న ఉత్సాహపూరితమైన పూర్తి రూపాంతరం అత్యున్నతమైన ఎత్తులు అధిరోహించిన తరువాత పొందింది. ఆత్మ నిర్ధారణమైన దైవ విలక్షణాలను పొందుతుందని పునీత సిలువ యోహాను అంటారు: “దేవునిలో పాలుపంచుకొని, ఆత్మ దేవుడయింది.”

**ii) పరస్పరం అప్పగించుకొనుట ఉంటుంది:** ఇద్దరు భాగస్వామినుల మధ్య స్వశ్ఛమైన సంగతులు వ్యక్తీకరణ ఎలా ఉంటుందో అలా ఆధ్యాత్మిక వివాహంలోకి ప్రవేశించిన దేవునికి ఆత్మకు మధ్య ఉంటుంది. ఈ పరస్పర, అభేద్యమైన అప్పగించుకొను వ్యవస్థీకరణ ఆధ్యాత్మిక వివాహం యొక్క సారాన్ని కలిగుంటుంది.

**iii) శాశ్విత ప్రేమ కలయిక ఉంటుంది:** ఇది నిగూఢ వివాహం యొక్క మూడవ ముఖ్యమైన గమనిక. ఇతర స్థాయిలనుండి నిర్దిష్టంగను వేరుగను ఉంటుంది. పునీత తెరేసా వ్రాస్తారు: “ఆత్మ యొక్క ఆశ్చర్యం ప్రతిదినం పెరుగుతూనే ఉంటుంది, ఎందుకంటె ముగ్గురు దైవ వ్యక్తులు ఇక ఎప్పటికి ఆత్మను విడనాడరని అనిపిస్తుంది.”

**ఆశ్చర్యకరమైన సంభవాలు:**

పునీత అవిలాపురి తెరేసా కూడ రూపాంతర సమ్మేళన లేక నిగూఢ వివాహం వలన ఆత్మలో ఉత్పత్తిచేయు ఆశ్చర్యకరమైన సంభవాలను స్పష్టంగ వర్ణిస్తున్నారు. ఈ దిగువ సంగ్రహంగ నిచ్చిన ముఖ్య అంశాలు ఆమె వ్రాసిన “కోట యొక్క అంతర్భాగం” అనే పుస్తకం నుండి.

**a) ఆత్మాభిమానం పూర్తిగ జ్ఞాపకం నుండి తొలగిపోవుట:** ఆత్మ తన గురించి ఉన్న పరిగణపై ఆశ అస్సలు ఉండదు, కాని దేవుని మహా మహిమ కొరకు పని చేయాలన్న ప్రాముఖ్యతను గురించి ఆలోచిస్తుంది.

**b) దేవుని మహిమతో సంపూర్ణ ఆధీనంలో ఉండుట:** ఇది ఆత్మ తన గురించి పూర్తిగ మరచిపోయిన దానినుండి ఉద్భవిస్తుంది. పలానగ అవాలన్న కోరిక ఉండదు. దేవుని మహిమ కొరకు పనిచేసినపుడు మాత్రమే కోరిక ఉంటుంది. అందుచేత, మనస్ఫూర్తిగ తన జీవాన్నే బలిచేయుటకు సిద్ధపడుతుంది. ఆ విధమైన ఉత్సాహపూరిత ప్రేమ, స్వచ్ఛమైన పవిత్రమైన ఉద్దేశం చిన్న పనిమీద కూడ చాలావరకు విలువను ఇస్తుంది.

**c) శ్రమలు అనుభవింప గొప్ప కోరిక:** ఈ అత్యున్నతమైన స్థాయిలో ఆత్మ ఇదివరకటిలా ఈ కోరిక వలన ఇకనుండి అంతరాయం కలిగించదు. దీనిలో దేవుని చిత్తం నెరవేర్చ తీవ్ర వాంఛ ఉంటుంది. కనుక, దేవుడు శ్రమలను పంపించినపుడు ఆత్మ సంతోషిస్తుంది. ఒకవేళ సంతోషించక పోయిన, మనసు కలవర పడదు.

**d) వేదహింసలలో గొప్ప అహ్లాదం, వెనకున్న స్థాయిలకన్న ఇపుడు గాఢమైన అంతర్శాంతి:** ఆత్మ చెడు చిత్తంను కలిగి ఉండదు, తనను తప్పుగ ప్రవర్తించు వారిపై కనీసం చిన్న అయిష్టం కూడ ఉండదు, కాని వారి యెడల ప్రత్యేక ప్రేమను కూడ పోషిస్తుంది, పైగ వారు ఆపదలో ఉన్నపుడు ఎక్కువగ బాధపడి, ఏ రకమైన సాయాన్నయిన ఇవ్వడానికి సిద్ధపడుతుంది.

**e) ఆత్మల రక్షణ కోసం ఉత్సాహపూరితమైన భక్త్యభిమానం:** ఇంతకు ముందైతే, దేవునితో ఉండిపోవాలని, అందుకు మరణించాలన్న కోరికతో ఆత్మ తీవ్రబాధను అనుభవించేది. ఇపుడు ఆయనకు సేవ చేయాలని దృఢ ప్రేమతో కాంక్షిస్తుంది, ప్రతి ఒక్కరు ఆయనను మహిమపరచుటను చూచి ఆనందిస్తుంది, ఒక్క ఆత్మ బాగుకోసమైనా కృషి చేయాలని తాపత్రయం కలిగుంటుంది, అందుకోసం చాలా సంవత్సరాలు బ్రతికుండాలని కోరుకుంటుంది, ప్రభువు కొద్ది కాలమైన స్తుతింపబడాలని కఠిన శ్రమలను అనుభవిస్తుంది.

**f) సృష్టింపబడిన సకల వస్తువుల నుండి స్పష్టమైన పరిత్యాగం, దానికి ఏది లాభదాయకమో దానితో నిండియుండుటకు ఆక్రమించిన కోరికను కలిగుండుట:**

పునీత పౌలునితోబాటు, ఆత్మ ఈ లోక వస్తువులను చెత్తగ పరిగణిస్తుంది (ఫిలిప్పీ 3:8).

దేవునిలో ఒంటిగ ఉండిపోవాలని, ఆయనతో మృధువైన సన్నిహితమైన సంభాషణ చేయాలని, లేదా మరొకరి మంచి కొరకు పనిచేయాలని అభిలషిస్తుంది. ఇక నిష్ఫలమైన సమయాలు, ఆంతర్యంలో వేదనలు ఉండవు. ఆత్మ శాశ్వితమైన, అంతరాయం లేని శాంతి ఆనందదాయకంగ ఉంటుంది. ఈ స్థితిలో, పునీత తెరేసాగారి విశ్వాసం ప్రకారం, సాతాను శోధింప ఏలాంటి ప్రయత్నం చేయలేదు, ప్రభువు అందుకు శెలవివ్వడు. "ఒంటిగ, దేవునితో ఒంటిగ" అన్నటువంటి లక్ష్యవాక్యంను పూర్తి గ్రహింపు చోటుచేసుకుంటుంది. ఈ స్థితిని పునీతురాలు తన కుమార్తెల గురించి ఆశించింది.

**g) అవ్యక్తానందం ఆనంద పారవశ్యం లేకుండుట:** ఆత్మ యొక్క శాంతి, అంతర్సమాదానం ఎంత లోతైనదంటె, అతిశక్తివంతమైన నిగూఢ గోచరం వలన అంతరాయం కలుగదు, ఎందుకంటె, దేవుడు ఇచ్చిన శక్తిని పొంది ఉండడం వలనను, ఇప్పటికే దైవీకంగ వ్యక్తపరచుటలో అలవాటు పడినందున అంతరాయం ఉండదు. అయినా, అది జాగ్రత్తగ ముందుకు సాగుతుంది, దేవుడు ఆశ్రితవరం ఇచ్చిన కొలది, అంతగ ఆత్మ తన దీనత్వంను గుర్తిస్తుంది.

**h) మార్త మేరీల మధ్య సామరస్యం:** "ప్రార్థన యొక్క లక్ష్యం అదే, ఆధ్యాత్మిక వివాహం యొక్క ఉద్దేశం అదే, దీనివలన మంచి పనులు - మంచి పనులు మాత్రమే పుట్టుకొస్తాయి. ఇటువంటి పనులు, ప్రతి స్వశ్చమైన ఆశ్రితవరానికి, దేవుని నుండి వచ్చు ప్రతిదానికి గుర్తులు."

ఈ ఉన్నత శిఖరానికి చేరడానికి ప్రతివక్కరికి అంతర్శక్తి మనందరికి ఉంది. ఈ అమోఘమైన ఉత్తమం, దైవానుగ్రహ స్థితిలో ఉన్న అన్ని ఆత్మలకు సిద్ధంగ ఉంది. "పరలోక మందున్న మీ తండ్రి పరిపూర్ణుడైనట్లే పరిపూర్ణులు అగుదురుగాక!" (మత్తయి 5: 48). ఏమాత్రం మినహాయింపు లేకుండ ఈ మాటలను యేసు అందరికి చెబుతున్నాడు. అపొస్తులుల గురించి యేసు ప్రార్థిస్తు, "వారందరు

ఒకరుగ ఐక్యమై ఉండునట్లు ప్రార్థించుచున్నాను. ఓ తండ్రీ! నేను నీ యందు, నీవు నాయందు ఉండునట్లు వారిని మనయందు ఉండనిమ్ము" (యోహాను 17: 21).

ఆధ్యాత్మిక వివాహం గురించి పునీత తెరేసా అంటారు: "అది నదిలోకి లేక సెలయూటలోకి ఆకాశం నుండి పడుతున్న వర్షం లాంటిది: అందులో నీళ్లు తప్ప మరేమి లేదు, నదిలోగల నీళ్లను ఆకాశం నుండి పడుతున్న నీళ్లను విడదీసి, వేరుచేయడం అసాధ్యం. లేదా అది చిన్న సెలయేరు సముద్రంలో కలవడం లాంటిది. కలిసిన తరువాత వాటిని విడదీయడానికి పద్ధతి ఏమి లేదు, లేదా ఒక గదిలో రెండు పెద్ద కిటికీలు ద్వారా వెలుతురు లోపలకు ప్రవేశించిందనుకుందాం. అది వివిధ ప్రదేశాల నుండి ప్రవేశించినా వెలుతురు ఒకటై పోతుంది." పునీత అవిలాపురి తెరేసా మినహాయింపు లేకుండ అన్ని ఆత్మలను ఈ ఉన్నతములకు ఆహ్వానిస్తుంది. దీనికి అవ్యక్తానందంగాని అద్భుతాలుగాని అవసరం ఉండదు. దీనిని చేరడం సామాన్యం.

❋ ❋ ❋ ❋

# 5. మార్మికానుభవం

– ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్



భౌతికవాదం, వినియోగమయవాదం నేటి ప్రపంచంలో చాలా ఉంది. సంపదలు, భౌతికవాదం వలన మనిషి యొక్క జీవాత్మ నీరుకారి పోతుంది. అదే సమయంలో మనిషి యొక్క జీవాత్మ దేవుని కొరకు తీవ్రంగ వాంఛిస్తుంది. దేవుని గూర్చి గాఢమైన కోరిక ఉంటుంది. అది నిగూఢమైన సమైక్యత కొరకు తీవ్రంగ వాంఛిస్తుంది. చాలామంది ఋషులను కలవడానికి ఆశ్రమాలకు వెళ్తారు. దేవుని దర్శించాలన్న తృష్ణ ఉంది.

## A) నిర్వచనం:

మార్మికానుభవం (Mysticism) అన్నది – అతీత తాత్విక, స్వభావసిద్ధమైన వెనువెంటనే దేవుని దర్శనానుభవం పొందుట. మాటలలో చెప్పలేనిది, వ్యక్తపరచ లేనిది, ఒక బహుమతిగ, ఉదాసీనంగ జీవాత్మనందు స్వీకరించినది. మొత్తం మనిషిని బందీచేసి, అతనిని లేక ఆమెను రూపాంతరం చెందునట్లు చేసి, అతనిని లేక ఆమెను దేవునితో ముందస్తుగ ప్రయత్నం లేకుండ సమైక్యపరచుట.

**సవివరణ:**

**– మార్మికానుభవం అన్నది వెనువెంటనే:** ఇది నేరుగ అనుభవించేది. ఇది ఆలోచన కాదు, కాని అనుభవం. అనుభవం తెలిసివస్తుంది.

**– అతీత తాత్వికమైన దేవుడు:** మనం గ్రహించలేము. ఆయన అనంతుడు. మన అవగాహనకు ఆవల ఉన్నవాడు. ఆయన ఎవరికి పూర్తిగ అర్థం కానివాడు.

**– దేవుడు స్వభావ సిద్ధుడు:** ఆవల ఉన్న వాడు, మనలో జీవించు వాడు. మనకు దగ్గరగ ఉంటాడు. పునీత అగుస్తీను అంటారు: "దేవుడు నాకు మరింత దగ్గరగ ఉన్నాడు."

**– మాటలలో చెప్పలేని, వ్యక్తపరచలేని వాడు:** మనకు కలుగు దైవానుభవం చెప్పలేనిది. వర్ణింపశక్యం కానిది. మనం వ్యక్తపరచలేము. మార్మికానుభవం అన్నది ప్రేమతో కూడిన దేవునిగూర్చిన జ్ఞానం.

**– ఉదాసీనంగ జీవాత్మనందు స్వీకరించునది:** అది ఒక బహుమతిగ ఇవ్వబడినది. దానిని దేవుడు మన ఆత్మలోకి పోస్తాడు. దానిని మనకు ఇవ్వ దేవుడే నిర్ణయిస్తాడు. మన ఆత్మలో దేవుడు కార్యనిర్వాహన చేస్తాడు.

**– బహుమతిగ:** అది దేవునియొక్క ఉచిత బహుమానం.

**– మొత్తం మనిషిని బందీచేయును:** ఈ అనుభవాన్ని పొందుతున్నపుడు మనం పూర్తిగ లీనమై ఉంటాము.

**– అతనిని లేక ఆమెను రూపాంతరం చెందిస్తుంది:** ఓ రకమైన మార్పును తీసుకువస్తుంది. శాశ్వతంగ మనలో మార్పు వస్తుంది. వెనుకకు తిరిగి వెళ్లడం ఉండదు. మనం ఎల్లప్పుడు దీనిని గుర్తు పెట్టుకుంటాం. మనం పాత మనిషిమి కాము.

**– అతనిని లేక ఆమెను దేవునితో సమైక్య పరుస్తుంది:** ఐక్యతను తెస్తుంది. దేవునితో మనం ఐక్యం చెందుతాం.

**– ముందస్తు ప్రయత్నమేమి లేకుండ:** అది దేవుడు మనకు ఇచ్చిన బహుమానం. అది మానవ ప్రయత్నం వలన పొందినది కాదు. ఈ అనుభవం ఏ ప్రయత్నం వలన జరిగినది కాదు.

ఒకరిని, ఆత్మలో పాపభీతిని ఆవిర్భవింపజేస్తూనే, మార్మిక అనుభవం పుణ్యక్రియలు చేయ, అధిక ఉత్సాహపూరితమైన ప్రయాసలోనికి నడిపిస్తుంది.

పాపస్వభావం యెడలగల ప్రవ ృత్తిని తగ్గిస్తుంది, పుణ్యాలకు పునాది అయిన దీనతను దృఢ పరుస్తుంది. విరాగియైన సన్యాసి చురుకైన ప్రయాసద్వారా సాధించిన పుణ్యక్రియల కన్న, నమ్మదగిన మార్మికుడు అభౌతిక పుణ్యక్రియలలో ఉన్నత స్థితికి చేరుకుంటాడు. క్రైస్తవ జీవన అనుగ్రహం యొక్క కొనసాగింపే ఈ నిగూఢ జీవనం. అంటె, ఆధ్యాత్మిక పుణ్యక్రియలైన విశ్వాసం, నమ్మిక, దేవప్రేమల యందు ఎదుగుదల, పరమ పవిత్ర త్రీత్వంను వరానుభవం పొందుటను గాఢమైన చేతనావస్థలో గుర్తిస్తుంది. ప్రసిద్ధి చెందిన మార్మిక రచయితలు, పునీతులు తోమస్ అక్వినాస్, అవిలాపురి తెరేసా, సిలువ యోహాను మార్మిక జీవితం మహా క్రైస్తవ జీవనం అని తెలుపుతారు.

చాల మంది దైవశాస్త్రజ్ఞుల ప్రకారం సమగ్ర పరిపూర్ణత మార్మిక స్థితిలోనే లభిస్తుంది. క్రైస్తవ పరిపూర్ణత, బప్తిస్మంలో విత్తు రూపంలో స్వీకరించిన పరిశుద్ధతానుగ్రహం పూర్తిగ అభివృద్ధి చెందడంలోనే కలిగి ఉంది. ఈ అభివృద్ధి - దైవశాస్త్ర, నైతిక పుణ్యక్రియలు, ముఖ్యంగ క్రైస్తవ పరిపూర్ణత కలిగిన సంపూర్ణ ప్రేమ ద్వారా పరిశీలించుట జరుగుతుంది.

## B) సంభవాలు:

నిగూఢ అవ్యక్తానందపు సంభవాలు శరీరక, మానసిక, ఆధ్యాత్మికమైనవి.

### i) శారీరక సంభవాలు:

- ఈ జీవిత బంధంను పూర్తిగ అనిశ్చలత చేస్తుంది.
- శాకాహార జీవితం ధీటుగ పట్టు తప్పుతుంది, అవయవ భాగాలు చల్లబడతాయి. ఊపిరి, గుండె లయ సాదాగ తగ్గిస్తుంది.
- మార్మిక వ్యక్తి నూతన ఉత్తేజంగల బలాన్ని పొందుతాడు.

### ii) మానసిక సంభవాలు:

- ఆత్మ యొక్క శక్తులన్ని అనిశ్చలత చెందుతాయి.
- దైవ పరమ రహస్యాల గురించి అర్థం చేసుకొనే అద్భుతమైన కాంతి ఉత్పన్నమవుతుంది.

– విన్నది, చూచినది ఏది సరిగ గుర్తు ఉన్నట్లు ఉండదు, కొంత వరకు తర్కంలేని పరిస్థితి ఉంటుంది.

### iii) ఆధ్యాత్మిక సంభవాలు:

– దేవుని గురించి, దైవ విషయాల గురించి నూతన, కాంతివంతమైన తెలివి మార్మిక వ్యక్తిలో చోటుచేసుకుంటుంది.
– దేవుని కొరకు అధిక ప్రేమతో హృదయం విశాలమవుతుంది.
– దేవుని మహిమ గురించి, ఆత్మల రక్షణ గురించి భక్త్యానందంతో జ్వాల రగులుతుంది, ఇతరం నుండి పూర్తిగ త్యజింపు ఉంటుంది.
– మార్మిక వ్యక్తి చిన్న తప్పిదం చేయాలన్నా భయపడతాడు.

స్వభావికమైన అవ్యక్తానందానికి కారణం దేవుడు, దాని సంభవాలు ఏవన – ఆత్మను పవిత్రపరచే ప్రక్రియ. చొప్పించిన దేవుని తెలివి, ప్రేమలతో తృప్తిపడుతుంది. అప్రమత్తత, గతస్మృతి విశ్వసించదగిన మార్మిక అవ్యక్తానందానికి జతచేరుతాయి.

## C) బాగా అమితమైన మానస శరీరక స్పష్టమైన ప్రకటనలు:

తరచు మార్మికులు పొందిన నిర్ధారణమైన, గోచరమగు అనుభవాలు ఉన్నాయి. అవి మార్మికానుభవానికి అవసరమైన భాగాలు కావు. అవి నిజమైన మార్మిక అనుభవానికి ఉప–ఉత్పత్తులు మాత్రమే. కొందరు అంటారు: అవి కేవలం పొందికలేని మానసిక వాస్తవం, లేక స్వీయసూచన, మున్నగునవి. కాని అవి మార్మికులకు తరచు ఉన్నవి, కచ్చితమైనవి, కనుక వాటిని విస్మరించలేము. మనం గమనించ వలసిన విషయం ఏమంటె: శ్రీసభ పునీతపట్టం ఇచ్చేటపుడు, ఈ మార్మిక వాస్తవాన్ని కావలసిన ఏకైక విషయంగ ఉపయోగించదు.

**1. దర్శనాలు:** మనిషికి సహజంగ కనిపించని వస్తువు యొక్క అభౌతిక మనోగ్రహింపే దర్శనం. అది భౌతిక పదార్థాలతో కావచ్చు లేక సృజనాత్మకం కావచ్చు లేక బుద్ధికి సంబంధిచిన దర్శనం కావచ్చు. బుద్ధికి సంబంధించిన దర్శనాన్ని సాతాను సృష్టించ లేదు. తక్కిన వాటిని అది సృష్టించగలదు. సాతానుదైతే గుర్తించడం

ఎలా? మొదట తియ్యగ ఉంటుంది, తరువాత గర్వం, అలజడి. మనిషిదైతే - ఆడంబరం ఉంటుంది.

## 2. పంచగాయాల గుర్తు:

సిలువ వేయబడిన క్రీస్తు గాయాలను పోలిన గాయలు మానవ శరీరంపై చాలా స్వాభావికంగ కనిపించేది పంచగాయల గుర్తు. సాధారణంగ చేతులలో, పాదాలలో, ప్రక్కలో, ఒకొక్కప్పుడు ముళ్ళ కిరీటపు తలలో కూడ గాయాలు, కొరడా దెబ్బలు పోలిన గాయాలు శరీర మంతట కనిపిస్తాయి. గాయాలు కనిపించవచ్చు, కనిపించకపోవచ్చు, శాశ్వతంగ ఉండవచ్చు లేక స్వల్పకాలమే ఉండవచ్చు. ఆధ్యాత్మిక చరిత్రలో ఈ ప్రథమ అవ్యాక్తానందమును పునీత అస్సిసిపురి ఫ్రాన్సిసులో గుర్తించారు. ఆ పునీతుడు దీనిని సెప్టెంబరు 17, 1224 లో పొందాడు. నిజమైన, స్పష్టమైన నిగూఢ పంచగాయాలను గుర్తించడానికి కొన్ని ప్రమాణాలు ఈ దిగువన ఉన్నాయి.

- నిజమైన పంచగాయాల గుర్తులు సాధారణంగ శ్రమల క్రీస్తునందు సంప్రదాయంగ చూపే గాయాల స్థానాలందే గుర్తించవచ్చు.

- సాధారణంగ నిజమైన పంచగాయాల గుర్తులనుండి క్రీస్తు శ్రమలను ధ్యానించే దినాలలో రక్తం కారడం సంభవిస్తుంది.

- నిజమైన పంచగాయల గుర్తులు వట్టినే కనిపించవు, రక్తం ఎప్పుడు శుభ్రంగ, శుద్ధిగ ఉంటుంది, గాయాలను ఔషదాలతో మాన్పలేము.

- కొన్నియెడల రక్తం కారడం చాలా ఎక్కువగ ఉంటుంది, అందుకు ఏవిధంగాను తగిన కారణం చెప్పలేము.

- ఎవరైతే పుణ్యక్రియలను వీరోచిత స్థాయిలో అమలు చేస్తారో వారిలో, క్రీస్తు శ్రమలయెడ మృదువైన ప్రేమ ఉన్నవారిలో, సాధారణంగ ఈ పంచగాయాల గుర్తులు కనిపిస్తాయి, ముఖ్యంగ భక్తానందం లేక ప్రార్థన సమయంలో ఇది సంభవిస్తుంది.

- నిజమైన పంచగాయల గుర్తు సాధారణంగ వెంటనే సంభవిస్తుంది.

## 3. రక్త కన్నీరు, రక్త చెమట:

వీటి పేర్లనుబట్టి, ఈ రెండు వాస్తవాలు, చర్మంపైన రంధ్రాల ద్వారా కారే రక్తపు ధారలో భాగమై ఉన్నాయి. ముఖ్యంగ, ముఖమునందు, నుదురుపై లేక కళ్ళనుండి కన్నీటి బొట్లులా ప్రవహించవచ్చు. మనకున్న దాకలాలు: పునీత లుట్గార్డ్ (1182–1246), ముక్తి భాగ్యం పొందిన క్రిస్టీనా (1242–1312).

## 4. హృదయాల మార్పిడి:

చూచినంతవరకు, ఈ వాస్తవం మార్మికుని హృదయాన్ని పెకిలివేయుటలో భాగమై ఉంది. మరొక హృదయం ప్రత్యమ్నాయంగ వస్తుంది, మనం ఊహించునట్లు అది క్రీస్తు హృదయమై ఉంటుంది. దైవశాస్త్రం సాధ్యమైనంత వరకు ఇచ్చే వివరణ ప్రకారం ఈ హృదయాల మార్పిడి నిగూఢమైనది, ఆధ్యాత్మికమైనది. ఈ విషయం గురించి మనకు పునీతులు సియన్నాపురి కేతరిన్, జెట్రూడు, మార్గరెట్ మేరి అలకొక్ జీవితాలలో గ్రంథస్థం అయినాయి.

## 5. తినుటకు వీలుపడని లేక సంపూర్ణ ఉపవాసం:

ఈ వాస్తవం, ప్రకృతి శక్తులకు భిన్నంగ, కొంతకాలం పోషకం నుండి పూర్తి సంయమన నిరాహారమే. ఇది ముక్తిభాగ్యం పొందిన ఆన్జెల దొ ఫోలిగ్నొ, పునీత సియన్నాపురి కేతరిన్, పునీత లిడ్వినా జీవితాలలో గుర్తించదగ్గ వాస్తవం.

## 6. సుదీర్ఘ కాలం నిద్రలేమి:

సుదీర్ఘ కాలంగ నిద్ర లేకుండ గడిపిన, లేద అసలు తగినంతగ కూడ నిద్రపోని అనేక మంది పునీతుల గురించి నమోదు చేయబడి ఉంది. బాగా తెలిసిన సందర్భాలు: పునీతులు మకారియుస్, లుడ్వినా, రోస్ ఆఫ్ లీమా, మున్నగువారిలో గోచరమయ్యాయి.

## 7. బాగా చురుకుగనున్న:

ఈ వాస్తవంలో మార్పు వెంటనే సంభవిస్తుంది లేక భౌతిక శరీరం యొక్క కదలిక ఒట్టినే జోక్యంతో కూడిన రోదసిగుండ వెలుతున్నట్లు ఉంటుంది. అనేకమంది పునీతులు, ఫిలిప్ నేరి, పాదువాపురి అంతోనివారు, మార్టిన్ దెపోరెస్ల జీవితాలలో ఈ సంఘటనలు నమోదు చేయబడినవి.

## 8. ద్విస్థాన స్థితి (ఒకేసారి రెండు స్థలాల్లో ఉండుట):

అసామాన్య మార్మిక వాస్తవంలో ఇది మహా భారీయైన వాటిల్లో ఒకటి, వివరించుటకు కూడ చాలా కష్టతరమైన వాటిల్లో ఒకటి. స్పష్టంగ ఒకే సమయంలో భౌతిక శరీరంతో రెండు వేరువేరు స్థలాల్లో ఉండుట దీనిలో భాగమై ఉంది. ఈ వరం పొందిన కొందరు పునీతులు: క్లెమెంట్, అస్సిసిపురి ఫ్రాన్సిస్, పాదువాపురి అంతోని, ఫ్రాన్సిస్ గ్జేవియర్, మార్టిన్ దెపోరెస్, అల్ఫోన్సియస్ లిగోరి.

## 9. శరీరాల్లోకి చొచ్చుకు పోగల వరం:

ఒక భౌతిక శరీరం మరొక దానిగుండ చొచ్చుకు పోవు వాస్తవమిది. పునీత దొమినికుకు ఈ వరం ఉండినట్లు నమోదయింది.

## 10. నిగూఢ కాంతి పుంజం:

ఈ వాస్తవంలో, మార్మికుల శరీరాల నుండి కొన్ని సమయాల్లో చాల ప్రకాశవంతమైన వెలుగు విరజిమ్ముట అన్నది, ముఖ్యంగ ఏకాగ్రతలో లేద అవ్యక్తానందంలో ఉన్నపుడు ఉంటుంది. ఈ వరాన్ని పొందిన పునీతులు: లూయిస్ బెట్రాండ్, లొయోల ఇగ్నేషియస్, ఫిలిప్ నేరి, ఫ్రాన్సిస్ డి సేల్స్, చార్లస్ బొర్రొమెయొ, జాన్ మరియ వియన్నీ.

## 11. అభౌతిక పరిమళం:

ఈ వాస్తవంలో, పునీతుని యొక్క శరీరం లేద ఆతని సమాది తీయని సువాసనలను వెలువరిస్తాయి. తరచు, ఈ సువాసన తెలిసిన ఏ ఇతర సుగంధాలతోను పోల్చలేము. ఈ వరాన్ని పొందిన పునీతులు: ఫిలిప్ నేరి, జరార్డ్ మజెల్లా, సిలువ యోహాను, అస్సిసిపురి ఫ్రాన్సిస్, దోమినిక్, తోమస్ అక్వినాస్, అవిలాపురి తెరేసా, రోస్ ఆఫ్ లీమా.

## 12. దహనం కాని శరీరాలు:

చాల మంది పునీతులు ఈ వాస్తవాన్ని పొందినట్లు నమోదై ఉంది. వారి శరీరాలుగాని, వారికి సంబంధించిన వస్తువులుగాని అగ్నిలో పడేసిన, మంటల మీద పెట్టిన అవి కాలిపోలేదు. అలాంటి వరం పొందిన పునీతులు: పోలికార్ప్, సియన్నాపురి కేతరిన్.

### 13. శారీరక సాగుదల:

ఈ వాస్తవం తక్కువ మంది పునీతుల జీవితాల్లో (జెనోవపురి కాతరిన్) సాక్షాత్కరించింది. ఈ స్థితిలో ఒక మనిషి యొక్క శరీరం మొత్తంగాని, శరీర భాగంగాని సాధారణ పరిణామంకన్న బాగా సాగుతుంది.

### 14. ఇతర అద్భుతమైన శక్తులు:

పునీతులలో వారి శరీరం కుళ్లిపోని స్వభావం సాపేక్షికంగ సాధారణమైన వాస్తవం. అట్టి పునీతులు: ఫ్రాన్సిస్ దె సేల్స్, జాన్ ఆఫ్ గాడ్, సిలువ పౌలు, ఫిలిప్ నేరి, ఇగ్నేషియస్ లొయొల, ఫ్రాన్సిస్ గ్జేవియర్, అవిలపురి తెరేసా, సిలువ యోహాను, పదవ భక్తినాథుడు, లీమాపురి రోజా.

పునీత అంబ్రోస్, మార్సెల్లినుస్, అపొస్తులుడు కాని పేతురు, బొలొగ్నాపురి కేతరిన్, టొలంటినొపురి నికొలస్‌ల మృత దేహాల నుండి రక్తం కారినట్లు కూడ చెబుతారు. పునీత జనారియుస్ వారి రక్తం యొక్క అద్భుతశక్తి ప్రత్యేకమైంది, ఇది అందరికి తెలిసిన విషయం.

### 15. ఇతరుల మనసుల్లోని విషయాలను తెలుసుకోగలుగుట:

ఈ వాస్తవంలో మనసుల్లో ఉన్నదానిని తెలుసుకొనుట జరుగుతుంది, అభౌతికంగ దేవుడే స్వయంగ వాటిని వ్యక్తపరుస్తాడు. ఈ దైవానుగ్రహం, ఇతరుల బాగుగురించిగాని, కొన్నియెడల వరం పొందిన వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక లాభం గురించిగాని దయచేయబడుతుంది. అలా పొందిన వారు పునీత ఫిలిప్ నేరి, పునీత జాన్ మరియ వియన్నీ.

### 16. పవిత్రతను గుర్తించు సత్యజ్ఞానం (Hierognosis):

ఈ వాస్తవం, పవిత్ర వ్యక్తిని, పవిత్ర స్థలాన్ని, పవిత్ర వస్తువును వెనువెంటనే గుర్తించగల సామర్థ్యాన్ని తెలుపుతుంది. పునీత సియన్నాపురి కేతరిన్, పునీత లిడ్విన ఈ అనుగ్రహాన్ని పొందారు.

### 17. ప్రేమ జ్వాలలు:

ఇది మార్మికునికున్న దేవుని ప్రేమ యొక్క స్పష్టమైన బాహ్య చర్య. శరీరంలో రగులుతున్న వేడి యొక్క అనుభవం ఉంటుంది లేక వేసుకున్న బట్టలు, ముఖ్యంగ

హృదయమందు వాడియైన వేడి అనిపిస్తుంది. ఇది మూడు స్థాయిలను ప్రవేశపెడుతుంది: **1. సాదాయైన లోపలి హృదయం:** హృదయ భాగమందు, కొన్నియెడల శరీరమంత వ్యాపిస్తున్న అమితమైన వేడి కనిపిస్తుంది. **2. వాడియైన తీవ్రమైన కోరికలు:** వేడి ఎంత తారాస్థాయిని అందుకుంటుందంటె, ఆ సమయంలో చల్లని లేపనాలు వేడిని తగ్గించడానికి పూయవలసి ఉంటుంది. **3. వస్తువులు వేడెక్కుట:** వేడి ఎంత తారాస్థాయిని అందుకుంటుందంటె మార్మికుడు వేసుకున్న బట్టలు కూడ వేడెక్కుతాయి. పునీతులు ఫిలిప్ నేరి, సిలువ పౌలు వంటివారు ఈ అనుభవానికి లోనైనారు.

## 18. పైకి లేవనెత్తబడుట (Lavitation):

ఎటువంటి గోచరమగు ఆధారం లేకుండ భౌతిక శరీరం గాలిలోకి లేచి, అలానే నిలిచి ఉండుట. చాల దపాలు అవ్యక్తానంద సమయంలో ఈ పైకి లేవనెత్తబడుట సంభవిస్తుంది. గమనించాలి! సాతానుకూడ ఇలా చేయగలదు. ఇది ఆధ్యాత్మికం అయితే, మహిమాన్విత శరీరానికి ముందు జరుగుతుంది. చాలమంది పునీతులు ఈ వరాన్ని పొందారు. వారిలో పునీత అవిలాపురి తెరేసా ముఖ్యులు.

## 19. దర్శనాలు:

శ్రీసభ మంచికోసంగాని, వ్యక్తియొక్క మంచికోసంగాని దాగియున్న సత్యాలను తెలియపరచ దర్శనాలు అభౌతికంగ సంభవిస్తాయి. ఈ రోజుల్లో ఇది వ్యక్తిగతమైనది. అది విశ్వాసానికి వ్యతిరేకంగ ఉంటే దానిని విడిచిపెట్టాలి. వివరణతో కూడిన దర్శనం నకిలీదై ఉంటుందని గ్రహించాలి. దైవావిష్కరణ చిన్నదిగ ఉంటుంది. దానిని పొందినవాడు నైతికంగ మంచివాడై ఉండాలి.

❋ ❋ ❋ ❋

# 6. ప్రార్థనకు షరతులు

– బ్రదర్ ఏరువ బాల సుధీర్

## 1. ప్రార్థన చేయాలని మనస్ఫూర్తిగ ఆశించుట:



మనం ఏదైన సాధించాలని ఆశపడితే సాధ్యమైనంత వరకు సాధిస్తాం. మనం అనుకుంటె, మనకు వస్తున్న కలతల నుండి లేక పరధ్యానం నుండి వైదొలగి, ఎక్కువగ ఆశతో ఉన్న హృదయం మనల్ని ప్రభువువైపు మరల్చి, ప్రార్థనలో గడపడానికి, కేంద్రీకరించడానికి ఉపయోగపడుతుంది. ఎంత ఎక్కువ బలమైన ఆశతో ప్రార్థనలో సమయాన్ని గడుపుతామో, అంత సునాయాసంగ కలతలను లేక పరధ్యానం ద్వారా వృధా చేస్తున్న సమయాన్ని సరిగ్గ ఉపయోగించుకుంటాం.

## 2. మానవత్వాన్ని అంగీకరించుట:

పరధ్యానం లేక కలతలు జీవితంలో ఒక భాగం. మన తలంపులు, మనస్సు ఎప్పటికప్పుడు వేరే విషయాల మీద తిరగడం లేక చక్కర్లు కొట్టడం సర్వసాధారణం. మనం మన మానవ స్థితిని అంగీకరించాలి. ప్రార్థన చేస్తున్న క్రియలో చీటికిమాటికి వస్తున్న కలతలు లేక పరధ్యానాలను కూడ అంగీకరించాలి. మనకు వస్తున్న పరధ్యానాలకుగాని, కలతలకుగాని దారి ఇచ్చినట్లయితే, కచ్చితంగ వాటికి క్షమాపన కోరుకొని, అందులకుగాను ప్రభువునుండి పాపమన్నింపు అడగాలి. అవి అసంపూర్ణమైనప్పటికిని, అందుకు కూడ వేడుకోవాలి. ఇక్కడ గమనించ వలసినది – మనం ఇష్టపూర్వకంగ కలతలను లేక పరధ్యానాలను ప్రోత్సహిస్తున్నామా లేక అసంపూర్ణతను ప్రోత్సహిస్తున్నామా అని కాదుగాని, వాటి ద్వారా మనం

దేవునితో గడపవలసిన అమూల్యమైన సమయాన్ని వృధాచేస్తున్నాం. సులభంగ కలతలను లేక పరధ్యానాలను వైదొలగించ వలసిన మనం, అలాకాక, వాటిని ఆహ్వానించడం ద్వారా లేక వాటికి దారి ఇవ్వడం ద్వారా మనమే నష్టపోతున్నాం.

### 3. అయిష్టపూర్వకమైన కలతలు/ పరధ్యానాలు లోతైన ప్రార్థనకు అడ్డుగ ఉండవు:

కలతలు / పరధ్యానాలు అయిష్టపూర్వకం అయినప్పటికిని, ప్రార్థనలో మనసులో నిమగ్నం అవడం ద్వారా అవి ఎక్కువగ ప్రభావం చూపవు. ఇది ఎప్పుడు జరుగుతుందంటె, మనం లోతైన ప్రార్థనలో నిమగ్నం అయినప్పుడు, ప్రభుని ప్రేమామయ సన్నిధిలో ఉన్నపుడు, మనం దేవునితో ఐక్యంగ ఉన్నపుడు, మన కలతలు / పరధ్యానాలు ఇష్టపూర్వకం కానపుడు అవి మాయమౌతాయి. ఇష్టపూర్వకమైన కలతలు / పరధ్యానం, అనగ మనకు తెలిసి, నిర్ణయం తీసుకొని, మన దృష్టిని ప్రార్థనకు ఇవ్వకుండ, వేరే విషయాల మీద కేంద్రీకరించడం. కొన్నిసార్లు మనం కలతలను / పరధ్యానాలను ప్రార్థన చేసుకోడానికి ఉపయోగించుకుంటాం, కాని కలతలను / పరధ్యానాలను ఆహ్వానించడం లాంటిది కాదు. అలా జరిగితే, కలతలు / పరధ్యానాలు మనలను బంధీలను చేస్తాయి. మనం ఎపుడైతే కలతలను / పరధ్యానాలను ప్రార్థన కొరకు ఉపయోగిస్తామో అపుడు మనం వాటిని బంధీ చేస్తున్నామని గుర్తించాలి.

### 4. ప్రార్థనను నెమ్మదిగ ప్రారంభించుట:

మనం తొందరపాటు ప్రపంచంలో జీవిస్తున్నాం. పూర్వం జనులు కాలినడకన, గుర్రం మీద, ఎడ్లబండి మీద ప్రయాణాలు చేసినపుడు ప్రపంచం చాల నెమ్మదిగ కదిలేది. ఇంకను కొన్ని చోట్ల ఇప్పటికి ప్రజలు వాటినే ప్రయాణానికి ఉపయోగిస్తున్నారు. ఎవరైతే నెమ్మది ప్రపంచానికి అలవాటు పడ్డారో వారికి ప్రార్థన సులభతరం అవుతుంది. ఎందుకంటె, వారి నెమ్మదితనానికి, జీవనశైలికి ప్రార్థన నప్పుతుంది. కాని ఇపుడు చాల మందికి తొందర ఎక్కువ. మనం వేగవంతంగ ప్రయాణం చేస్తున్నాం. మనం ఎక్కువ పనిని తక్కువ సమయంలో చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఇప్పుడు రకరకాల పరికరాల ద్వారా మన పని

మరింత వేగంగ మారింది. ఇలాంటి జీవిత శైలినుండి ప్రశాంతమైన జీవితశైలికి వచ్చి, ప్రార్థనను మొదలు పెట్టడం అంటె, సహజంగ చాల కష్టతరమైంది. దేవుని వాక్కును వినడానికి మనల్ని మనం సిద్ధపరుచుకోవాలి. మనం ప్రశాంతంగ ఉండి, దేవుని వాక్కును వింటె, అది మన హృదయాలకు తాకుతుంది, లేదంటె, కేవలం ఆలోచనలకు మాత్రమే పరిమితమవుతుంది. ఈ రోజుల్లో మనల్ని మనం తెలుసుకొనే సాధనను నేర్చుకుంటున్నాం, తద్వారా అది మనం ఇంకను ఎక్కువగ, నెమ్మదిగ, ప్రార్థనపూర్వకంగ ఉండడానికి ఉపయోగపడుతుంది.

మనం ప్రార్థనను నెమ్మదిగ ప్రారంభించడం చాల ముఖ్యం. ఫలితంగ మనం ఎక్కువ సమయం ప్రశాంతంగ మనలో ఉన్న వ్యక్తి గురించి ఎరిగిన వారం అవుతాం. మనం దేవుని సన్నిధిని గుర్తించని యెడల, మనం నిజంగ ఆ వ్యక్తితో ఉండలేము, సంభాషణ జరుపలేము. దేవుడు మనతో ఎల్లప్పుడు ఉన్నప్పటికి, మనం మాత్రం దేవునితో లేము. ప్రార్థనలో ఎదగడానికి చేయవలసిన ముఖ్యమైన పని ఏమంటె, దేవుని సన్నిధిని గుర్తించుకొని, కలతలకు / పరధ్యానాలకు లోనైనపుడు, దేవుని వైపు మరలి, మరల ఆయన శరణను వేడుకొని, ఆయన సన్నిధిని ఆశ్రయించాలి.

## 5. ప్రార్థనకు ఒక పద్ధతి ఉంటుంది:

ఏర్పరచిన పద్ధతిని కొనసాగిస్తు, ప్రార్థన చేయడం సులభతరం. దివ్యపూజాబలి, శ్రీసభ ప్రార్థనావళి లాంటివి ఒక పద్ధతి ప్రకారం ఏర్పరచిన ప్రార్థనలు. ఒక పద్ధతినుండి మరొక పద్ధతికి మారుతున్నపుడు ఇవి చాల ఉపయోగపడతాయి.

ప్రార్థనకు వేరే పద్ధతలు ఏవన: వాక్యాన్ని ఉపయోగించడం, మననం చేయడం, దేవునితో మాట్లాడడం, దేవుని స్వరాన్ని ఆలకించడం, దేవుని సన్నిధిలో గడపడం, విన్నపములు, కృతజ్ఞతలు – ఇలాంటి పద్ధతులన్ని కచ్చితంగ ఉపయోగించవలసిన అవసరం లేదు. కాని, వీటియొక్క ఉపయోగం ద్వారా తప్పక ఫలితం ఉంటుంది. అలానే, ఫలితం అనేది మనం ఉపయోగించే క్రియల మీద, పవిత్రాత్మ ప్రేరణ మీద, మనం అలజడిగ ఉన్నామా లేక శాంతంగ ఉన్నామా, ఆలకిస్తున్నామా లేక కలతలను ఆహ్వానిస్తున్నామా, మనం ఏ సందర్భంలో

ప్రార్థిస్తున్నామో దానినిబట్టి ఆధారపడి ఉంటుంది. ఒకొక సందర్భంలో మనం తక్కువ చురుకుగ ఉంటాం. ఇంకా కొన్ని సందర్భాలలో ఎక్కువ చురుకుగ ఉంటాం. మనలో నెమ్మది, ఆశ, స్ఫూర్తి పెరుగుతున్న కొలది ప్రార్థనలో ఒక స్థాయినుండి మరొక స్థాయికి ఎదుగుతాం. ప్రార్థనకు మనం ఒక పద్ధతిని ఏర్పరచుకోవాలి. ఇది మన ప్రార్థన ప్రారంభంలో ఒక భాగమే.

## 6. చేసిన ప్రార్థన మీద సమీక్ష:

ప్రార్థన మీద సమీక్ష అనేది చాల ముఖ్యమైన ప్రార్థన క్రియ. మన ప్రార్థన విజయవంతం అయిందో లేక విఫలం అయిందో తెలుసుకోవాలంటె సమీక్ష చాల అవసరం. సమీక్ష లేకపోతె ఏదో ముఖ్యమైన దానిని కోల్పోతున్నట్లు అని, ప్రార్థన మీద సమీక్ష కొరకు చాల సమయం కావాలని కూడ పునీత ఇగ్నేషియస్ అన్నారు. ఆయన మాటలలో "ఎవరైతే దేవుని పిలుపును అందుకొని, ఒక నిర్ణయం తీసుకునే వారికి, అందులో భాగంగ 30 రోజులు వడకంలో పాల్గొంటున్న వారికి ఇంకా చాల అవసరం. ఒక గంట ప్రార్థన చేస్తే 15 నిముషాలు సమీక్ష కొరకు కావాలి." ఈ సమీక్ష చేయడానికి ప్రార్థన పుస్తకంలో రకరకాల ప్రశ్నలు ఉన్నాయి. ఉదాహరణకు, నేను దేవున్ని ఆలకించడానికి సమయాన్ని ఇస్తున్నానా? మన అనుదిన జీవితంలో జరిగే రెండు అనుభవాలను పరిశీలించాలి. ఒకటి యథార్థమైనది, రెండవది వ్యతిరేకమైనది. రెండు ప్రశ్నలు చాల వరకు మన జీవితంలో ఉపయోగపడతాయి.

✻ ✻ ✻ ✻

# 7. ప్రార్థనా చికిత్స

**- బ్రదర్ జెరోమ్ ఇమ్మానువేల్ లూయిస్**



## A) అస్వస్థతను స్వీకరించుట:

మన శరీరం విశ్రాంతిగ ఉన్నపుడు స్వస్థత అనునది సులభంగ సాధ్యం అవుతుంది. దేవుడే స్వయంగ మనకు అస్వస్థతను, సమస్యలను ఇస్తున్నాడని భావించి, భ్రమించి, మనస్సు శరీరాలను ఆ విధంగ తయారుచేసుకుంటాం. ఈ ఆంతరంగిక ఆందోళన స్వస్థత కార్యాన్ని ఆటంకపరుస్తు, ఈ స్వస్థతా నిర్వాహణను కష్టతరం చేస్తుంది. సత్యమేమంటే, దేవుడు ఎన్నడు అస్వస్థతను కోరుకోడు. మనం బాధపడాలని దేవుడు ఎన్నడు తలంచడు. దేవుడు తన సృజనాత్మకతను, స్వస్థతా శక్తిని మన జీవితాలలో నింపి, తాను ఇష్టపడే స్వస్థతను మనకు చేకూర్చుతాడు. మనకు దేవునితో భేదాభిప్రాయాలు ఉండి, ఆయన పంపిన ప్రణాళికలను తెలుసుకొనక, స్వీకరించకపోతే, ఆయన శక్తిని మనం మన జీవితాలలో అడ్డుకున్నట్లే. కావున, దేవుడు మన జీవితాలలో అనుమతించే వాటిని స్వీకరించడానికి సిద్ధంగ ఉండాలి. ఆ అనుమతితో మన జీవితంలో ఆ అనారోగ్యం జీవితకాలం వరకు ఉన్నాగాని, స్వీకరింప సిద్ధపడాలి. మన అనారోగ్యాన్ని ఒక శాపంగకాక ఆశీర్వదంగ, బహుమతిగ, క్రీస్తుని మహిమలో పాలుపంచుకొనే ఓ అవకాశంగ గ్రహిస్తేనే ఈ సమర్పణ సాధ్యం అవుతుంది.

## B) చిత్తశుద్ధిగల ఆశతో స్వస్థత:

స్వస్థత పొందాలనే వ్యక్తికి దృఢమైన కోరిక లేనపుడు, స్వస్థత అసాధ్యంగ మారుతుంది. అదే సమయంలో ఓ వ్యక్తి స్వస్థత పొందాలని గట్టిగ కోరుకుంటే స్వస్థత సులభతరం అవుతుంది. నిజంగ ఒక వ్యక్తి త్రాగుడు అలవాటును

మానుకోవాలని అతను అనుకోనపుడు, ఆశించనపుడు ఎవరు అతనిని మార్చలేరు. ఈ సత్యమే ఏ ఇతర అనారోగ్యాలకు కూడ వర్తిస్తుంది. మనం స్వస్థతను పూర్ణ మనస్సుతో గట్టిగ కోరాలి. కొన్నిసార్లు మనం అనారోగ్యాన్ని ఇతరులు యొక్క జాలిని పొందడానికి, బాధ్యతనుండి తప్పించుకోడానికి, ఒక వేదసాక్షిగ నటించడానికి లేక ఇతర కారణాలకు ఉపయోగిస్తాం. ఇక్కడ మనం మన అంతరంగంలోనికి తొంగి చూడాలి. స్వస్థత పొందాలనే దృఢమైన ఆశ మనకు ఉండాలి.

## C) సకల అయిష్టతలను, కోపమును విడనాడుట:

మన మెదడు మన శరీరాన్ని మంచికో, చెడుకో ఎంత ప్రభావితం చేస్తుందో మనకు తెలుసు. శరీరం, మేధస్సు కలిసికట్టుగ పనిచేస్తాయి. మన మెదడు ఏ రకమైన అనారోగ్యానికి గురయినా, మన శరీరం కూడ ఏదో ఒక విధంగ అనారోగ్యానికి లేదా ప్రమాదాలకు గురవుతుంది.

మన శరీరంలో ఉన్న రక్షణ వ్యవస్థ మనలను వివిధ జీవాణువుల (Germs) నుండి, సూక్ష్మ క్రిముల (Virus) నుండి కాపాడుతుంది. ఎపుడయితే మన మేధ అయిష్టతతో, కోపంతో ఉంటుందో, అపుడు రక్షణ వ్యవస్థ బలహీనపడి, క్రిములు మన శరీరాన్ని లోబరచుకుంటాయి. సాధారణంగ మన శరీరంలో ఉన్న వ్యాధినిరోధక శక్తి శరీరాన్ని పీడిస్తున్న వ్యాధులనుండి స్వస్థపరుస్తుంది. కాని ఒకొక్కసారి, మేధస్సు బలహీనపడితే శరీరం కూడ బలహీన పడుతుంది. కొన్ని ఔషధాలు రోగ సూచకాలను తగ్గిస్తు శరీరంలో ఉన్న వ్యాధినిరోధక శక్తి కార్యాలను అతిగ ప్రభావితం చేస్తాయి. కాని మనస్సు ప్రశాంతంగ లేనపుడు శరీరంలోని రక్షణ వ్యవస్థ శరీరాన్ని స్వస్థతకు అడ్డుపడుతుంది.

శరీరంలోని అయిష్టత, కోపాల యొక్క హానికర ప్రభావంను పూర్తిగా అర్థం చేసుకోలేం. బహుశా అయిష్టత, కోపం ప్రప్రథమమైన హంతకులు. ఎందుకన, అవే గుండె జబ్బులకు, క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన జబ్బులకు దారితీస్తాయి. మనలో అయిష్టత, కోపం ఉన్నట్లయితే మనం శారీరక స్వస్థతను ఆశించలేము. అందుకే, మనకు కీడు చేసిన వారిని క్షమించే అవసరం ఎంతయినా ఉంది. క్షమాపణ అనునది చాల ప్రభావంగల ఔషధం. అందుకే స్వస్థతా ప్రార్థనల్లో

క్షమను గూర్చి ధ్యానిస్తు, కోపంను, అయిష్టతను తొలగించే పద్ధతులపై ఎక్కువ సమయాన్ని కేటాయిస్తాం. అవసరమైతే స్వస్థతా ప్రార్థనకు తగిన విధంగ తయారుకాడానికి ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.

## D) అనవసరమైన సకల ఆందోళనలను విసర్జించుట:

మనం జీవిస్తున్న ఈ ప్రపంచంలో ఎన్నో రకాల శబ్దకాలుష్యం (రొదలు), చివరి గడువులు (Deadlines), వాతావరణం, పొసగని ప్రజల నుండి ఎన్నో ఆందోళనలు (చింతలు), ఒత్తిడులు మనకు కలగడం చూస్తున్నాం. చింత అన్నది మన అంతరంగంలో మొదలై వీటిపై అనవసర ధోరణిని చూపిస్తుంది. కొంత ఆందోళన మనకు ఆరోగ్యకరమే. తద్వారా జీవితంలో ఎదగడానికి కొన్ని సవాళ్ళను ఎదుర్కొంటాం. కాని, చాలాసార్లు మనం మన దుష్ట దృష్టి వలన, అనవసరమైన కారణాలవల్ల అనారోగ్య చింతలను తెచ్చుకుంటాం.

"నా" అనే వ్యక్తిగత భావంతో "నా పని", నా సమయం, నా మార్గం అనే ఆలోచనలు అనవసరమైన చింతలకు దారితీస్తాయి. నేను ఒక పనినిగాని స్వార్థంతో "నాది" అని భావిస్తే, అది అధికంగ చిక్కుకొనేటట్లు చేసి, ఎక్కువ కలతకు గురిచేస్తుంది. అధికంగ మధనపడే వారికి పేగుపుండ్ల వ్యాధి సంభవిస్తుంది. అన్ని నా ఆలోచన ప్రకారం జరగాలని అధికారికంగ కోరుకోవడం కూడ చింతకు కారణమే. "నా" అనే ఆలోచనే శ్రేష్టం అనుకొనే వారు కోపం, ఓర్పులేమి, అశాంతికరమైన సంబంధాలకు గురవుతారు.

చింతకు మరో కారణం కొన్ని వస్తువులపై, వ్యక్తులపై, మితిమీరిన అనుబంధం కలిగి ఉండడం. మనం గట్టిగా పట్టుపట్టిన వాటిని కోల్పోతాం అనే ఆలోచన, భయం సహజంగ ఉంటుంది. మనం దేనికైన మనోద్వేగంతో అతుక్కుపోతే కలతలు, భయం, అయిష్టతలనే మనోద్వేగ బాధలకు గురవుతాం.

మనం ప్రశాంతంగ కూర్చొని చింతలకు, అనారోగ్యానికి కారణాలను కనిపెట్టాలి. మనం మానసికంగ కృంగినపుడు శారీరకంగ, భావాత్మకంగ కూడ, మానోభావాలు దెబ్బతింటాయి. ఈ ఆందోళన మన ప్రస్తుత రోగానికి కారణం

కావచ్చు. ఈ చింతలను, వాటి మూలాలను కనుగొన్న తరువాత మనలను గట్టిగ పట్టుకున్న వాటిని వదలివేయాలి. మనం పిడికిలి మూసి, ఏ విషయాలనైతే గట్టిగ పట్టుకుంటామో, అలానే పట్టుకొని, దేవుని సన్నిధిలో, క్రీస్తుప్రభుని ప్రార్థనలో ఆ పిడికిలిని విడిచిపెట్టాలి.

## E) శారీరక స్వస్థతా బలంలో నమ్మకం:

శరీరంలో ఉన్న స్వస్థతాశక్తి నిజంగ ఒక అద్భుతం. మన శరీరంలో ఉన్న ఎన్నో గాయాలు, పోట్లు అద్భుత రీతిగ కోలుకోవడం, నయం కావడం చూస్తునే ఉంటాం. శరీరంలో ఉన్న రోగనిరోధక శక్తులు మన శరీరంపై దాడి చేస్తున్న క్రిములనుండి నిరంతరం కాపాడుతు ఉంటుంది. ఈ వ్యవస్థను ఎంతగా నమ్మితే అది అంత బలంగ తయారవుతుంది. మన ఈ నమ్మకాన్ని ప్రకటించే విధానంబట్టి ఈ స్వస్థతాశక్తి పనిచేస్తున్నట్లు భావించడమే. “చూచుటయే నమ్ముట.” ఈ స్వస్థతా ప్రార్థనలో మనం స్వస్థతకు అడ్డుగా ఉన్నవాటిని తొలగించడం మన ఆలోచనల్లో చూస్తాం. అనారోగ్యంతో ఉన్న భాగం నల్లమచ్చలతో ఉన్నట్లు చూస్తాం, కాని క్రీస్తు వెలుగులో, తన స్వస్థత వలన నయమయి, శరీరం ఆరోగ్యంగ మారడం చూస్తాం.

## F) యేసుని స్వస్థతా శక్తియందు విశ్వాసం:

శతాబ్దాల క్రితం ఈ లోకంలో మారుమూల స్థలంలో జీవిస్తు, నడుస్తు, పనిచేస్తు ఎందరివో జీవితాలలో స్వస్థతను సమకూర్చిన ఆ యేసే ఈనాడు తన ఆత్మశక్తితో మనలో జీవిస్తు, పనిచేస్తున్నాడు. మన దేహంలో ఉన్న ప్రకృతిసిద్ధమైన స్వస్థతాశక్తి వలె, యేసుప్రభుని స్వస్థతాశక్తిని కూడ విశ్వసించే వ్యక్తులలో అధిక ప్రభావంతో పనిచేస్తుంది. మనం శరీర స్వస్థతా శక్తితో చేసినట్లు, యేసుప్రభువు మనకు స్వస్థత పరుస్తున్నారని గట్టిగ విశ్వసిస్తే మనం మన జీవితంలో గొప్ప అద్భుతాలను చూస్తాం. ప్రభుని స్వస్థతపరచే వెలుగు మన శరీరంను నింపుతు, శుద్ధీకరిస్తు, మన ప్రతి అణువును ఉత్తేజపరుస్తు, ప్రతి అంగాన్ని నూత్నీకరిస్తు, మనలో సమస్తాన్ని సంపూర్తి గావిస్తు, స్వస్థత పరుస్తున్నట్లు చూడవచ్చు. కచ్చితంగ ఇలా వట్టిగ ఊహించుకోవడం మనలను స్వస్థత పరచదుగాని, ప్రభువు నుండి లభించే స్వస్థతను పూర్తిగ స్వీకరించడానికి, మనలను మనోద్వేగంగ, శారీరకంగ, మానసికంగ తయారుచేస్తుంది.

ప్రభువు కచ్చితంగ, మనలను మనోద్వేగంతో పీడిస్తున్న వాటినుండి స్వస్థతపరుస్తు, మన అంతరంలోని ఆందోళన, అశాంతి కలిగిస్తున్న వాటినుండి మనకు స్వేచ్ఛ కలిగించాలని ఆశిస్తున్నాడు. ఆయన మనలను నిరంతరం క్షమాగుణంలో ఒక లోతైన అంతస్థును చేరుస్తు, అనారోగ్యమైన ఆందోళనను, కోపాన్ని విడిచిపెట్టడానికి సహాయపడతారు. ఆయన మన అనారోగ్యపు ఆందోళనను, కోపాలకు కారణమైన వాటిని తెలుసుకొని జీవితంలో గొప్ప శాంతిని పొందేలా దీవిస్తారు. ఆయన కచ్చితంగ మనలో పాపకారణమైన వాటిని, మలినమైన వాటిని తీసివేస్తు, మనం ఆధ్యాత్మికంగ ఆరోగ్యవంతులమై జీవించాలని ఆశిస్తున్నాడు.

కాని, ఆయన ప్రతిసారి మన సంపూర్ణ శారీరక స్వస్థతను కోరుకోకపోవచ్చు. ఎందుకంటె, కొన్నిసార్లు అనారోగ్యం మనకు రక్షణదాయకంగ మారవచ్చు. కొన్ని సందర్భాలలో అనారోగ్యమే మనలను దేవుని చెంతకు తీసుకొని రావచ్చు. ఇటువంటి సంఘర్షణా సమయాలలో మన అనారోగ్యాన్ని స్వీకరించుట ద్వారా, ప్రభువుకు సర్వాన్ని సమర్పించుట ద్వారా, తన దివ్యపూజలో పూర్ణ విశ్వాసం ఉంచుట ద్వారా మనలను దేవునికి దగ్గరగ తీసుకొస్తుంది. ప్రభువు అనుమతించిన అనారోగ్యాన్ని స్వీకరించడం ద్వారా పునీతులను పరిశుద్ధతలో ఎదిగేలా చేసింది. శారీరక స్వస్థత విషయంలో మనం నిరంతరం నేర్పించినట్లు, “మీ చిత్తం జరుగునుగాక!” (మత్తయి 6: 10), అని ప్రార్థించాలి. ఇలా చేయడం వలన మనం కూడ పరిశు ద్ధతలో ఎదుగుతాము.

## ప్రార్థనా చికిత్సను ప్రభావితం చేసే పది అలవాట్లు:

(పుస్తకం: “Prayer can Change your Life” by Dr. William R. Parker)

**1. ఆశాపూరిత మార్గంలో ప్రార్థన:** ప్రభువుకు మీ బలహీనతలను సమర్పించండి. ప్రభువు మిమ్ము చూస్తున్న చూపులతో మిమ్ములను మీరు చూచుకొండి, మిమ్ము మీరు ప్రభుని ప్రేమలో లీనమైనట్లు చూసి, ప్రేమ తరంగాలను ప్రతిధ్వనింప చేయండి. ఇట్లు మీరు నిద్రపోయే సమయంలో నిద్ర లేవగానే, రోజంత గుర్తుకు వచ్చినపుడెల్లా చేయాలి. మీరు నిద్రిస్తున్న సమయంలో కూడ మీ మనస్సు ఈ ఆలోచనపై పనిచేస్తుందని గమనించాలి.

2. ఇతరుల కొరకు, మిమ్ము కష్టపెట్టిన వారి గురించి, లోకం గూర్చి ప్రార్థించండి.

3. ప్రతిరోజు ప్రార్థన కొరకు, ముఖ్యంగ ధ్యానంతో కూడిన దివ్యగ్రంథ పారాయణం కొరకు ఒక ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించండి.

4. మీ జీవిత విధానం, మీనుండి కోరే బాధ్యతలకు మీరు విశ్వసనీయంగ ఉండండి.

5. ఇతరుల అవసరముల యెడల సున్నితంగ ఉండండి. వారి అవసరాలలో రోజుకు ఒక్క మంచి కార్యమైన వారి కొరకు చేయండి.

6. పర్యావరణంలో ఉన్న ప్రతికూల శక్తులచే ప్రభావితం కాకుండ, వాటిని మార్చుడానికి ప్రయత్నించండి.

7. మీ ప్రార్థనా చికిత్సను ప్రభావితం చేయడానికి ఆత్మ పరిత్యాగం కల్పించే ఒక్క కార్యమైన చేయండి.

8. మీ నాలుకను బాధ్యతాయుతంగ ఉపయోగించండి (యాకోబు 3: 1-12).

9. మీ సహోదరుల పట్ల ప్రేమ, విశ్వసనీయత, ఆత్మ పరిత్యాగం, క్షమను పాటించండి.

10. రోజంతా ఏమి జరిగినా ప్రభువునకు ఆరాధనలు, కృతజ్ఞలు తెలపడం ఎన్నడు మరువకండి.

❊ ❊ ❊ ❊

# పారిభాషక పదకోశం

**(వేదాంత నిఘంటువులో లేని పదాలను, సౌలభ్యం కోసం ముఖ్యమైన వాటిని ఇక్కడ పారిభాషక పదకోశాన్ని సమకూర్చాము.)**

అద్భుత శక్తి: prodigy

ఆవిర్భవానికి కారణమగు: engender

ఆశ్రితవరం: favour

ఉక్కిరిబిక్కిరి అగుట: overwhelm

ఉత్సాహపూరితమైన: ardent

క్రియాశీలత: agility

గాఢమైన: profound

ఘాటైన విమర్శ: censoriousness

జీవాణువు: germ

తినుటకు వీలుపడని: inedia

దహనం కాని: incombustible

ధార: effusion

ద్విస్థానం, ద్విస్థితి: bilocation

నిగూఢ తన్మయత్వం, నిగూఢ సమైక్యత: ecstatic union

నిరాడంబర ప్రార్థన: Prayer of Simplicity

నిశబ్ద ప్రార్థన: Prayer of Quiet

నిష్ఫలమైన: aridity

నీరుకార్చు: dampen

పునస్సంధాన: consummation

పైకి లేవనెత్తబడుట: lavitation

ప్రభావిత ప్రార్థన: Affective Prayer

ప్రవేశపెట్టిన ధ్యానం: Infused Contemplation

భారియైన: stupendous

మానస ప్రార్థన: Mental Prayer

మౌఖిక ప్రార్థన: Vocal Prayer

రూపాంతర సమ్మేళన ప్రార్థన: Prayer of Transforming Union

విరాగి (యోగి): ascetic

శరీర సాగుదల: elongation

సంయమనము: Sober

సమైక్య: communion

సాధన చేసిన ధ్యానం: Acquired Contemplation

సాపేక్షికంగ: Relatively

సామాన్య సమైక్యతా ప్రార్థన: Prayer of Simple Union

స్వీయసూచన: autosuggestion

సూక్ష్మక్రిములు: virus

❋ ❋ ❋ ❋



"తండ్రీ! నీ చిత్తమైనచో
ఈ పాత్రను నా యొద్ద నుండి తొలగింపుము.
కాని నా యిష్టము కాదు. నీ చిత్తమే నెరవేరును గాక!"
అని ప్రార్థించెను.

- లూకా 22:42



# దేవుని దీవెనలకై ప్రార్థించే హృదయాలు

**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

*Holycrossprinters 9848145417*